Published by Telangana

TS-25-0034017

# సత్యమేవ జయతే

తెలుగు దినపత్రిక

- ధర్మం నిలబడాలి, సత్యం గెలవాలి, సత్యం మాత్రమే గెలవాలి జైహింద్

సంపుటి : 01 సంచిక : 228 ప్రచురణ : తెలంగాణ, ఎడిటర్ : జె. భాస్కర్, సోమవారం 15-09-2025 పేజీలు : 12 వెల : 2/-

**విలేకరులు కావలెను**


తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా "సత్యమేవ జయతే" తెలుగు దినపత్రికలో బ్యూరో మండలాల రిపోర్టర్గా పనిచేయుటకు జిల్లాల నియోజకవర్గ స్థాయిలో ఉత్సవంతులు అయిన యువతి యువకులు కావలెను కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును. రిపోర్టర్లుగా అపాయింట్మెంట్ అయిన తర్వాత వారికి లైన్ అకౌంట్ కూడా ఇవ్వబడును. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ 9959479375

# హైదరాబాద్‌లో వర్ష బీభత్సం

- వేర్వేరు ఘటనల్లో ముగ్గురు వ్యక్తులు గల్లంతు
- ముషీరాబాద్‌లో నాలాలో పడి యువకుడు మృతి
- మామను కాపాడబోయి కొట్టుకుపోయిన అల్లుడు
- గంటలో 12 సెంటీమీటర్ల రికార్డు స్థాయి వర్షపాతం
- జలమయమైన ప్రధాన రహదారులు, స్తంభించిన ట్రాఫిక్

**హైదరాబాద్: హైదరాబాద్ వ్యాప్తంగా పలు ప్రాంతాల లో వర్షం దంచికొట్టింది. ఆదివారం సాయంత్రం నుంచి భారీ వ ర్షం కురిసింది. గంట వ్యవధిలోనే దాదాపు 12 సెం.మీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు పేర్కొన్నారు. ఆయా ప్రాంతాలలో లోతట్టు ప్రాం తాలు, రహదారులు జలమయమయ్యాయి. హై టెక్ సిటీలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏ ర్పడింది. గచ్చిబౌలి పరిధి వట్టినాగులపల్లిలో తీవ్ర విషాదకర ఘటన చో టు చేసుకుంది. భారీ వర్షానికి వ ట్టినాగులపల్లిలో ఓ ఇంటి గోడ కూలిం ది. ఇద్ద రు మృతిచెందగా, నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో పు రాతన ఇళ్లలో ఉంటున్న వారు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హె చ్చరికలు జారీ చేశారు.**

భారీ వర్షం ధాటికి హబీబ్‌నగర్‌లోని అఫ్జల్ సాగర్‌లోని మంగారు బస్తీలో ఇద్దరు గల్లంతయ్యారు. నాలాలో మామా, అల్లు డు కొట్టుకుపోయారు. నాలాను దాటే క్రమంలో అదుపు తప్పి నాలాలో పడిపోయినట్లు నిర్ధారించారు. వీరిద్దరి ఆచూకీ కోసం పోలీసుల గాలిం పు చర్యలు చేపట్టారు. మరోవైపు ముషీరాబాద్‌లోఓ యువకుడు నాలాలో కొట్టుకుపోయాడు. మియాపూర్, కూకట్‌పల్లి, షేక్‌పేట, రాయదుర్గం, జూబ్లీహిల్స్, రాజేంద్రనగర్, ఖైరతాబాద్, అమీర్‌పేట, హి మాయత్‌నగర్, రామ్‌నగర్, ముషీరాబాద్, ఎల్బీనగర్, తార్నాక, కాచిగూడ, అల్వాల్, మల్కాజ్‌గిరి, కుషాయిగూడ, కాప్రా, ఉప్పల్, టోలీచౌకి, శేరిలింగంపల్లి, కీసర తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి ప్రధాన రహదారులు చెరువులను తలపించాయి. వర్షం నీటితో వాహ న చోదకుల రాకపోకలకు తీవ్ర అంతరాయమేర్పడింది. బంజారాహిల్స్‌లో జలమయమైన రహదారులను అధికారులతో కలిసి



జిహెచ్ఎంసి మేయర్ గద్వాల విజయలక్ష్మీ పరిశీలించారు. మియాపూర్, మదీనాగూడ మార్గంలో జాతీయ రహదారిపై వరదనీరు చేరింది. సికింద్రాబాద్‌లోని పలు ప్రాంతాల్లో అకస్మాత్తుగా కుండపోత వర్షం కురిసింది. కవాడీగూడ పద్మశాలీ కాలనీలో ఇళ్లల్లోకి నీరు చేరింది. బంజారాహిల్స్ కమాండ్ కంట్రోల్ సెంటర్ వద్ద రోడ్డుపై భారీగా నీరు నిలిచిపోవడంతో హైడ్రా, జిహెచ్ఎంసి సిబ్బంది రంగంలోకి దిగారు.రోడ్లపై నిలచిన నీటిని తొలగించారు. ఆర్ఆర్‌జిల్లా గడ్డి అన్నారంలో గరిష్టంగా 12 సెం.మీ వర్షపాతం నమోదైంది. హైదరాబాద్ ముషీరాబాద్ ప్రాం తంలో 12 సెం.మీ, ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో 10 సెం.మీ, అడిక్‌మెట్‌లో 9 సెం.మీ, హిమాయత్‌నగర్‌లో 7 సెం.మీ, మల్కాజ్‌గిరిలో 6 సెం.మీ, ఉప్పల్‌లో 7 సెం.మీ, అల్వాల్‌లో 7 సెం.మీ, గండిపేట 7 సెం.మీ, బండ్లగూడలో 5 సెం.మీ, నాంపల్లిలో

మిగతా 2లో



## గొప్ప రాజనీతిజ్ఞుడు బూర్గుల రామకృష్ణారావు:సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్:** హైదరాబాద్ స్టేట్ తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు 58వ వర్ధంతి సందర్భంగా ఆదివారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఘన నివాళులు అర్పించారు. జిహెచ్ఎంసి వద్ద గల బూర్గుల రామకృష్ణారావు విగ్రహం వద్ద పలువురు ప్రముఖులు నివాళు అర్పించారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(పిసిసి) రాష్ట్రఅధ్యక్షుడు, శాసనమండలి సభ్యుడు బి.మహేష్‌కుమార్ గౌడ్, బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్, ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచంద్రరావు, హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి బూసాని వెంకటేశ్వర్లు తదితరులు పలువురు ఘనంగా నివాళ్లు అర్పించారు.ఈ సందర్భంగా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(పిసిసి) రాష్ట్రఅధ్యక్షుడు, శాసనసమండలి సభ్యుడు బి.మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ వాణిని ఎలుగెత్తి చాటిన బూర్గుల రామకృష్ణారావు తెలంగాణ ఏర్పడడానికి నాంది పలికారని అన్నారు. తొలి ముఖ్యమంత్రిగా బూర్గుల రామకృష్ణారావు చెరగని ముద్ర వేశారని, వారి దూరదృష్టి ఇప్పటికీ మనందరికి ఆదర్శమని అన్నారు. భవిష్యత్ తరాలకు బూర్గుల స్ఫూర్తిదాయక నేతగా నిలిచారని కొనియాడారు. వారు చూపిన మార్గంలోనే కాంగ్రెస్ పార్టీ నడుస్తూ ప్రజాసేవకు కట్టుబడి ఉందని తెలిపారు. యువతరానికి బూర్గుల రామకృష్ణారావు గారు మార్గదర్శి అని గౌరవంతో ఆయన గుర్తుచేశారు.హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల బూర్గుల రామకృష్ణారావుకు ఆదివారం గాంధీ భవన్‌లో బూర్గుల చిత్ర పటానికి పిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తోపాలు పలువురు కాంగ్రెస్ నేతలు పూల దండ వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా పిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ గొప్ప సామాజిక సంస్కర్త, రాజనీతిజ్ఞుడు, బహు భాషావేత్త, హైదరాబాద్ రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణా రావు అని కొనియాడారు. బూర్గుల గొప్ప సామాజిక సంస్కర్త అని చెబుతూ చేపట్టిన కార్యక్రమాల గురించి వివరించారు.



## బిచ్చగాళ్ల వసతి గృహాలపై సుప్రీంకోర్టు కీలక తీర్పు

దేశవ్యాప్తంగా ఉన్న యాచకుల వసతి గృహాలు (బెగ్గర్ హోమ్‌లు) శిక్షా కేంద్రాలుగా కాకుండా, గౌరవప్రదమైన పునరావాస కేంద్రాలుగా మారాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఇవి జైళ్లను తలపించేలా ఉండకూడదని, నివాసితుల ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లితే అది రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుందని తేల్చిచెప్పింది. ఢిల్లీలోని లంపూర్ బెగ్గర్ హోమ్‌లో కలుషిత నీటి కారణంగా నివాసితులు మరణించిన ఘటనపై విచారణ జరిపిన జస్టిస్ జె.బి. పార్దీవాలా, జస్టిస్ ఆర్. మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ చారిత్రక ఆదేశాలు జారీ

మిగతా 2లో


## నన్ను తిట్టినా భరిస్తాను... కానీ...!: ప్రధాని మోదీ



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రముఖ గాయకుడు, భారతరత్న భూపేన్ హజారికాను కాంగ్రెస్ పార్టీ ఘోరంగా అవమానించిందని, ఈశాన్య రాష్ట్రాల ప్రజల మనోభావాలను దెబ్బతీయడం ఆ పార్టీకి అలవాటుగా మారిందని ఆయన ఆరోపించారు. ఆదివారం అసోంలోని దర్రాంగ్ జిల్లాలో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, "భూపేన్ హజారికాకు భారతరత్న ప్రకటించిన రోజు, 'పాటలు పాడేవారికి, డ్యాన్సులు చేసేవారికా మోదీ భారతరత్న ఇచ్చేది?' అని నాటి కాంగ్రెస్ అధ్యక్షుడు వ్యాఖ్యానించారు. ఆ మాటలు నన్ను తీవ్రంగా బాధించాయి"

మిగతా 2లో

## అంతా నివ్వెరపోయేలా భారత్ ఆర్థిక వృద్ధి: ఆర్ఎస్ఎస్ చీఫ్





## హిందీ.. సైన్స్, న్యాయ, పోలీసు మాధ్యమం

గాంధీనగర్: హిందీకి, దేశంలోని ఇతర భారతీయ భాషలకు ఎటువంటి ఘర్షణ లేదని కేంద్ర హెూం మంత్రి అమిత్ షా చెప్పారు. అయితే ఆంగ్ల మాధ్యమ ప్రభావం తగ్గించాలంటే హిందీకి మనం అనుసంధాన భాషగా ప్రాధాన్యత ఇవ్వాల్సిందే అన్నారు. హిందీ భాషకు ఉన్న సౌలభ్యత, సరళీకృత లక్షణాలతో హిందీని శాస్త్రం, న్యాయ వ్యవస్థ, పోలీసు విభాగాల వాడక ప్రామాణిక భాషగా తీర్చిదిద్దుకోవాల్సి ఉందని పిలుపు నిచ్చారు. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో హిందీ దివస్ సందర్భంగా హెూం మంత్రి 5వ అఖిల భారతీయ రాజ్‌భాషా సమ్మేళన్‌ను ఉద్దేశించి మాట్లాడారు. భారతీయ భాషల మధ్య వైరం లేదని, హిందీకి ఇతర భాషలకు పొసగదనే వాదన సరికాదని చెప్పారు. మాతృభాష ప్రాధాన్యత ఉండనే ఉంటుందన్నారు.అయితే హిందీని పరిపాలనా సౌలభ్యత కోసం కేవలం మాట్లాడే భాషగానే కాకుండా సైన్స్, జుడిషయరీ, టెక్నాలజీ, పోలీసు విభాగాల వ్యవహారిక భాషగా మల్చుకుంటే ఆయా విభాగాలలో నిర్వహణ సౌలభ్యత ఏర్పడుతుందన్నారు. హిందీని మాధ్యమ భాషగా తీర్చిదిద్దుకుంటే అనుసంధానత ఇనుమడిస్తుందన్నారు. ఏ ఇతర భాషల ప్రభావం

మిగతా 2లో



## మేడారంపై చిల్లర రాజకీయాలు

**హైదరాబాద్:** .: వచ్చే సంవత్సరం 2026 మేడారం మహా జాతరకు అటవీ మార్గాల ద్వారా నూతన రోడ్లు ఏ ర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర పంచాయితీ రాజ్, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. మేడారం మహా జాతరకు అటవీ ప్రాంతం నుండి వచ్చే భక్తుల కోసం కాల్వప ల్లి, బయ్యక్క పేట, కొండపర్తి, గోనేపల్లి మార్గాలను ఆదివారం రాష్ట్ర పంచాయితీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క జిల్లా ఎస్పీ డాక్ట ర్ శబరీష్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కొండపర్తి నుండి గోనేపల్లి మీదుగా ఆర్టీసి బస్టాండ్ వరకు నూతన రోడ్డును, గోవిందరావుపేట మండలం ముత్తాపూర్ నుం డి గోనేపల్లి మీదుగా కొంగల మడు గు వరకు భక్తులు, ఎడ్ల బండ్ల మీద వచ్చే భక్తులకు సౌకర్యార్థం, కాల్వపల్లి, బయ్యక్క పేట నుండి వచ్చే భ క్తులకు కన్నెపల్లి రోడ్డు ను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మా ట్లాడుతూ మేడారం మహా జాతరకు భ క్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున మేడారం పరిసరాలలోని అటవీ ప్రాంతంలోనే జా తరకు వచ్చే వాహనాల పార్కింగ్ చే సేలా చర్యలు తీసుకుంటున్నట్లు తె లిపారు. కాల్వపల్లి నుండి ఊ రట్టం వరకు నూతనంగా బిటి రోడ్డును ఏర్పాటు చేయడం

మిగతా 2లో



## అధికారంలోకి రాగానే. .అధికారికంగా విమోచనం

**హైదరాబాద్:** : తెలంగాణలో అధికారంలోకి రాగానే హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామని బిజెపి చీఫ్ ఎన్.రాంచందర్‌రావు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపా రు. కేంద్ర సాంస్కృతిక శాఖ అధ్వర్యంలో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. నిజాం నిరంకుశ వైఖరిని ఎదిరిస్తూ ప్రజలు చేసిన పోరాటాలు, రజాకార్ల హింసాకాండ గురించి కళ్ళకు అ ద్దినట్లు ఉన్న పలు ఫొటోలను ప్రదర్శించారు. వీటి గురిం చి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఎంతో ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ప్రసంగిస్తూ బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మజ్లిస్‌కు భయపడి విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించలేదని విమర్శించారు. ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్ళు అయినా అధికారికంగా నిర్వహించడం లేదని ఆయన విమర్శించారు. అందరూ మజ్లిస్‌కు భయపడి అధికారికంగా నిర్వహించడం లేదన్నారు.మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్ర ప్రభుత్వాలు అధికారికంగా నిర్వహిస్తున్నాయని

మిగతా 2లో

# హైదరాబాద్‌లో వర్ష బీభత్సం

5 సెం.మీ వర్షపాతం నమోదైంది. భాగ్యనగరాన్ని ఆదివారం సాయంత్రం భారీ వర్షం ముంచెత్తింది. గంటల వ్యవధిలోనే కురిసిన కుండపోత వానకు నగరం అతలాకుతలమైంది. ఈ వర్షం కారణంగా వేర్వేరు ప్రాంతాల్లో చోటుచేసుకున్న విషాద ఘటనల్లో ముగ్గురు వ్యక్తులు నాలాల్లో కొట్టుకుపోగా, వారిలో ఒకరు మరణించారు. మరో ఇద్దరి ఆచూకీ ఇంకా తెలియరాలేదు. వివరాల్లోకి వెళితే, హబీబ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని అఫ్జల్‌సాగర్ నాలా ఉద్ధృతంగా ప్రవహించడంతో ఇద్దరు వ్యక్తులు గల్లంతయ్యారు. ప్రమాదవశాత్తు నాలాలో పడిపోయిన తన మామను రక్షించేందుకు ప్రయత్నించిన అల్లుడు కూడా వరద ప్రవాహానికి కొట్టుకుపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు, విపత్తు స్పందన బృందాలు గల్లంతైన మామాఅల్లుళ్ల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. ఇదే తరహాలో ముషీరాబాద్ ప్రాంతంలో మరో విషాదం చోటుచేసుకుంది. సన్నీ (24) అనే యువకుడు నాలా పక్కనున్న గోడపై కూర్చొని ఉండగా, అది ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో అతను నాలాలో పడి కొట్టుకుపోయి మరణించాడు. ఆదివారం సాయంత్రం నగరాన్ని ముంచెత్తిన వర్షానికి ఒక గంటలో సుమారు 12 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ ధాటికి యూసఫ్‌గూడ, షేక్‌పేట, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, అమీర్‌పేట, ఎల్బీనగర్, కాప్రా సహా అనేక ప్రాంతాల్లోని ప్రధాన రహదారులు చెరువులను తలపించాయి. రోడ్లపై భారీగా వరద నీరు చేరడంతో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బంజారాహిల్స్‌లోని జలమయమైన ప్రాంతాలను జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి అధికారులతో కలిసి పరిశీలించారు. రానున్న రోజుల్లో మరిన్ని వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు.

# బిచ్చగాళ్ల వసతి గృహాలపై సుప్రీంకోర్టు కీలక తీర్పు

చేసింది. "బెగ్గర్ హోమ్‌ల పాత్ర శిక్షించేలా కాకుండా, బాధితులను కోలుకునేలా చేసి, వారిలో నైపుణ్యాలు పెంచి, తిరిగి సమాజంలో కలిసేలా చేసేదిగా ఉండాలి. 'హోమ్' (ఇల్లు) అనే పదానికే భద్రత, గౌరవం, సంరక్షణ అనే అర్థాలున్నాయి" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అధిక జనాభా, అపరిశుభ్రత, వైద్య సదుపాయాల లేమి వంటి పరిస్థితులు రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కును కాలరాయడమేనని కోర్టు పేర్కొంది. పేదరికాన్ని నేరంగా చూసే వలసవాద చట్టాల వారసత్వాన్ని విడిచిపెట్టి, సామాజిక న్యాయం అందించే ప్రదేశాలుగా ఈ హోమ్‌లను మార్చాలని సూచించింది. ఈ సందర్భంగా దేశంలోని అన్ని బెగ్గర్ హోమ్‌లకు వర్తించేలా సుప్రీంకోర్టు పలు కీలక మార్గదర్శకాలను విడుదల చేసింది. వాటిలో కొన్ని ముఖ్యమైనవి: వైద్యం, ఆరోగ్యం: హోమ్‌లో చేరిన ప్రతి వ్యక్తికీ 24 గంటల్లోగా తప్పనిసరిగా వైద్య పరీక్షలు నిర్వహించాలి.

ప్రతినెలా ఆరోగ్య తనిఖీలు చేయడంతో పాటు, అంటువ్యాధులు ప్రబలకుండా నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలి. పరిశుభ్రమైన తాగునీరు, మరుగుదొడ్లు, కీటకాల నివారణ వంటి చర్యలు చేపట్టాలి. ఆహారం, వసతి: పోషకాహార నిపుణుడి పర్యవేక్షణలో నాణ్యమైన భోజనం అందించాలి. హోమ్‌లలో పరిమితికి మించి జనాభా ఉండకుండా చూడాలి. సరైన గాలి, వెలుతురు ఉండేలా వసతులు కల్పించాలి. పునరావాసం, హక్కులు: నివాసితులు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి నైపుణ్య శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయాలి. వారికి అర్థమయ్యే భాషలో చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పించాలి. మహిళలు, పిల్లల కోసం ప్రత్యేక, సురక్షితమైన వసతులు ఉండాలి. భిక్షాటన చేస్తూ దొరికిన పిల్లలను చైల్డ్ వెల్ఫేర్ సంస్థలకు తరలించాలి. జవాబుదారీతనం: హోమ్‌ల పర్యవేక్షణకు కమిటీలను ఏర్పాటు చేయాలి. ఎవరైనా నివాసి నిర్లక్ష్యం కారణంగా మరణిస్తే, వారి కుటుంబానికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించడంతో పాటు, బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఈ మార్గదర్శకాలను ఆరు నెలల్లోగా అమలు చేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. వీటికి సంబంధించి ఒక ఉమ్మడి విధానాన్ని మూడు నెలల్లోగా రూపొందించాలని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖకు సూచించింది. తీర్పు కాపీలను తక్షణమే అమలు చేసేందుకు అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు పంపాలని రిజిస్ట్రీని ఆదేశించింది.

# నన్ను తిట్టినా భరిస్తాను... కానీ...!: ప్రధాని మోదీ

అని తెలిపారు. తనను ఎవరైనా దూషించినా తాను శివుడిలా విషాన్ని దిగమింగుతానని, కానీ ఈశాన్య ప్రజలు ఆరాధించే వ్యక్తిని అవమానిస్తే మాత్రం సహించలేనని ఆయన భావోద్వేగంగా అన్నారు. అంతకుముందు, మంగళ్‌దోయ్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రధాని మోదీ పలు కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. కొత్త మెడికల్ కాలేజీ, ఆసుపత్రి, జీఎన్‌ఎం స్కూల్, బీఎస్సీ నర్సింగ్ కాలేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. వీటితో పాటు గువాహటిలో ట్రాఫిక్ సమస్యను తగ్గించేందుకు ఉద్దేశించిన రింగ్ రోడ్డు ప్రాజెక్టు, బ్రహ్మపుత్ర నదిపై నిర్మించనున్న కురువ-నారెంగి వంతెన పనులను కూడా ప్రారంభించారు. భూపేన్ హజారికా శత జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు శనివారమే అసోంకు వచ్చినట్లు ప్రధాని గుర్తుచేశారు. ఈ పర్యటనలో భాగంగా, గోలాఘాట్ జిల్లాలోని నుమాలిగఢ్‌లో ఏర్పాటు చేసిన బయో-ఇథనాల్ ప్లాంట్‌ను కూడా ఆయన ప్రారంభించనున్నారు. అలాగే, నుమాలిగఢ్ రిఫైనరీ లిమిటెడ్‌లో పాలీప్రొఫైలిన్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి జరగడంతో పాటు, స్థానికంగా ఉపాధి అవకాశాలు భారీగా పెరుగుతాయని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. కాంగ్రెస్ పార్టీ భారతీయ సైన్యానికి మద్దతు పలకడం మానివేసి, పాక్ ఉగ్రవాదులకు జై కొడుతోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. ఈశాన్య రాష్ట్రాల పర్యటనలో భాగంగా ఆయన రెండో రోజు ఆదివారం అసోంలోని దార్రాంగ్ జిల్లాలోని మంగళ్‌డోయిలో ఓ కార్యక్రమంలో మాట్లాడారు. కాంగ్రెస్ వైఖరి విచిత్రంగా ఉంటోందని వ్యాఖ్యానించారు. పాకిస్థాన్ పెంచిపోషిస్తోన్న ఉగ్రవాదులకు మద్దతు ఇవ్వడం ద్వారా కాంగ్రెస్ ఏం సంకేతాలు ఇవ్వాలనుకొంటోందని ప్రశ్నించారు. పేరుకు అతి పురాతన పార్టీ , దేశం గురించి, ఇక్కడి మన సైనికుల గురించి ఆలోచించకుండా, ఎంతసేపూ పాక్‌కు వంత పాడుతోందని ప్రధాని మండిపడ్డారు. జాతి వ్యతిరేక శక్తులకు, చొరబాటుదార్లకు మద్దతు పలుకుతోందని విమర్శించారు. మన సరిహద్దుల్లోకి ఏ దిక్కు నుంచి అయినా చొరబాటుదార్లను బిజెపి అడ్డుకుంటుందని హెచ్చరించారు. వారు ఇక్కడికి వచ్చి, ఇక్కడి నేలను ఆక్రమించుకుని, నైసర్గిక స్వరూపాన్ని మార్చివేస్తామంటే చూస్తూ ఊరుకునేది లేదని తెలిపారు. ఆపరేషన్ సిందూర్ ఉగ్రవాదంపై పోరులో అత్యంత కీలక ఘట్టం. ఈ దశలో భారతీయత పట్ల అభిమానం ఉంటే ఎవరైనా మన సైన్యానికి మద్దతు పలకాల్సి ఉంటుంది. కానీ కాంగ్రెస్ పార్టీ నేతలు అసలు ఈ చర్యనే తప్పుపట్టారు. మన ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీసేందుకు యత్నించారని చెప్పారు. పాకిస్థాన్‌లోని కరడుగట్టిన ఉగ్రవాదులను తుదముట్టించడంలో మన సైన్యం సాగించిన సిందూర్ దశలో కాంగ్రెస్ వైఖరి దారుణంగా ఉందని విమర్శించారు. ఇక్కడ జరిగిన బహిరంగ సభలో ప్రధాని మోడీ పెద్ద ఎత్తున కాంగ్రెస్‌పై జాతి వ్యతిరేక ఆరోపణలకు దిగారు. ఆపరేషన్ సిందూర్ ఈ ప్రాంతంలోని మా కామాఖ్య చల్లని దీవెనలతో విజయవంతం అయిందని తెలిపారు. ఈ పవిత్ర స్థలికి తాను రావడం గర్వకారణంగా భావిస్తున్నానని చెప్పారు.

నెహ్రూ గాయాలతో అసామీలకు ఇప్పటికీ తీరని వెతనేదేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అసమర్థ వైఖరి దుష్పలితాలను అసామీలు ఇప్పటికీ భరించాల్సి వస్తోందన్నారు. 1962లో చైనా దురాక్రమణ దశలో నెహ్రూ అసామీలకు కల్గించిన గాయాలు ఇప్పటికీ రగులుతూనే ఉన్నాయని చెప్పారు. ఈ ప్రాంతంలో చొరబాటుదార్లను ఆక్రమిత స్థలాల నుంచి అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వా శర్మ తమ ధైర్యసాహసాలతో ఖాళీ చేయించారు, ఇందుకు ఆయన అభినందనీయులు అన్నారు. ఆక్రమణదారుల తొలిగింపు తరువాత ఇక్కడి రైతులు ఆయా భూముల్లో సాగు చేసుకుంటున్నారని తెలిపారు. ఆక్రమణదారుల ఆగడాలను, వారి దురాక్రమణలను, ఇక్కడి మహిళలు, బాలికలను అవమానించడాన్ని బిజెపి సహించబోదని చెప్పారు. దేశ భద్రత, సమగ్రత, జాతీయ భావనకు ముప్పు కల్గించే ఏ శక్తి ఆటలు సాగబోవని తెలిపారు.

ఈ ప్రాంతపు భూమిపుత్రులు భారత్ రత్న భూపెన్ హజారికాను కాంగ్రెస్ గేలి చేయడం బాధాకరం అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ అసాంను దశాబ్దాల తరబడి పాలించింది. అయితే ఈ కాలంలో బ్రహ్మపుత్ర నదిపై కేవలం మూడు వంతెనలు నిర్మించారని చెప్పారు. అయితే బిజెపి పాలన దశలో, ఈ పదేండ్లలో ఆరు భారీ నిర్మాణాలు వెలిశాయని చెప్పారు. ఇక్కడి డబుల్ ఇంజిన్ ప్రభుత్వ పనితీరు ఫలితాలు అట్టడుగు జనం వరకూ చేరుతున్నాయని తెలిపారు. అసోం పర్యటన దశలో ప్రధాని మోడీ ఇక్కడ రూ 6300 కోట్ల విలువైన ఆరోగ్య, మౌలిక సాధనాసంపత్తుల పనులకు శంకుస్థాపన చేశారు. పలు రహదారుల పనులను కూడా ప్రారంభించారు.

# హిందీ.. సైన్స్, న్యాయ, పోలీసు మాధ్యమం కావాలి: అమిత్ షా

ఎంతగా ఉన్నా భారతీయులు ఎట్టి పరిస్థితుల్లోనూ తమ తమ భాషలను పరిరక్షించుకోవాలి. అవి కాలం చెల్లకుండా శాశ్వతం అయ్యి తీరాలి. ఇందుకు తల్లిదండ్రుల బాధ్యత ఎక్కువగా ఉంటుంది. వారు పిల్లలతో వారివారి మాతృభాషలలోనే మాట్లాడితే సహజంగానే భారతీయ భాషలకు ఉనికి సార్థకత దక్కుతుందని పిలుపు నిచ్చారు. అయితే హిందీని కీలక రంగాల మాధ్యమ ప్రామాణిక భాషగా మల్చుకుంటే మంచిదని సూచించారు. హిందీకి, ఇతర భాషలకు మధ్య ఘర్షణ లేదా వివాదాలు ఉన్నాయనే వాదన కొందరి కల్పితం అన్నారు. దయానంద సరస్వతి, మహాత్మా గాంధీ, కెఎం మున్షీ, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ వంటి జ్ఞానులు ఇతరులు హిందీని ప్రామాణిక భాషగా ఆమోదించారు.

హిందీని ప్రోత్సహించారు. ఇక ఇక్కడ గుజరాత్‌లో గుజరాతీ, హిందీ ఒక్కటిగా విలసిల్లుతున్నాయి. రెండు భాషల అభివృద్ధికి ఈ ప్రాంతం గణనీయ ఉదాహరణగా నిలిచిందన్నారు. సంస్కృతం మనకు విజ్ఞాన గంగగా నిలిచింది. కాగా హిందీ విజ్ఞానాన్ని ఇంటింటికి చేరేలా చేసింది. ప్రతి భాషా మాధ్యమం ద్వారానే శాస్త్ర విజ్ఞానం ఇతరత్రా విలువైన సమాచారం అందరికి చెందుతుందన్నారు. స్థానిక భాషల ప్రాధాన్యత ఎవరూ కాదనలేనిదని చెప్పిన అమిత్ షా అయితే హిందీని పరిపాలనా మాధ్యమ భాషగా సైన్స్, న్యాయవ్యవస్థ, శాంతిభద్రతల సంబంధిత పోలీసు విభాగాల్లో ప్రమాణికం చేసుకుంటే జాతీయ స్థాయిలో భాషాపరమైన అనుసంధానత ఏర్పడుతుంది. ఆయా రంగాల్లో మార్పులు చేర్పులు దేశవ్యాప్తంగా విదితం అయ్యేందుకు మార్గం ఏర్పడుతుందన్నారు. మాతృభాష వాడకం అత్యంత కీలకం అని పరిశోధనల్లో తేటతెల్లం అయింది. ప్రత్యేకించి మనస్తత్వవేత్తలు, విద్యావేత్తలు పిల్లలు తమ మాతృభాషలోనే ఆలోచిస్తుంటారని తెలిపారు. ఎప్పుడైతే వేరే భాషను మాతృభాష కాకుండా రుద్దడం జరిగితే, పిల్లల మేధోశక్తిపై ప్రభావం పడుతుంది. పిల్లల ఆలోచనాశక్తిలో దాదాపు 25 నుంచి 30 శాతం వరకూ ఇతర భాషలలోని అంశాలను మాతృభాషల్లోకి మలుచుకునేందుకే వెచ్చించాల్సి వస్తుందని అమిత్ షా చెప్పారు, ఇది సైకాలజిస్టులు, పలువురు ప్రొఫెసర్లు చెప్పిన మాట అని తెలిపారు. మన పిల్లల భవిష్యత్తు గురించి వారి చదువు, విజ్ఞానం గురించి ఆలోచించుకోవడం ప్రధాన విషయం అని అమిత్ షా స్పష్టం చేశారు. హిందీ ఇతర ప్రాంతీయ భాషలను కూడా కేంద్రం ప్రోత్సహిస్తుందన్నారు. హోం మంత్రిత్వశాఖ ద్వారా ప్రత్యేకంగా భారతీయ భాషా అనుభాగ్ (భారతీయ భాషల విభాగం) ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. ప్రధాని మోడీ కూడా తరచూ స్థానిక భాషల బలోపేతానికి పలు విధాలైన సాంకేతిక పద్ధతుల వాడకానికి ముందుకు వస్తున్నారని తెలిపారు.

# మేడారంపై చిల్లర రాజకీయాలు

జరిగిందన్నారు. ఎక్కువగా నూతన మార్గాల ఏర్పాటు వల్ల వెంగళాపూర్, నార్లాపూర్ మీదుగా రద్ధి లేకుండా పస్రానుండి నార్లాపూర్ వరకు వాహనాలు ట్రాఫిక్ జామ్ కాకుండా భక్తులకు సులువు మార్గాల ద్వారా జాతరకు చేరుకునే విధంగా నూతన మార్గాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అటవీ దారులను అభివృద్ధి చేసుకుని వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు, మేడారం మహా జాతరలోపు రూ. 16.5 కోట్లతో కొండాయి బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేస్తామన్నారు. సమ్మక్క, సారలమ్మ వనదేవతల కీర్తిని మరింత పెంచే విధంగా యజ్ఞంలా అధికారుల సమన్వయంతో పనిచేస్తున్నామన్నారు. కొంతమంది తమ ప్రయోజనాల కోసం దేవుని దగ్గర చిల్లర రాజకీయాలు చేస్తున్నారన్నారు. భక్తులు దుష్ప్రచారాలను నమ్మవద్దని, ఆదివాసీ సంప్రదాయాలకు భంగం వాటిల్ల కుండా పనులు చేయించే బాధ్యత తనపై ఉందన్నారు. సమ్మక్క, సారలమ్మ కీర్తి ఇనుమడింపచేసే విధంగా మేడారం ఆధునీకరణ పనులు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు డిఎస్పీ నలువాల రవిందర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపెల్లి రాజేందర్ గౌడ్, మేడారం ట్రస్ట్ బోర్డు చైర్మన్ అర్రెం లచ్చు పటేల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అంతా నివ్వెరపోయేలా భారత్ ఆర్థిక వృద్ధి: ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్

%ఇండోర్: అందరి అంచనాలను తల్లకిందులు చేస్తూ భారతదేశం ప్రగతిపథంలో దూసుకువెళ్లుతోందని ఆర్‌ఎస్‌ఎస్ సంచాలకులు మోహన్ భగవత్ చెప్పారు. భారత్ పట్ల చిన్నచూపు ఆలోచనలు పనికిరావని రుజువు అయిందన్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్ర మంత్రి ప్రహ్లాద్ సింగ్ పటేల్ పుస్తకం పరిక్రమ కృపాసారం ఆవిష్కరణ సభలో ఆయన మాట్లాడారు. విశ్వాసం, సాంప్రదాయక సిద్ధాంతాల విజ్ఞానం మార్గదర్శకాలతో సాగడం వల్లనే భారతదేశ ఆర్థిక పురోగమనం సాధ్యం అయిందని తెలిపారు. కార్యాచరణ, అంకితభావం పురాతన విజ్ఞాన ప్రాతిపదికలు మనకు గెలుపు సాధ్యం చేశాయని అన్నారు. దేశ ఆర్థిక రంగం ఇప్పుడు ఎప్రిల్ జూన్ త్రైమాసికంలో 7.80 శాతం ప్రగతి సూచిని సాధించిన దశలో ఆర్‌ఎస్‌ఎస్ నేత వ్యాఖ్యలు వెలువడ్డాయి. భారతదేశం 3వేల ఏండ్ల పాటు విశ్వనేతగా చలామణిలో ఉన్నప్పుడు ప్రపంచ స్థాయిలో ఎక్కడా ఘర్షణలు లేవని ఆయన వివరించారు. ప్రపంచంలో ఇప్పుడు నెలకొన్న ఘర్షణలకు వ్యక్తిగత ప్రయోజనాలే కారణం అని, దీనితోనే అనేక సమస్యలు వీడని సంక్షోభాలు నెలకొన్నాయని చెప్పారు. భారత్ ఛిన్నాభిన్నం అవుతుందని కొందరు పెద్దలు చెప్పిన మాటలు ఏనాడో శుద్ధ తప్పని తేలాయి.

# యుద్ధాలు మా పని కాదు.. ట్రంప్‌కు గట్టిగా బదులిచ్చిన చైనా

తమ దేశంపై 50 నుంచి 100 శాతం టారిఫ్‌లు విధించాలంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రతిపాదనపై చైనా తీవ్రంగా స్పందించింది. యుద్ధాలు, ఆంక్షల ద్వారా సమస్యలను పరిష్కరించలేమని, అవి పరిస్థితిని మరింత క్లిష్టతరం చేస్తాయని గట్టిగా బదులిచ్చింది. వివాదాస్పద అంశాల పరిష్కారానికి శాంతియుత చర్చలకే తాము కట్టుబడి ఉన్నామని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ స్పష్టం చేశారు. శనివారం స్లోవేనియా పర్యటనలో భాగంగా ఆ దేశ ఉప ప్రధాని తాన్యా ఫజోన్‌తో సమావేశం అనంతరం వాంగ్ యీ విలేకరులతో మాట్లాడారు. "చైనా ఎప్పుడూ యుద్ధాలలో పాల్గొనదు, వాటిని ప్రోత్సహించదు. చర్చల ద్వారా రాజకీయ పరిష్కారాలను ప్రోత్సహించడమే మా విధానం" అని అన్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ సమాజం గందరగోళం, ఘర్షణలతో నిండి ఉందని, ఈ సమయంలో బహుళపాక్షిక విధానాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. చైనా, యూరప్‌లు ప్రత్యర్థులుగా కాకుండా మిత్రులుగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. అంతకుముందు, డొనాల్డ్ ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. "రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగిసే వరకు నాటో కూటమి చైనాపై 50 నుంచి 100 శాతం టారిఫ్‌లు విధించాలి. రష్యాపై చైనాకు బలమైన పట్టు ఉంది. ఈ భారీ సుంకాలు ఆ పట్టును విచ్ఛిన్నం చేస్తాయి. తద్వారా ఈ భయంకరమైన యుద్ధానికి ముగింపు పలకవచ్చు" అని ట్రంప్ పోస్ట్ చేశారు. గతంలో కూడా ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు

## లండన్‌లోనూ వలసల కొలిమంటుకుంది



లండన్: బ్రిటన్ చరిత్రలోనే అతి పెద్ద వలస వ్యతిరేకవాదుల భారీ ప్రదర్శన శనివారం సెంట్రల్ లండన్ లో జరిగింది. వలస వ్యతిరేక కార్యకర్త టామీ రాబిన్సన్ నాయకత్వంలో "యునైట్ ది కింగ్ డమ్" పేరుతో లక్షన్నరమందికి పైగా నిరసన కారులు వలసవాదానికి వ్యతిరేకంగా ఉద్యమించారు. ఈ ప్రదర్శనల సమయంలో అనేకమంది అధికారులపై దాడి జరిగినట్లు పోలీసులు వెల్లడించారు. వారిని పంపివేయండి, మాదేశాన్ని మాకు మళ్లీ ఇవ్వండి, ఇంగ్లీషు చాలు, మా పిల్లల భవిష్యత్ కాపాడండి అని వారు నినాదాలు చేశారు. ప్లకార్డులు ప్రదర్శించారు. సెంట్రల్ లండన్ లోని కొన్ని కిలోమీటర్ల దూరం వరకూ రోడ్లు నిరసనకారులతో నిండిపోయినట్లు విమానాల ద్వారా తీసిన చిత్రాలు చూపుతున్నాయి. అధికారులు నిరసనలను తగ్గించి చూపి ఉండవచ్చునని అంటున్నారు. ఉధృతంగా సాగుతున్న వలస వ్యతిరేక ఉద్యమ నాయకుడు టామీ రాబిన్సన్ లక్షలాదిమంది ఈ ఉద్యమంలో పాల్గొన్నట్లు వెల్లడించారు.

ఇది సాధారణ నిరసన మాదిరిగా చిత్రీకరించేందుకు అధికారులు ప్రయత్నించడాన్ని ఆయన ఖండించారు. ఒకపక్క టామీ రాబిన్సన్ ఆధ్వర్యంలో యునైట్ ది కింగ్ డమ్ మార్చ్ జరుగుతున్న సమయంలోనే కొద్ది దూరంలో జాత్యహంకార వ్యతిరేకంగా, 'స్టేడ్ అప్ టు రేసిజం' పేరుతో మరో నిరసన కార్యక్రమం జరిగింది. దీనికి దాదాపు ఐదు వేలమంది హాజరయ్యారు. ఒకే సమయంలో ఈ రెండు ఉద్యమాలకు చెందిన నిరసనకారులు ఎదురెదురు పడకుండా, ఎలాం టి ఘర్షణ చెలరేగకుండా పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు తీసుకున్నారు. పరస్పర వ్యతిరేక ప్రదర్శనలు జరుగుతున్న సమయంలో పోలీసులు అదనపు బలగాలను తరలించారు. రెండు నిరసనల మధ్య ఘర్షణ తలెత్తకుంటా పోలీసులు ఆ ప్రాంతాలలోకి యునైట్ ది కింగ్ డమ్ ప్రదర్శనకారులు ప్రవేశించకుండా ఆపడానికి రోజంతా మెట్రోపాలిటన్ పోలీసులు ఎన్నో సార్లు జోక్యం చేసుకోవల్సివచ్చింది. కానీ, అక్కడక్కడ ఘర్షణలు చోటు చేసుకున్నట్లు తెలిసింది. యునైట్ ది కింగ్ డమ్ పేరుతో వలసవాదులకు వ్యతిరేకంగా ప్రదర్శన జరిపిన వారు యూనియన్ జెండా, ఎరుపు, తెలుపు సెయింట్ జార్జ్ క్రాస్ రెండింటినీ ప్రదర్శించారు. కొందరు, అమెరికా, ఇజ్రాయెల్ జెండాలను కూడా ప్రదర్శించారు.

## అధికారంలోకి రాగానే..అధికారికంగా విమోచనం

ఆయన తెలిపారు. తెలంగాణలో తాము అధికారంలోకి రాగానే అధికారికంగా నిర్వహిస్తామన్నారు. గత రెండేళ్ళుగా కేంద్ర సాంస్కృతిక శాఖ అధ్వర్యంలో విమోచన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని, ఇప్పుడు మూడో సారి నిర్వహించుకోబోతున్నామని ఆయన తెలిపారు. రజాకార్ల హింసాకాండపై ప్రజలు తిరుగుబాటు చేసి సాధించుకున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ప్రసంగిస్తూ తెలంగాణలో అధికారంలోకి రాగానే విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెల 17న పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించబోయే విమోచన దినోత్సవానికి కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఇంకా కేంద్ర మంత్రులు గజేంద్ర షెకావత్, జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్, మహారాష్ట్రకు చెందిన పలువురు మంత్రులు, రాష్ట్రానికి చెందిన బిజెపి ఎంపీలు, ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొంటారు. అదే రోజున ఉదయం సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని పార్కులో మాజీ ప్రధాని దివంగత ఎబి వాజ్‌పేయ్ విగ్రహాన్ని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆవిష్కరిస్తారు.

## ఫీజు బకాయిలపై చేతులెత్తేసిన ప్రభుత్వం.. కాలేజీల బంద్‌కు రంగం సిద్ధం?

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలంటూ ఆందోళన బాట పట్టిన ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలకు తెలంగాణ ప్రభుత్వం నుంచి ఊహించని సమాధానం ఎదురైంది. ప్రభుత్వ ఖజానా పూర్తిగా ఖాళీగా ఉందని, బకాయిలు చెల్లించేందుకు ఒక్క పైసా కూడా లేదని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క తేల్చిచెప్పారు. దీంతో సోమవారం నుంచి తలపెట్టిన కాలేజీల బంద్ అనివార్యంగా కనిపిస్తోంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని కోరుతూ ప్రైవేటు కాలేజీల యాజమాన్యాల సంఘం ప్రతినిధులు శనివారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో సమావేశమయ్యారు. మొత్తం రూ. 3,500 కోట్ల బకాయిలు పేరుకుపోయాయని, కనీసం టోకెన్లు జారీ అయిన రూ. 1200 కోట్లనైనా వెంటనే విడుదల చేస్తే సమ్మె విరమించుకుంటామని వారు ప్రభుత్వానికి ప్రతిపాదించారు. అయితే, యాజమాన్యాల విజ్ఞప్తిపై భట్టి విక్రమార్క తీవ్ర నిస్సహాయత వ్యక్తం చేసినట్టు సమాచారం. "ప్రభుత్వానికి వస్తున్న డబ్బులన్నీ ఉద్యోగుల జీతాలు, ఇతర సంక్షేమ పథకాలకే పోతున్నాయి. ఇక ఖజానాలో మిగిలిందేమీ లేదు. రీయింబర్స్‌మెంట్‌పై నేనేం చేయలేను. మీకు ఇచ్చేందుకు పైసా కూడా లేదు. నన్నేం చేయమంటారో మీరే చెప్పండి" అని ఆయన అన్నట్టు తెలిసింది. డిప్యూటీ సీఎం వ్యాఖ్యలతో యాజమాన్యాల ప్రతినిధులు తీవ్ర నిరాశకు గురయ్యారు. అనంతరం వారు సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో వేర్వేరుగా సమావేశమయ్యారు. సమస్య తీవ్రతను అర్థం చేసుకున్నామని, విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చూస్తామని మంత్రి శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. ఇది పెద్ద మొత్తంతో కూడుకున్న అంశం కాబట్టి క్రమంగా పరిష్కరిస్తామని, సమ్మె ఆలోచన విరమించుకోవాలని కోరారు. బకాయిలను విడతలవారీగా చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వేం నరేందర్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వం నుంచి భిన్నమైన స్పందనలు రావడంతో తదుపరి కార్యాచరణపై చర్చించేందుకు కాలేజీల యాజమాన్యాలు సిద్ధమయ్యాయి. మంత్రులతో జరిగిన చర్చల సారాంశాన్ని విశ్లేషించి, బంద్‌పై తుది నిర్ణయం తీసుకునేందుకు నేడు మాసబ్‌ట్యాంక్‌లోని ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో సమావేశం కానున్నట్టు యాజమాన్యాల సమాఖ్య నేతలు ఎన్. రమేశ్ బాబు, కేఎస్ రవికుమార్, కె. సునీల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

## బంద్‌కు పిలుపునిచ్చినా ప్రభుత్వంలో చలనం లేకపోవడం దారుణం: హరీశ్ రావు

తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు, వేలాది విద్యాసంస్థల మనుగడ ప్రమాదంలో పడిందని బీఆర్‌ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రెండేళ్లుగా బకాయిలు పేరుకుపోయినా ప్రభుత్వం మొద్దు నిద్ర వీడటం లేదని, ఇది సిగ్గుచేటని ఆయన విమర్శించారు. హరీశ్ రావు స్పందిస్తూ... "ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, పీజీ, ఫార్మసీ, ఇంజినీరింగ్‌తో పాటు ఇతర వృత్తి విద్యా కళాశాలలు మూతపడే దుస్థితి నెలకొంది. సుమారు 13 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది. సెమిస్టర్ పరీక్షలు సైతం వాయిదా వేసే పరిస్థితి వస్తుంటే విద్యాశాఖ మంత్రిగా కూడా ఉన్న ముఖ్యమంత్రి ఏం చేస్తున్నారు?" అని ప్రశ్నించారు. ఫీజు బకాయిల కోసం సోమవారం నుంచి విద్యాసంస్థల యాజమాన్యాలు నిరవధిక బంద్‌కు పిలుపునిచ్చినా ప్రభుత్వంలో చలనం లేకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యతలను హరీశ్ రావు తీవ్రంగా తప్పుబట్టారు. "ఉద్యోగులకు జీతాలు, విద్యార్థులకు ఫీజులు చెల్లించడానికి డబ్బులు లేవని చెబుతున్న ముఖ్యమంత్రి, కమిషన్లు వచ్చే ప్రాజెక్టులకు మాత్రం లక్షల కోట్ల టెండర్లు ఎలా పిలుస్తున్నారు? మూసీ సుందరీకరణకు రూ. 1.50 లక్షల కోట్లు, ఫ్యూచర్ సిటీకి రూ. 20 వేల కోట్లు, ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు రూ. 25 వేల కోట్ల టెండర్లు పిలిచేందుకు డబ్బులు ఎక్కడి నుంచి వస్తున్నాయి? సుమారు రెండున్నర లక్షల కోట్ల రూపాయల టెండర్లపై ఉన్న శ్రద్ధ, విద్యార్థుల చదువుపై ఎందుకు లేదు?" అని హరీశ్ రావు నిలదీశారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంతో ప్రస్తుత పరిస్థితిని పోలుస్తూ, తమ హయాంలో పెద్ద నోట్ల రద్దు, కరోనా వంటి తీవ్ర ఆర్థిక సంక్షోభ సమయాల్లోనూ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ఆపలేదని గుర్తుచేశారు. తొమ్మిదిన్నరేళ్ల పాలనలో రూ. 20 వేల కోట్లకు పైగా బకాయిలు చెల్లించామని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పరిస్థితులు పూర్తిగా తారుమారయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీలో హామీ ఇచ్చి కూడా ప్రభుత్వం మాట తప్పిందన్నారు. ఫీజులు రాకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని హరీశ్ రావు అన్నారు. "అద్దెలు, కరెంట్ బిల్లులు కట్టలేక, సిబ్బందికి జీతాలు ఇవ్వలేక యాజమాన్యాలు సతమతమవుతున్నాయి. మరోవైపు, ఫీజులు చెల్లించలేదని విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా యాజమాన్యాలు నిలిపివేస్తుండటంతో వారు కోర్టుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడింది" అని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగిందని ముఖ్యమంత్రి అసెంబ్లీలో అబద్ధాలు చెప్పారని, యూడైస్ రిపోర్టు ప్రకారం ఈ ఏడాది 47 వేల మంది విద్యార్థులు తగ్గారని ఆయన ఆరోపించారు.

సత్యమేవ జయతే

సోమవారం15 సెప్టెంబర్ 2025

## మిలాద్-ఉన్-నబీ సందర్భంగా అన్నదాన కార్యక్రమం.







సత్యమేవ జయతే/హత్నూర:హత్నూర మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ దౌల్తాబాద్ గ్రామంలో ఆదివారం ముస్లిం మైనారిటీ సోదరులు ఖిద్మాట్ ఏ కల్క్
అధ్వర్యంలో మిలాద్–ఉన్– నబీ పండుగను పురస్కరించుకొని అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.అనంతరం వృద్ధులకు.వితంతులకు.ఖిద్మాట్ ఏ కల్క్ సంస్థ ఆధ్వర్యంలో పెన్షన్లు అందజేశారు.ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీటీసీ సతీష్.కాంగ్రెస్ రాష్ట్ర మైనార్టీ విభాగం కార్యదర్శి ఎమ్. ఏ.హకీమ్, బీఆర్ఎస్ మండల నాయకులు ఆమ్రాది జగదీష్. మాజీ వార్డ్ మెంబర్ గౌస్ పాషా. ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ కుల మతాలకు అతీతంగా గంగా జమునా తహెజీబ్ లా కలిసి మెలిసి ఉండాలని అన్నారు.మహ్మద్ ప్రవక్త ఆయన చేసిన త్యాగాలు,సేవల గురించి ప్రజలకువివరించారు. ప్రతీ ఒక్కరూ మహ్మద్ ప్రవక్త చూపిన బాటలో నడవాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో రహీం.నసీర్ పాషా. హాశం అలీ.. రఫీ ఉద్దీన్ముస్లిం సోదరులు, తదితరులు పాల్గొన్నారు.

## కోటపల్లి మండలంలో మోత్కుపల్లి గ్రామం లో కల్లులో తోక పురుగులు.

### ఎక్సైంజ్ అధికారులు పట్టించుకోవడం లేదని.. గ్రామస్తుల ఆగ్రహం...





సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా...కోటపల్లి మండలం మోత్కుపల్లి గ్రామంలో కల్లులో తోక పు రుగులు తేలడంతో గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్లు వ్యాపారి వద్ద నిల్వ ఉంచిన కల్లు పాత్రలను గ్రామస్తులు పారబోసేశారు..గ్రామస్తులు మాట్లాడుతూ %–% "కల్లును శుభ్రంగా అందించడం వ్యాపారుల బాధ్యత. కానీ మాకు అందుతున్న కల్లులో తోక పు రుగులు ఉండటం ఆరోగ్యానికి హానికరం. ఇలాంటి నిర్లక్ష్యం సహించబోము" అని హెచ్చరించారు.ఈ ఘటనపై కల్లు వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో శుభ్రమైన కల్లు మాత్రమే అందేలా చూడాలని ఎక్సైజ్ అధికారులను గ్రామస్తులు కోరుతున్నారు...

## బార్వద్ తాండ బస్టాండు కూల్చివేసి న వారి పై చర్యలు తీసుకోవాలి...



సత్య మే వ జయతే వికారాబాద్ జిల్లా..రాత్రి రెండు గంటల సమయంలో గుర్తుతెలియని దుండగులు బస్టాండ్ ను కూల్చి వేయడం జరిగింది వెంటనే దుండగులను శిక్షించాలని భార్వద్ తండా గిరిజనులతో
బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సుందరి అనిల్ గారు సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్ యాదవ్
యూత్ అధ్యక్షులు కొండల్ రెడ్డి ఎస్ టీ అధ్యక్షులు బాబు నాయక్
మాజీ సర్పంచ్ రామ్ ప్రసాద్. సంతు. ప్రేమ్ ఆధ్వర్యంలో నిరసన తెలుపడం జరిగింది ముఖ్యమంత్రి సొంత జిల్లాలో స్పీకర్ నియోజకవర్గంలో గిరిజనుల పైన దాడిని ఖండిస్తూ నిరసన తెలుపడం జరిగింది
ప్రభుత్వానికి గిరిజనులు అంటే ఇంత చిన్న చూపా అని ఇదే నిదర్శనం
ప్రభుత్వ ఆస్తిని ధ్వంసం చేసిన కూడా ఒక్క అధికారులు కూడా ఇప్పటివరకు వచ్చి సందర్శించలేరు దానికి కారకుల ను ప్రతి ఒక్కరిని శిక్షించాలని కోరుకుంటూ నిరసన తెలుపడం జరిగింది . ఈ కార్యక్రమంలో బార్వతాండ గ్రామస్తులు పాల్గొనడం జరిగింది.

# వికారాబాద్ లో ఆదివారం తరగతులు నిర్వహిస్తున్న నారాయణ ,సంకల్ప్ , సెన్జుడ్స్, శ్రీ చైతన్య పాఠశాలలు-

### పట్టించుకోని వికారాబాద్ జిల్లా . డి ఈ ఒ విద్యాధికారులు..

### చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు...




సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా..వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఉన్న కార్పొరేట్ నారాయణ, శ్రీ చైతన్య , సంకల్ప్ మరియు సంజూట్స్ వంటి ప్రైవేట్ పాఠశాలలు ఆదివారం మరియు పండుగ సెలవులు ఉన్న రోజు కూడా తరగతులు నిర్వహిస్తూ వల్ల పై అధిక భారం మోపుతూ విద్యార్థులను మానసికంగా వేదనకు గురి చేస్తున్నారు , స్థానిక ఎంఈఓ ఎన్నిసార్లు విన్నవించుకున్నప్పటికీ విద్యాధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్న విద్యాధికారుల పర్యవేక్షణ ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలపై కొరవడింది ఎస్ఎఫ్ఐ భారత విద్యార్థి ఫెడరేషన్ గా ఈరోజు ఆదివారం తరగతులు నిర్వహిస్తున్న నారాయణ సంకల్ప్ సెండ్ జుట్స్ శ్రీ చైతన్య పాఠశాలలోని విద్యార్థులను ఇంటికి పంపించడం జరిగింది డీఈవో ఎంఈఓ లు వెంటనే స్పందించి ఆదివారం తరగతులు నిర్వహిస్తూ ఇష్టానుసారంగా వేల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ వికారాబాద్ జిల్లా కమిటీ డిమాండ్ చేస్తుంది ఈ కార్యక్రమంలో ఎస్ ఫ్ ఐ నాయకులు సిద్దు ,ఆయుష్ , హేమంత్ తదితరులు పాల్గొన్నారు

# మున్సిపల్, గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు 26వేలు అమలు చెయ్యాలి.. ప్రమాద బీమా సౌకర్యం 20లక్షలు ఇవ్వాలి.






### మల్టీ పర్పస్ విధానం రద్దు చెయ్యాలి....

సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా.. ఆదివారం మున్సిపల్ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు వికారాబాద్ జిల్లా జనరల్ బాడీ సమావేశం సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ అధ్యక్షత జరిగింది. ఈ సమావేశనికి ముఖ్య అతిథిగా మున్సిపల్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు పాలడుగు సుధాకర్ మాట్లాడుతూ గత ఎన్నికల సందర్భంగా, మన పోరాటాల సందర్భంగా ఈ పాలకులు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో వివక్ష చూపిస్తున్నారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పెరుగుతున ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు ఈ ఎస్ ఐ ,పి ఫ్ సౌకర్యం అమలు చెయ్యాలి. మల్టీ పర్పస్ విధానం రద్దు చెయ్యాలి పి ఆర్ సి అమలు చేయాలని ప్రభుత్వ నికి డిమాండ్ చేస్తున్నాము. లేదా ఎమ్మెల్యే ల మంత్రుల ఇండ్లు ముట్టడిస్తామనీ హెచ్చరిచారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికుల కిష్టప్ప నరేష్ శంకర్ రాములు రాము జంగమ్మ జయమ్మ తదితరులు పాల్గొన్నారు..

# రాబోయే స్థానిక సంస్థలఎన్నికల్లో వికారాబాద్ గడ్డపైన గులాబీ జెండా ఎగురవేస్తాం..

### వికారాబాద్ బి ఆర్ ఎస్ మీడియా అధ్యక్షులు అనిల్...






సత్య మేవ జయతే వికారాబాద్ జిల్లా.. ఆదివారం వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఆదేశాల మేరకు మండల పార్టీ అధ్యక్షులు మహిపాల్ రెడ్డి అన్న మరియు %డ% మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్ అన్న ఆధ్వర్యంలో వికారాబాద్ బి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో విలేజ్ సోషల్ మీడియా అధ్యక్షులతో మీటింగ్ నిర్వహించిన వికారాబాద్ సోషల్ మీడియా అధ్యక్షులు అనిల్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో వికారాబాద్ జిల్లాలో టిఆర్ఎస్ పార్టీని బలోపేతం చేస్తామని అన్నారు.
10 ఏళ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారు.
కాంగ్రెస్ వచ్చి 21 నెలలు కావోస్తున్న రాష్ట్రంలో ఏ వర్గం ప్రజలు సంతోషంగా లేరు
ప్రజలకు ఆరు గ్యారంటీ అంటూ చెప్పుకుంటున్నారు ఆరు గ్యారెంటీలు దేవుడెరుగు ప్రజల ప్రాణాలకు గ్యారంటీ లేదు కాంగ్రెస్ పాలనలో
మళ్ళీ అధికారంలోకి వచ్చేది బి ఆర్ ఎస్ పార్టీనే గ్రామాలలో ధ్యైరంగా పని చేయాలని గ్రామ కమిటీ సోషల్ మీడియా అధ్యక్షులకు దిశానిర్దేశం చేశారు.ఈ క్రమంలో జనరల్ సెక్రెటరీ శివ కుమార్, మైనార్టీ అధ్యక్షులు గాయాజ్, ఎస్ సి సెల్ అధ్యక్షులు శ్రీనివాస్, బీసీ సెల్ అధ్యక్షులు మల్లేష్ యాదవ్,ఎస్ టీ సెల్ అధ్యక్షులు మహిపాల్ నాయక్, సీనియర్ నాయకులు ప్రభాకర్ రెడ్డి, మల్లికార్జున్, వికారాబాద్ మండలంలోని గ్రామకమిటి సోషల్ మీడియా అధ్యక్షులు శ్రీనివాస్, శివ కుమార్, బిక్షపతి, ఇబ్రహీం, జైనోద్దీన్, శ్యామలయ్య, తిరుమలేశ్, హైమద్, నవీన్, సంగమేష్, కృష్ణ, శ్రీకాంత్, మల్లేష్, రాజు, మహేందర్ పాల్గొన్నారు..

# సంగారెడ్డిలో మార్షల్ ఆర్ట్స్ బెల్ట్స్ పంపిణీ కార్యక్రమం






సత్యమేవ జయతే – సంగారెడ్డి సంగారెడ్డి : ఈ కార్యక్రమంలో డాక్టర్ కూన వేణు మాట్లాడుతూ, "ప్రస్తుత కాలంలో యువతకు విద్యతో పాటు క్రీడలు కూడా సమానంగా అవసరం. ముఖ్యంగా మార్షల్ ఆర్ట్స్ శిక్షణ పొందిన యువత ఆత్మవిశ్వాసంతో పాటు క్రమశిక్షణ, సహనం, ధైర్యం వంటి విలువలను అలవర్చుకుంటారు. స్వీయ రక్షణకు మార్షల్ ఆర్ట్స్ అత్యంత ఉపయోగకరమైందని, ప్రతి ఒక్కరూ కనీసం ప్రాథమిక శిక్షణ తప్పనిసరిగా నేర్చుకోవాలి" అని సూచించారు.

గ్రాండ్ మాస్టర్ సజీద్ మాట్లాడుతూ, "సంగారెడ్డిలో మార్షల్ ఆర్ట్స్ పై యువత ఆసక్తి పెరుగుతుండటం గర్వకారణం. భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని మెడల్స్ సాధించేలా ప్రత్యేక శిక్షణ ఇవ్వడానికి మా సంస్థ కట్టుబడి ఉంది" అని తెలిపారు.ఈ సందర్భంగా విద్యార్థులు మార్షల్ ఆర్ట్స్ లో తమ ప్రతిభను ప్రదర్శించారు. ఆకట్టుకునే ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. కార్యక్రమంలో పాల్గొన్న వారంతా విద్యార్థులకు అభినందనలు తెలుపుతూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

సత్యమేవ జయతే



## లైసెన్స్ సర్వేయర్ పరీక్షలో గందరగోళం

## %-% విద్యార్థుల ఆవేదన




సత్యమేవ జయతే - భద్రాద్రి కొత్తగూడెంభద్రాద్రి కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్వహించిన లైసెన్స్ సర్వేల సప్లిమెంటరీ పరీక్షలో తీవ్రమైన అవ్యవస్థలు చోటుచేసుకున్నాయి. 13న ప్రాక్టికల్, 14న ఉదయం థియరీ, మధ్యాహ్నం ప్లాటింగ్ ఎగ్జామ్ జరగగా, మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఐదు గంటల వరకు జరగాల్సిన పరీక్షలో అనేక గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

ప్రభుత్వ ఆర్ట్స్ %-% సైన్స్ కళాశాలలో పరీక్ష రాసిన విద్యార్థులు చెబుతున్న వివరాల ప్రకారం, ఇన్విజిలేటర్లు పరీక్ష సమయం పూర్తికాకముందే 15 నిమిషాల ముందే జవాబు పత్రాలను గుంజుకోవడం జరిగింది. ఈ కారణంగా పలువురు విద్యార్థులు పరీక్షను సగం మాత్రమే రాయగలిగామని వాపోయారు. కొంతమంది విద్యార్థులు ఈ విషయంపై ప్రశ్నించగా, తిరిగి జవాబు పత్రాలు ఇచ్చినా, చాలామందికి ఇవ్వకపోవడంతో తీవ్ర నిరాశ వ్యక్తమవుతోంది.

విద్యార్థులు చెప్పిన వివరాల ప్రకారం, పరీక్షా కేంద్రంలో కనీస సౌకర్యాలు లేకపోవడం, ముఖ్యంగా టాయిలెట్ సౌకర్యాలేమీ లేని కారణంగా, మూడు గంటలపాటు మహిళా విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోవలసి వచ్చిందని పేర్కొన్నారు. అంతేకాక, తమ బ్యాగుల్లో క్యాలిక్యులేటర్ మర్చిపోయి తీసుకొస్తామని చెప్పినా, పరీక్ష హాల్లోనుంచి బయటకు వెళ్లడానికి అనుమతి ఇవ్వలేదని విద్యార్థులు తెలిపారు.

అనుభవం ఉన్న ప్రైవేట్ సర్వేయర్లు మాట్లాడుతూ, "టీఎస్పీఎస్సీ లేదా డిగ్రీ, పీజీ పరీక్షల మాదిరిగా ఈ ప్రశ్న పత్రం ఉండదు. సర్వేకు సంబంధించిన ప్రత్యేకమైన టర్మినాలజీ ఉండటంతోపాటు, ఇచ్చిన సమయం సరిపోదు. ఈ పరీక్షలో సరైన టైమ్ మేనేజ్‌మెంట్ లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు" అని వ్యాఖ్యానించారు.

ఏది ఏమైనా, ప్రభుత్వం లైసెన్స్ సర్వే పరీక్షలను సక్రమంగా నిర్వహించడంలో విఫలమైందని విద్యార్థులు, నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అయినా కూడా, ఈ గందరగోళ పరిస్థితుల్లో పరీక్ష రాసిన ప్రతి విద్యార్థి కనీసం 70 మార్కుల వరకు సమాధానాలు రాసినట్లు చెబుతున్నారు.

### పోచారం డ్యామ్‌లో విషాదం %-% ప్రాణాలను కాపాడేందుకు దూకిన యువకుడు నీటిలో మునిగిపోవడం



సత్యమేవ జయతే - మెదక్ మెదక్ : మెదక్ జిల్లా గోల్కొండ విధికి చెందిన ఎండీ మహబూబ్ (18) దురదృష్టకరంగా ప్రాణాలు కోల్పోయాడు. ఈ రోజు సాయంత్రం 4 గంటల సమయంలో మహబూబ్ తన స్నేహితులతో కలిసి పోచారం డ్యామ్ సందర్శనకు వెళ్లాడు. ఆ సమయంలో ఇద్దరు వ్యక్తులు డ్యామ్‌లో కాలు జారి పడటాన్ని గమనించిన మహబూబ్, వారిని రక్షించేందుకు నీటిలో దూకాడు. అయితే దురదృష్టవశాత్తు అతని కాళ్లు రాళ్లలో ఇరుక్కుపోవడంతో నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయాడు.

ఈ ఘటనపై నాగిరెడ్డిపేట్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మహబూబ్ మృతదేహాన్ని తొలుత ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెదక్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మైసన్ బిన్ అబ్దుల్లా గారు, మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు గారితో ఫోన్‌లో మాట్లాడి, పోస్టుమార్టం మెదక్ ప్రభుత్వ ఆసుపత్రిలోనే నిర్వహించేందుకు డీఎస్పీ మెదక్, డీఎస్పీ ఎల్లారెడ్డితో చర్చించారు. అధికారుల అనుమతి అనంతరం మృతదేహాన్ని మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఈ సందర్భంగా మహబూబ్ కుటుంబ సభ్యులు తమ పుత్రుని మృతదేహం మెదక్ ఆసుపత్రికి తరలించేలా సహకరించినందుకు ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు గారికి, కాంగ్రెస్ నేత మైసన్ బిన్ అబ్దుల్లా గారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ విషాద ఘటన మెదక్ ప్రాంతాన్ని మృదువుగా కదిలించింది.

## అంబేద్కర్ విజ్ఞాన మందిరం స్థల వివాదంపై రేపు "చలో కలెక్టరేట్" కార్యక్రమం



సత్యమేవ జయతే - నెల్లూరునెల్లూరు :నెల్లూరులోని దక్షిణ మండలం ఎక్స్ మోపూరు రోడ్డుసెంటర్ వద్ద డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విజ్ఞానమందిరం స్థలంపై నెలకొన్న వివాదం మరింత ముదిరింది. గత ఒక సంవత్సరం నుండి ఈ అంశంపై జిల్లా కలెక్టర్, ఎస్సీ కమిషన్, స్థానిక ఎమ్మెల్యే సిఫార్సులు ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

స్థానిక నాయకులు, మండల రెవెన్యూ అధికారులు తమిళనాడు ప్రాంతం వారికి ఎలాంటి అధికారిక పత్రాలు లేకపోయినా, భారీ ముడుపులు స్వీకరించి అంబేద్కర్ విజ్ఞాన మందిరం స్థలాన్ని వారికే కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారు అని ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయి. చట్టాలను తమ ఇష్టానుసారం వక్రీకరించి, కాలయాపన చేస్తూ ప్రజాస్వామ్య విలువలను పక్కనపెడుతున్నారని తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఈ నేపథ్యంలో ఏపీ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రేపు "చలో కలెక్టరేట్" కార్యక్రమం నిర్వహించనున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు గద్దల మునయ్య ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రజా సంఘాలు, ప్రజాస్వామ్య వాదులు, దళిత%-%బహుజన ప్రజా సంఘాల నాయకులు భారీ ఎత్తున పాల్గొని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సంఘీభావం వ్యక్తం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ నేపథ్యంలో రేపటి కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమంపై జిల్లా వ్యాప్తంగా ఆసక్తి నెలకొంది.

# రాజీవ్ గృహకల్పా సంక్షేమ సంఘం ఎన్నికల్లో ఘన విజయం సాధించిన అంజయ్య, భూపతి రెడ్డి

-ఎన్నడూ లేనివిధంగా పోలింగ్ నమోదు.

-రసవత్తరంగ సాగిన ఎన్నికల ఓటింగ్, కౌంటింగ్.

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 14, సత్యమేవ జయతే ప్రతినిధి:- కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, జగద్గిరిగుట్ట డివిజన్, రాజీవ్ గృహకల్పా సంక్షేమ సంఘం ఎన్నికల్లో భాగంగా స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో పోలీసుల బందోబస్తు నడుమ ఆదివారం పోలింగ్ సజావుగా జరిగింది. ఈ ఎన్నికల్లో చతుర్ముఖ పోటీ నెలకొంది. మొత్తం 1295 ఓటర్లకు గాను పోలింగ్ ముగిసే సమయానికి 1070 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

అందులో భాగంగా నాలుగు ప్యానల్ల అభ్యర్థులు పోటీలో నిలువగా, ధర్మారపు అంజయ్య అధ్యక్షులుగా 373 ఓట్లు సాధించగా, గార్లపాటి ప్రభాకర్ 300 ఓట్లుసాధించారు. ప్రత్యర్థి ప్రభాకర్ పై 73 ఓట్ల ఆధిక్యంతో అంజయ్య అధ్యక్షులుగా విజయం సాధించారు. ఇక ప్రధాన కార్యదర్శి అభ్యర్థి ముచ్చెంతల భూపతిరెడ్డి 385 ఓట్లు సాధించగా, లక్ష్మణ్ ప్రధాన కార్యదర్శి అభ్యర్థి 349 ఓట్లు సాధించారు. ప్రత్యర్థి లక్ష్మణ్ పై 36 ఓట్ల మెజారిటీతో భూపతి రెడ్డి ప్రధాన కార్యదర్శిగా విజయం సాధించారు.

ప్యానల్ వారిగా సాధించిన ఓట్లు...

1). ధర్మారపు అంజయ్య:- అధ్యక్ష అభ్యర్థి (బుల్లెట్ బండి గుర్తు) 373, ముచ్చెంతల భూపతిరెడ్డి:- ప్రధాన కార్యదర్శి అభ్యర్థి(లేడి గుర్తు) 385,

(2). గార్లపాటి ప్రభాకర్:- అధ్యక్ష అభ్యర్థి (బొంగరం గుర్తు)300, గుడే.వెంకటేష్:- ప్రధాన కార్యదర్శి అభ్యర్థి(టేబుల్ ఫ్యాన్ గుర్తు) 191,

(3). తల్లోజు శ్రీనివాస్ ఆచారి:- అధ్యక్ష అభ్యర్థి (ధనస్సు గుర్తు) 196, లక్ష్మణ్:- ప్రధాన కార్యదర్శి అభ్యర్థి(టీవీ గుర్తు) 349,



ధర్మారపు అంజయ్య,
సంక్షేమ సంఘం అధ్యక్షులు.



ముచ్చెంతల భూపతి రెడ్డి,
ప్రధాన కార్యదర్శి.

(4).యువరాజ్:- అధ్యక్ష అభ్యర్థి (ఉంగరం గుర్తు)130, అరుణ్ కుమార్:- ప్రధాన కార్యదర్శి అభ్యర్థి(క్యారం బోర్డ్ గుర్తు) 76.ఓట్లు సాధించారు.

రద్దయిన అధ్యక్ష బ్యాలెట్ ఓట్లు. 70, ప్రధాన కార్యదర్శి ఓట్లు 68, మిస్సయిన ఓట్లు 02,

ఈ సందర్భంగా విజయం సాధించిన అంజయ్య, భూపతి రెడ్డిలు మాట్లాడుతూ.. పోటీలో ఎంతమంది పాల్గొన్న చివరికి గెలిచేది మాత్రం ఒక్కరేనని గుర్తు చేశారు.రాజీవ్ గృహకల్ప ప్రజలు తమను ఆశీర్వదించి తమపై నమ్మకంతో ఓటు వేసి గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా కాలనీ అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడి పనిచేస్తామన్నారు. కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. ఎన్నికల్లో భాగంగా ఇచ్చిన హామీల్లో ప్రధానంగా కాలనీలో నెలకొన్న నీటి సమస్యను సత్వరమే పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామన్నారు. డ్రైనేజీ, కరెంట్, వీధి దీపాలు, అంతర్గత రోడ్లు, ఆర్టీసీ బస్సు సౌకర్యం, సంక్షేమ సంఘ భవనం, మహిళా సంఘ భవనం ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కాలనీ పెద్దలు, నాయకుల సహాయ- సహకారాలతో కాలనీ ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. తమ విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

# మియాపూర్ 108వ డివిజన్ బీజేపీ ఎస్సీ మోర్చా కొత్త కమిటీ ఏర్పాటు

సత్యమేవ జయతే - శేరిలింగంపల్లిశేరిలింగంపల్లి :శేరిలింగంపల్లి పరిధిలోని మియాపూర్‌లో బీజేపీ ఎస్సీ మోర్చా 108వ డివిజన్ నూతన పూర్తిస్థాయి కమిటీ ఏర్పాటైంది. మియాపూర్ డివిజన్ బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు పత్తి జనవ శివ అధ్యక్షతన, సెప్టెంబర్ 13, 2025న జరిగిన సమావేశంలో కొత్త కమిటీని ప్రకటించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మియాపూర్ డివిజన్ అధ్యక్షుడు ఆకుల లక్ష్మణ్ ముదిరాజ్, జిల్లా ఓబీసీ అధ్యక్షుడు రాచపల్ల నాగేశ్వర్ గౌడ్, జిల్లా కార్యదర్శి పారునంది మాణిక్ రావు హాజరయ్యారు. సీనియర్ నాయకులు విజేందర్ సింగ్, నాగులు, శ్రీనివాస్, గుండె గణేష్ ముదిరాజ్, ప్రభాకర్, శివారెడ్డి, జయమ్మ, చందు తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీలో సభ్యులు ప్రశాంత్, రాగిణి కృష్ణ కుమార్, పత్తి మహేష్, గొల్లకుంట మహేందర్, పాశ్వాన్ రాహుల్, కళ్లెం భాస్కర్, కడమంచి నరేష్, బావురి సురేష్ కుమార్, సల్ల మచ్చ గిరి, కడమంచి శ్రీను, సల్ల భాష, బావురి పప్పారాం, కొండపల్లి సమ్మయ్య, సిరిపాటి ప్రశాంత్, తూర్పాటి మచ్చ గిరి, మోతె సంపత్, సిరిగిరి కనకరాజు, కడమంచి సోమయ్య, బావురి ప్రేమా రామ్, కళ్లెం ఫకీర్, బావురి నేకారాం, చల్ల ప్రభాస్, కడమంచి రాములు, కడమంచి భాస్కర్, కళ్లెం బాబు, కళ్లెం శివ, కడమంచి కార్తిక్, కడమంచి నాగార్జున, సిరిగిరి రమేష్, కళ్లెం యాదగిరి, పత్తి రవి, కడమంచి మహేష్, చల్ల వీరస్వామి లను నియమించారు.



ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు, బీజేపీ సిద్ధాంతాలను ఎస్సీ వర్గాలకు విస్తృతంగా చేర్చేందుకు, అభివృద్ధి కార్యక్రమాలను బలోపేతం చేసేందుకు, బలమైన నాయకత్వం కోసం ఈ కొత్త కమిటీ కృషి చేస్తుందని తెలిపారు.

# రాష్ట్ర మున్నూరు కాపు సంఘం కార్యవర్గ సభ్యునిగా శేషంపల్లి నరసింహులు ఏకగ్రీవంగా ఎన్నిక




సత్యమేవ జయతే - జోగులాంబ గద్వాల

జోగులాంబ గద్వాల : ఆదివారం మెదక్ జిల్లాలోని (హైదరాబాద్) పార్చన్ గ్రీన్ హోమ్,ముసాయిపేట తూప్రాన్ లో తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు పుట్టం పురుషోత్తం రావు పటేల్, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర సెక్రటరీ పెద్ది పెంటయ్య ఆధ్వర్యంలో మల్దకల్ మండలం శేషంపల్లి గ్రామానికి చెందిన నర్సింహులు ను తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం కార్యవర్గ సభ్యునిగా ఎన్నుకొని నియామక పత్రాన్ని అందజేసి,శాలువతో ఘనంగా సన్మానించి ప్రకటించారు. ఈ సమావేశంలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టం పురుషోత్తం రావు పటేల్ మాట్లాడుతూ....రాష్ట్ర స్థాయి మున్నూరు కాపు సంఘానికి శేషంపల్లి నరసింహులు సేవలు,సూచనలు సంఘానికి అభివృద్ధికి ఎంతో అవసరమని, ఆదివిధంగా ఇప్పటివరకు విద్యాపరంగా విద్యార్థులకు ఆయన అందించిన సేవలు గొప్పవని కొనియాడారు. అందుకే





రాష్ట్రస్థాయిలో మున్నూరు కాపు సంఘం కార్యవర్గ సభ్యునిగా ఎన్నుకున్నామని అన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శేషంపల్లి నర్సింహులు మాట్లాడుతూ.... మున్నూరు కాపు సంఘ కార్యవర్గ సభ్యునిగా ఇచ్చిన పదవిని వినియోగించుకొని సంఘ అభివృద్ధికై నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

సత్యమేవ జయతే

సోమవారం15 సెప్టెంబర్ 2025

# నందకుమార్ యాదవ్ నివాసానికి విచ్చేసిన బండారు దత్తాత్రేయ



సత్యమేవ జయతే – రంగారెడ్డి రంగారెడ్డి : ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ నందకుమార్ యాదవ్ గారి సతీమణి శ్రీమతి అనురాధ గారు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలిసి, కేంద్ర మాజీ మంత్రివర్యులు, హిమాచల్ ప్రదేశ్ మరియు హర్యానా రాష్ట్రాల మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ గారు ఆదివారం శేరిలింగంపల్లి గ్రామంలోని రేయిన్ ట్రీ అబాడ్ లోని వారి నివాసానికి విచ్చేశారు.

ఈ సందర్భంగా నందకుమార్ యాదవ్ కుటుంబాన్ని పరామర్శించిన దత్తాత్రేయ గారు, అనురాధ గారు త్వరగా కోలుకోవాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్టు తెలిపారు. కుటుంబ సభ్యులను ధైర్యపరుస్తూ సానుభూతి వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు చింతకింది గోవర్ధన్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి తోపుగొండ మహిపాల్ రెడ్డి, నాయకులు రాఘవేందర్ రావు, శాంతిభూషణ్ రెడ్డి, విజయలక్ష్మి, రమణీయమ్మ, రాధా మూర్తి, సత్యనారాయణ, శ్రీనివాస్ రెడ్డి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్శనతో నందకుమార్ యాదవ్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వార్షికోత్సవ సభలో ఎర్రజెండా స్ఫూర్తి




సత్యమేవ జయతే – కొండాపూర్ కొండాపూర్ : సంగారెడ్డి జిల్లా గంగారం గ్రామంలో వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వార్షికోత్సవ సభ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అతిమేల మానిక్ మాట్లాడుతూ, "భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి నుండి విముక్తి కోసం పోరాడింది ఎర్రజెండానే. వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చరిత్రను వక్రీకరించడం తగదు. అమరవీరుల స్ఫూర్తితోనే నేటి ప్రజా పోరాటాలు ముందుకు సాగుతున్నాయి. ఆ స్ఫూర్తిని తీసుకొని కొత్త పోరాటాలను నిర్మించాల్సిన అవసరం ఉంది" అని అన్నారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం కొండాపూర్ మండల కార్యదర్శి కె.రాజయ్య, మండల కమిటీ సభ్యులు బాబురావు, ప్రవీణ్, నాయకులు అనిల్, సద్దాం, రామ్ చందర్, ఆంజనేయులు, కృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వార్షికోత్సవ సభలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, ప్రజా పోరాటాలను బలపరచాలని సంకల్పం వ్యక్తం చేశారు.

# ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి : బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న



సత్యమేవ జయతే – కట్టంగూర్ కట్టంగూర్ : ఈ నెల 17న తెలంగాణ విమోజన దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ కార్యకర్తలు, బూత్ అధ్యక్షులు ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న, జిల్లా కార్యదర్శి పబ్బు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆదివారం కట్టంగూర్ లో జరిగిన మండల పార్టీ కార్యశాలలో వారు ముఖ్య అతిథిలుగా పాల్గొని మాట్లాడారు. ఈ నెల 17న ప్రధాన మంత్రి నరేంద్రమోడీ జన్మదినాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలతో పాటు రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తునున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు గున్నాల నాగరాజు, బత్తిని నాగరాజు, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి బసవోజు వినోద్, ఐతగోని శివ, ఉపాధ్యక్షులు చెరుకు నాగరాజు, జడిగల వీరస్వామి, పెద్ది సతీష్, అంతటి రాజు, గంటి అంజనేయులు, జూలూరి నాగరాజు, పబ్బు వినయ్, పర్నె సంతోష్ రెడ్డి, పాలోజు జలేంద్రాచారి, పబ్బు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రాహుల్‌పై అరుపులు మాని నిజాలు తేల్చండి: మాజీ సిఇసి ఖురేషీ

న్యూఢిల్లీ: రాహుల్ గాంధీపై పదేపదే అరవడం కంటే ఎన్నికల సంఘం ఓటు చోరీపై దర్యాప్తునకు దిగడం మంచిదని ఎన్నికల సంఘం మాజీ ప్రధానాధికారి ఎస్‌వై ఖురేషీ చెప్పారు. దేశంలో ఓటర్ల జాబితాలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని ప్రతిపక్ష నేత రాహుల్ చెపుతున్నారు. ఎన్నికల సంఘం వీటికి సరైన సమాధానాలు ఇవ్వాల్సి ఉంది. దీనికి బదులుగా ఆయనపై అభ్యంతరకర రీతిలో దురుసుగా మాట్లాడటం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. ప్రధాన ప్రతిపక్ష నేత ఆరోపణలపై సరైన రీతిలో దర్యాప్తు జరిపితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. ఇది ఎన్నికల సంఘానికి దేశానికి చాలా మంచిదే అవుతుందని ఓ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఖురేషీ చెప్పారు.

# నారాయణఖేడ్‌లో అంబేద్కర్ యువజన సంఘం సమావేశం

సత్యమేవ జయతే – నారాయణఖేడ్ నారాయణఖేడ్ :నారాయణఖేడ్ నియోజకవర్గంలోని అంబేద్కర్ భవన్ లో ఈ రోజు ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల తుకారం అధ్యక్షత వహించారు.

ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా అధ్యక్షులు, డివిఎంసి సభ్యులు పంబల్ల దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, అంబేద్కర్ యువజన సంఘ సభ్యులు గ్రామాలు, మండలాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ, "అంబేద్కర్ ఆలోచనలతో ముందుకు సాగుతూ, సామాజిక చైతన్యం పెంపొందించాలి. రాజ్యాంగ లక్ష్యాలైన ఉచిత విద్య, వైద్యం, న్యాయం అందరికీ చేరేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలి. ప్రతి కుటుంబానికి భూమి, ఇల్లు కల్పించేలా ప్రభుత్వ బాధ్యతను గుర్తు చేయాలి. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం, రిజర్వేషన్ల పెంపు కోసం నిరంతర పోరాటం కొనసాగించాలి" అని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో జిల్లా నాయకులు ఉప్పరి దేవదాస్, జె. మోహన్ రాజ్, భీమ్ సేన, మారుతి రావు, కాన్సీరామ్, ప్రశాంత్, విట్టల్ తో పాటు వివిధ మండలాల గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అంబేద్కర్ యువజన సంఘం బలోపేతం, రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం కోసం సంకల్పం వ్యక్తమైంది.



# టైలర్స్ కు ఇచ్చిన ఇళ్ల స్థలాలకు రక్షణ కల్పించండి: ఆవుల నాగేశ్వరరావు

### ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి ఆదుకోవాలి దౌర్జన్యం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి విలేకరుల సమావేశంలో టైలరింగ్ వర్కర్స్ యూనియన్ మాజీ అధ్యక్షులు ఆవుల నాగేశ్వరరావు



సత్యమేవ జయతే – ఖమ్మం ఖమ్మం : ఖమ్మంలోని శ్రీనివాస్ నగర్ లో టైలరింగ్ వర్కర్స్ యూనియన్ సభ్యులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల స్థలాలకు రక్షణ కల్పించాలని, ప్రభుత్వ హామీ మేరకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని టైలరింగ్ వర్కర్స్ యూనియన్ మాజీ అధ్యక్షులు ఆవుల నాగేశ్వరరావు కోరారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆవుల నాగేశ్వరరావు, యూనియన్ సభ్యులు మాట్లాడుతూ.. ఖమ్మం నగరంలోని శ్రీనివాస్ నగర్ కు చెందిన టైలరింగ్ వర్కర్స్ కు 303, 304 సర్వే నెంబర్లలో 108 మందికి అప్పటి అర్బన్ ఎమ్మార్వో పట్టాలు ఇచ్చారని తెలిపారు. అట్టి స్థలములో ఇండ్లు నిర్మించుకోవడానికి ఎలక్ట్రిసిటీ కానీ, రోడ్లు కానీ, వాటర్ సౌకర్యం కాని లేకపోవడంవల్ల కొంత ఆలస్యమైందన్నారు. అయినప్పటికీ కొంతమంది ఎంతో ఖర్చుచేసి 30 ఇండ్లు, 80 బేస్మెంట్స్ నిర్మించుకున్నారని తెలిపారు. ఇళ్ల స్థలాలకు ఎటువంటి సంబంధంలేని అమృతం శ్రీనివాస్ అర్ధరాత్రి ప్రోక్లైనలతో కట్టిన ఇండ్లు, బేస్మెంట్స్ అన్ని కూల్చివేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. అది స్థలంలో అర్ధరాత్రి మట్టి పోశారని వాపోయారు. అదేవిధంగా మళ్ళీ నిర్మించుకున్న ఇండ్లను కూడా కూల్చివేశారని తెలిపారు. పోలీస్, రెవిన్యూ అధికారులకు పదే పదే ఫిర్యాదు చేసిన కాలయాపన చేస్తున్నారే తప్ప పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అమృతం శ్రీనివాస్ కు చెందిన కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు హల్ చల్ చేస్తున్నారని తెలిపారు. ఇట్టి విషయమై ఇందిరమ్మ ఇండ్ల కోసం మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకు వెళ్ళామని సహాయం చేస్తానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. జిల్లా అధికారులు సమగ్ర విచారణచేసి ప్రభుత్వం ఇచ్చిన లే-అవుట్ మ్యాప్ కు ఆధారంగా హద్దులు నిర్ణయించి మా ఇళ్ల స్థలాలు మాకు అప్పగించి న్యాయం చేయాలని వారు వేడుకున్నారు. ఈ విలేకరుల సమావేశంలో సిహెచ్.ఎం సుశీల, వి. నరసింహారావు, రచ్చ రామారావు, ఎం.ఎస్ కుమార్, కళావతి, వి. వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో వాహనదారులకు బిగ్ అలర్ట్

తెలంగాణలో వాహనదారులకు బిగ్ అలర్ట్. మీ బండి పాతదా, 2019కు ముందు రిజిస్టర్ అయిన వాహనమా..అయితే జాగ్రత్త పడాల్సిందే. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా భారీ మూల్యం చెల్లించుకోవాలి. ఇప్పటికే ఆర్టీఏ వార్నింగ్ సైరన్ మోగించింది. ఈ నెలాఖరే గడువు. గడువులోగా తొందరపడితే ఓకే. లేకుంటే మీ బండి షెడ్డుకే..ఇంతకూ ఆర్టీఏ వార్నింగ్ ఏమిటి, వాహనదారులు ఏం చేయాలి..అన్నదానిపై డీటేల్స్ తెలుసుకుందాం...

%తెలంగాణలో ఏప్రిల్ 1, 2019కి ముందు రిజిస్టర్ అయిన అన్ని పాత వాహనాలకు కచ్చితంగా హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్స్ - %ూ౯ా% అమర్చుకోవాల్సిందే. ఈ మేరకు తెలంగాణ రవాణా శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు సెప్టెంబర్ 30ని డెడ్‌లైన్‌గా విధించింది. లేదంటే అన్ని సేవలు క్లోజ్ కావటంతో పాటు కేసులు కూడా బుక్ అవుతాయని తెలంగాణ రవాణాశాఖ హెచ్చరిస్తోంది.

ముందుగా నంబర్ ప్లేట్స్ మార్చుకోకుంటే జరిగే పరిణామాలేంటో తెలుసుకుందాం. కొత్త మార్గదర్శకాలతో బుధవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. అందులో కొత్త నంబర్ ప్లేట్ మార్చే బాధ్యత యజమానిదిగా పేర్కొన్నారు. %ూ౯ా% లేని వాహనాలను అమ్మాలన్నా , కొనాలన్నా రూల్స్ అనుమతించవు. హైసెక్యూరిటీ ప్లేట్స్ లేకుంటే బీమా, పొల్యూషన్ సర్టిఫికెట్లు జారీ కావు. చట్టపరంగా కేసులు నమోదు చేసే అవకాశం ఉంటుంది. నంబర్ ప్లేట్స్ ఏ వాహనానికి ఎంత రేటు ఉంటుందో ఇప్పుడు తెలుసుకుందాం. ఇందులో ప్లేట్, స్నాప్ లాక్‌లు, ఇన్‌స్టాలేషన్ సర్వీస్ కలిపే ఉంటాయి.

టూ-వీలర్‌కు రూ.320 నుంచి రూ.380

టూ-వీలర్ హెూమ్ ఇన్‌స్టలేషన్‌కు రూ.531

డోర్-స్టెప్ సర్వీస్‌కు అదనంగా రూ.150 నుంచి రూ.200 చార్జ్

ఫోర్-వీలర్ రూ.590 నుంచి రూ.700

ఫోర్-వీలర్ హెూమ్ ఇన్‌స్టలేషన్ రూ.879

ఆటోరిక్షాకు రూ.450 నుంచి రూ.550



కమర్షియల్ వెహికల్స్ (ట్రక్/బస్) రూ.1,100 నుంచి రూ.1,500

కలర్ స్టికర్ కు రూ.50నుంచి రూ.100

రీప్లేస్‌మెంట్ కు 20% అదనం

%ూ% అప్రూవల్ తర్వాత మాత్రమే పేమెంట్ చేయాల్సి ఉంటుంది. అయితే తెలంగాణ రవాణా శాఖ ఎందుకు హై సెక్యూర్డ్ ప్లేట్స్ ను తప్పనిసరి చేసిందో ఇప్పుడు తెలుసుకుందాం%౫% నకిలీ నంబర్ ప్లేట్లను నిరోధించడం, వాహనాల దొంగతనాలను అరికట్టడం, రోడ్ సేఫ్టీని మెరుగుపరచడం కోసం ఈ నిబంధన తీసుకొచ్చారు. %ూ౯ా%లలో హెూలోగ్రామ్, %×చీణ% మార్కింగ్ నకిలీ చేయడం అసాధ్యం. -%ూ౯ా%లు కేంద్ర డేటాబేస్‌తో లింక్ అవవడంతో.. వాహన ట్రాకింగ్ అత్యంత సులభం అవుతుంది. ఇన్సూరెన్స్ క్లెయిమ్‌లలో ఇబ్బందులు ఉండవు.

హై సెక్యూరిటీ ప్లేట్స్ కోసం వెహికిల్ డీలర్ షాపుల్లో కూడా బుక్ చేసుకోవచ్చు. సో..సెప్టెంబర్ 30లోపు మీ వాహనానికి హై సెక్యూర్డ్ ప్లేట్ ఉండేలా చూసుకోవాల్సి ఉంటుంది.

# ఇప్పుడే గీజర్లు, దుప్పట్లు సిద్ధం చేసుకోండి..ఈ యేడు శీతాకాలంపై నిపుణుల హెచ్చరిక..!

నేటి పర్యావరణ మార్పుల కారణంగా వాతావరణం, మానసిక స్థితి మరింత కఠినంగా మారుతోంది. సగటు ఉష్ణోగ్రత ఏ ఏడాదికి ఆ యేడు పెరుగుతోంది. వర్షాల తీవ్రత కూడా అదేస్థాయిలో పెరుగుతోంది. ఈ రుతుపవన కాలంలో దేశంలోని అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్ వంటి రాష్ట్రాల్లో దీని ప్రభావం కనిపించింది. ఇప్పుడు శీతాకాలం ప్రారంభమైంది. వాతావరణ నిపుణులు ఇప్పటికే శీతాకాలం కోసం ప్రజల్ని అప్రమత్తం చేయడం ప్రారంభించారు.

%నేటి పర్యావరణ మార్పుల కారణంగా వాతావరణం, మానసిక స్థితి మరింత కఠినంగా మారుతోంది. సగటు ఉష్ణోగ్రత ఏ ఏడాదికి ఆ యేడు పెరుగుతోంది. వర్షాల తీవ్రత కూడా అదేస్థాయిలో పెరుగుతోంది. ఈ రుతుపవన కాలంలో దేశంలోని అనేక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్ వంటి రాష్ట్రాల్లో దీని ప్రభావం కనిపించింది. ఇప్పుడు శీతాకాలం ప్రారంభమైంది. వాతావరణ నిపుణులు ఇప్పటికే శీతాకాలం కోసం ప్రజల్ని అప్రమత్తం చేయడం ప్రారంభించారు. ఈసారి తీవ్రమైన చలి ఉండవచ్చని వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇప్పుడు వాతావరణ నిపుణులు శీతాకాలం గురించి హెచ్చరిక జారీ చేశారు. లా-నినా ప్రభావం కారణంగా ఈసారి ఎముకలు కొరికేంత చలి ఉండవచ్చునని చెబుతున్నారు.

నిపుణులు అభిప్రాయం ప్రకారం, శీతాకాలం సగటు కంటే చల్లగా ఉంటుంది. దీనికి కారణం లా-నినా ప్రభావం అంటున్నారు నిపుణులు. లా-నినా క్రియాశీలత కారణంగా, ఉష్ణోగ్రతలో తగ్గుదల నమోదవుతుంది. ఈసారి అక్టోబర్, డిసెంబర్ మధ్య 71 శాతం వరకు చలితీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. దీని కారణంగా, ఈసారి శీతాకాలం ఇబ్బందికరంగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

వాస్తవానికి, ఈ సంవత్సరం చివరి నాటికి లా నినా తిరిగి రావచ్చని వాతావరణ నిపుణులు హెచ్చరించారు. ఇది ప్రపంచ వాతావరణ నమూనాలను మారుస్తుంది. భారతదేశంలో శీతాకాలాలు సాధారణం కంటే చల్లగా ఉండవచ్చు. యుఎస్ నేషనల్ వెదర్ సర్వీస్ క్లైమేట్ ప్రిడిక్షన్ సెంటర్ సూచనలో అక్టోబర్, డిసెంబర్ 2025 మధ్య లా నినా చురుకుగా మారే అవకాశం 71శాతం ఉందని తెలిపింది. అయితే, ఈ సంభావ్యత డిసెంబర్ 2025, ఫిబ్రవరి 2026 మధ్య 54శాతానికి తగ్గుతుంది.

**మన ఆరోగ్యం బాగుండాలంటే రోజూ తినే ఆహారంలో ఎన్నో రకాల పోషకాలు ఉండాల్సిందే. ఆహారంలోని కార్బోహైడ్రేట్లు, కొవ్వులు శక్తినిచ్చినా.. మన శరీరంలోని అన్ని అవయవాలు సరిగా పనిచేయాలంటే విటమిన్లు, ప్రొటీన్లు, అమైనో ఆమ్లాల వంటి పోషకాలు కూడా అందాలి. వీటితోపాటు కొన్ని ఖనిజ లవణాలూ శరీరానికి అత్యవసరం. వాటిలోనూ స్థూల పోషకాలు, సూక్ష్మ పోషకాలు లేదా ట్రేస్ మినరల్స్ అని రెండు రకాలు. కాల్షియం, సోడియం, పొటాషియం, క్లోరిన్ (క్లోరైడ్), మెగ్నీషియం, ఫాస్పేట్ లు స్థూల పోషకాలు. శరీరంలో ఎముకలు, కండరాలు, గుండె, మెదడుల పనితీరు స్థూల పోషకాలపై ఆధారపడి ఉంటుంది. ఇక క్రోమియం, కాపర్, ఫ్లోరైడ్, అయోడిన్, ఐరన్, మాంగనీస్, మాలిబ్డినమ్, సెలీనియం, జింక్ లు సూక్ష్మ పోషకాలు లేదా ట్రేస్ మినరల్స్. ఇందులో క్రోమియం రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు సాధారణంగా ఉండేందుకు తోడ్పడుతుంది. మిగతా ట్రేస్ మినరల్స్ అన్నీ శరీరంలో హార్మోన్లు, ఎంజైముల తయారీకి అవసరం. మరి ఈ ఖనిజ లవణాలు ఏమిటి, వేటి నుంచి అవి లభిస్తాయి, లోపిస్తే వచ్చే సమస్యలేమిటి, ఎలాంటి జాగ్రత్తలు చేపట్టాలో తెలుసుకుందాం.. రోజూ అందాల్సిందే.. ఖనిజ లవణాలన్నీ తక్కువ స్థాయిలోనే అయినా శరీరానికి అత్యంత అవసరం.**

అంతేకాదు ఇవి రోజూ శరీరానికి అందాల్సిందే. లేకపోతే మనకు ఎన్నో రకాల అనారోగ్యాలు, వ్యాధులు కలుగుతాయి. సాధారణంగా ఈ ఖనిజ లవణాలన్నీ మనం తీసుకునే ఆహారం ద్వారానే లభిస్తాయి. పోషకాహారం తీసుకునేవారిలో ఖనిజ లవణాల లోపం ఏర్పడే అవకాశం తక్కువ. కాల్షియం, అయోడిన్, ఐరన్ ల లోపం మాత్రం ఎక్కువగా కనిపిస్తుంటుంది. అంతేగాకుండా ఎప్పుడూ ఒకే రకమైన ఆహారం తీసుకోవడం లేదా కొన్ని రకాల ఆహారానికి పూర్తిగా దూరంగా ఉండడం వల్ల కూడా ఖనిజ లవణాల లోపం ఏర్పడుతుంది. ఉదాహరణకు గుడ్లు, పాల పదార్థాలు, శాకాహారం మాత్రమే తీసుకునే వారిలో ఐరన్ లోపిస్తుంది. ఇక శిశువులకు ఖనిజ లవణాల అవసరం ఎక్కువ. ఎందుకంటే వారిలో పెరుగుదల వేగం ఎక్కువగా ఉంటుంది. ఖనిజ లవణాలేవైనా ఒక పరిమిత స్థాయికి మించి సప్లిమెంట్ల రూపంలో తీసుకుంటే అవి శరీరానికి విషంగా పరిణమించే ప్రమాదం ఉంటుంది. అందువల్ల వీటి లోపం ఏర్పడినవారు తప్పనిసరిగా వైద్యుల పర్యవేక్షణలో, వారు సూచించిన మోతాదుల్లోనే వినియోగించాలి.

స్థూల ఖనిజాలు

వ్యక్తులకు రోజుకు 1,000 మిల్లీగ్రాముల సోడియం అవసరం. దీనిని రోజుకు 2,400 మిల్లీగ్రాములకు మించి తీసుకుంటే శరీరానికి విషపూరితంగా మారుతుంది. ప్రస్తుతం మారిన ఆహార అలవాట్ల కారణంగా శరీరానికి అందే సోడియం శాతం చాలా ఎక్కువగా ఉంటోంది. ముఖ్యంగా రెస్టారెంట్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలోని ఆహార పదార్థాలు, బేకరీల్లోని జంక్ ఫుడ్, ప్రాసెస్డ్ ఫుడ్, ఇంట్లోనూ ఉప్పు అధికంగా వినియోగించడం వంటివాటి వల్ల అధికంగా సోడియం అందుతోంది. ఇది ఎన్నో సమస్యలకు దారితీస్తుంది. మెదడు, కండరాల ఆరోగ్యానికి పొటాషియం శరీరానికి అత్యంత అవసరమైన పోషకాల్లో పొటాషియం ప్రధానమైనది. ముఖ్యంగా నాడులు, కండరాలు సక్రమంగా పనిచేయాలంటే శరీరానికి తగిన మోతాదులో పొటాషియం అందాల్సిందే. అంతేకాదు గుండె జబ్బుల నివారణ, రక్తపోటు నియంత్రణలోనూ ఇది కీలకం. ఎముకలు దృఢంగా ఉండడానికి, మూత్ర పిండాల్లో రాళ్లు

పొటాషియం స్థాయిలను తెలుసుకోవచ్చు. బీడీలు, సిగరెట్లు, ఖైనీల వంటి పొగాకు ఉత్పత్తులు, ఆల్కాహాల్ కారణంగా.. సరైన పోషకాహారం తీసుకోకపోవడం, కొన్ని రకాల మందుల వినియోగం వల్ల శరీరంలో పొటాషియం లోపం ఏర్పడుతుంది. దీనిని హైపోకాలేమియా అంటారు. లోపం ఉన్నవారు ఆహారంలో మార్పులు, సప్లిమెంట్ల ద్వారా తీసుకోవచ్చు. ఇక మూత్ర పిండాలు దెబ్బతినడం, కొన్ని రకాల మందులు, అధికంగా పొటాషియం ఉండే ఆహారం తీసుకోవడం వంటి కారణాల వల్ల శరీరంలో పొటాషియం స్థాయి పరిమితికి మించి పెరుగుతుంది. దీనివల్ల కండరాల బలహీనత, గుండె కొట్టుకునే వేగంలో మార్పులు, చివరికి గుండెపోటు వచ్చే ప్రమాదం ఉంటుంది. రక్తపోటు నియంత్రణకు క్లోరిన్ (క్లోరైడ్) : శరీరంలో ద్రవాల స్థితిని

సమతూకంగా ఉంచేందుకు క్లోరైడ్ అత్యవసరం. అంతేగాకుండా కండరాల పనితీరుకు, రక్త పోటును నియంత్రణలో ఉంచడానికి ఇది తోడ్పడుతుంది. అయితే సాధారణంగా క్లోరైడ్ లోపం ఏర్పడడం చాలా అరుదు. ఎందుకంటే



# ఈ ఖనిజాలు అందితే ఆరోగ్యం సూపర్..



ప్రాణాధారం .. ఖనిజ లవణాలు శరీరానికి ప్రాణాధారం. ఇవి కణాల లోపలి నుంచి శరీరం మొత్తం మీద వివిధ ద్రవ పదార్థాల స్థితిని కాపాడుతాయి. ఈ ఖనిజ లవణాలతో తయారయే ఎలక్ట్రోలైట్లు నాడులు, కండరాల పనితీరును నియంత్రిస్తాయి. శరీరంలో ఆమ్లయుత–క్షారయుత పరిస్థితిని సమతుల్యం చేస్తాయి. ఒకవేళ ఖనిజ లవణాల లోపం ఏర్పడితే ఎలక్ట్రోలైట్లు తగ్గిపోయి.. శరీరంలో నీటి శాతం పడిపోతుంది. కండరాలు, నాడుల పనితీరు దెబ్బతింటుంది. ఇది చివరికి మరణానికి కూడా దారితీసే అవకాశం ఉంటుంది. ఈ ఖనిజ లవణాల లోపాన్ని రక్త, మూత్ర పరీక్షల ద్వారా గుర్తించవచ్చు. ఎముకలు, కండరాలకు కాల్షియం.. శరీరంలో ఎముకలు, దంతాలు ఏర్పడడానికి, ఎముకలు బలహీనం కాకుండా ఉండడానికి, విరిగిన ఎముకలు అతుక్కోవడానికి ఇది తోడ్పడుతుంది. గాయాలైనప్పుడు రక్తం గడ్డకట్టడానికి, కండరాల పనితీరు సరిగా ఉండడానికి కాల్షియం, గుండె సరిగా కొట్టుకోవడానికి, శరీరంలో చాలా రకాల ఎంజైములు సరిగా పనిచేయడానికి కూడా కాల్షియం అత్యవసరం. శరీరానికి తగిన మోతాదులో కాల్షియం అందకపోతే రక్తంలో కాల్షియం లోపిస్తుంది. దాంతో శరీరం ఎముకల నుంచి కాల్షియంను రక్తంలోకి తరలిస్తుంది. దీనినే 'హైపోకాల్సిమియా' అంటారు. దీంతో ఎముకలు బలహీన పడి 'ఆస్టియోపోరోసిస్' సమస్య తలెత్తుతుంది. చిన్నపాటి దెబ్బలు, ప్రమాదాలకే విరిగిపోతాయి. మనిషి శరీర బరువులో 1.5 నుంచి 2 శాతం దాకా కాల్షియం ఉంటుంది. కాల్షియం ఎక్కువగా పాలు, పాల పదార్థాలు, మాంసం, గుడ్లు వంటి పదార్థాల్లో లభిస్తుంది. సాధారణ వ్యక్తులకు రోజుకు 1,000 మిల్లీగ్రాములు, 50 ఏళ్లు పైబడిన వారికి 1,200 మిల్లీగ్రాముల కాల్షియం అవసరం. ఇది రోజుకు 2,500 మిల్లీగ్రాములకు మించి తీసుకుంటే శరీరానికి విషపూరితంగా మారుతుంది. శరీరంలో కాల్షియం స్థాయి ఎక్కువైతే 'హైపర్ కాల్సిమియా' సమస్య తలెత్తుతుంది.

దానివల్ల అజీర్తి, విపరీతమైన దాహం, కడుపునొప్పి, ఆకలి మందగించడం, మూత్రం ఎక్కువగా రావడం, గందరగోళపడడం వంటి మానసిక సమస్యలు తలెత్తుతాయి. చివరికి కోమాలోకి వెళ్లి మరణం కూడా సంభవించే అవకాశం ఉంటుంది. కణాలకు, శరీర సమతుల్యతకు సోడియం .. నాడులు, కండరాలు సరిగా పనిచేయడానికి, శరీరంలో ద్రవాల సమతుల్యతకు సోడియం అత్యవసరం. రక్తంలోను, కణాల చుట్టూ ఉండే ద్రవం (ఫ్లూయిడ్)లోను సోడియం ఉంటుంది. ఇది గ్లూకోజ్, నీరు, అమైనో ఆమ్లాల రవాణాలో తోడ్పడుతుంది. సాధారణంగా సోడియం లోపం ఏర్పడడం అరుదు. శరీరం నుంచి ద్రవాలు విపరీతంగా వెళ్లిపోయే డీహైడ్రేషన్ (అతి మూత్రం, వాంతులు, విరేచనాలు, విపరీతంగా చెమట పట్టడం వంటివి), కిడ్నీలు దెబ్బతినడం, శరీరంపై తీవ్రంగా కాలిన గాయాలు కావడం వంటి పరిస్థితుల్లో శరీరంలో సోడియం లోపం ఏర్పడుతుంది. దీనివల్ల కండరాల వణుకు, బిగుసుకుపోవడం, గందరగోళం, స్పృహ తప్పిపోవడం వంటి ప్రమాదాలు ఏర్పడుతాయి. ఈ పరిస్థితి మరీ తీవ్రమైతే కోమాలోకి వెళ్లిపోతారు, మరణం కూడా సంభవించవచ్చు. ఎలక్ట్రోలైట్లు ఎక్కువగా ఉండే ద్రవాలను తీసుకోవడం ద్వారా, సోడియం ద్రవాన్ని నరాల ద్వారా ఎక్కించడం ద్వారా లోపాన్ని అధిగమించవచ్చు. అయితే సోడియం ఎక్కువగా తీసుకోవడం వల్ల చాలా సమస్యలు తలెత్తుతాయి. రక్తంలో ద్రవాల శాతం పెరిగి రక్తపోటుకు దారితీస్తుంది. గుండెపోటు, కడుపులో కేన్సర్, కిడ్నీ వ్యాధులు, కాలేయ సమస్యలు తలెత్తుతాయి. సోడియం ఖనిజానికి ప్రధానమైన వనరు ఉప్పు. మాంసం, వెన్న, ఆలివ్, మొక్కజొన్న, బంగాళదుంపల్లో కూడా ఇది లభిస్తుంది. సాధారణ

ఏర్పడకుండా నిరోధించడానికి తోడ్పడుతుంది. శరీరంలో ఉండే పొటాషియంలో చాలా వరకు కణాల అంతర్భాగంలో ఉంటుంది. పొటాషియం స్థాయిలు బాగా పెరిగినా.. బాగా తగ్గినా కూడా ఇబ్బందే. దీనివల్ల గుండెపోటు వచ్చే ప్రమాదమూ ఉంటుంది. పొటాషియం లోపం వల్ల కండరాలు బలహీనమైపోతాయి. అది తీవ్రమైతే పక్షవాతం వచ్చే ప్రమాదం ఉంటుంది. హైపర్ థైరాయిడిజం సమస్య తలెత్తుతుంది.

పాలు, అరటిపండ్లు, టామాటా, నారింజ, పుచ్చకాయ, బంగాళదుంప, చిలగడదుంప, పాలకూర, ఆకుపచ్చని కూరగాయలు, బఠాణీ, చిక్కుడు వంటి గింజలు, ఓఆర్ఎస్ పౌడర్ వంటి ఎలక్ట్రోలైట్ ద్రవాల్లో పొటాషియం ఎక్కువగా లభిస్తుంది. ఇది సాధారణ వ్యక్తులకు రోజుకు 3.5 గ్రాముల వరకు అవసరం. చిన్న పిల్లలు, గర్భిణులకు మరింత ఎక్కువగా అంటే 4.7 గ్రాముల వరకు అందాలి. అయితే దీర్ఘకాలం పాటు పొటాషియం ఎక్కువ మోతాదులో అందడం వల్ల గుండెకు చేటు కలుగుతుంది. రక్త పరీక్షల ద్వారా శరీరంలో

మనం నిత్యం ఉపయోగించే అన్ని రకాల ఆహార పదార్థాల్లోనూ ఉప్పును వినియోగిస్తాం. దాని నుంచి తగిన మోతాదులో క్లోరైడ్ అందుతుంది. క్లోరైడ్ కు ప్రధాన వనరు మనం సాధారణంగా వినియోగించే ఉప్పు. దీంతోపాటు వెన్న, ఆలివ్, మొక్కజొన్న బ్రెడ్, ఆలూ చిప్స్ వంటి ప్రాసెస్డ్ ఆహారం, మాంసంలోనూ లభిస్తుంది. సాధారణ వ్యక్తులకు రోజుకు ఒక గ్రాము (1000 మిల్లీగ్రాముల) క్లోరైడ్ అవసరం. క్లోరిన్ స్వతహాగా విషపూరితమైన పదార్థం. అది పరిమితికి మించితే ప్రమాదకరంగా మారుతుంది. అయితే ఆహారం ద్వారా అధికంగా అందే క్లోరిన్ ను శరీరం ఎప్పటికప్పుడు విసర్జిస్తూ ఉంటుంది.

ఎదుగుదలకు తోడ్పడే మెగ్నీషియం .. శరీరంలో ఎముకలు, దంతాల నిర్మాణానికి.. నాడులు, కండరాల పనితీరు సరిగా ఉండడానికి మెగ్నీషియం అత్యవసరం. ముఖ్యంగా శరీరంలో వివిధ అవయవాలు విడుదల చేసే ఎంజైములు క్రియాశీలం కావడంలో ఇది కీలకపాత్ర పోషిస్తుంది.

# తరచూ అలెర్జీ సమస్యలు... ఎందుకని?

ఈ రోజుల్లో ఎక్కడ చూసినా... అలెర్జీ అన్న పదం వినిపిస్తూనే ఉంటుంది. మన చుట్టూ ఉన్న వారిలో చాలా మందిలో ఈ సమస్య కనిపిస్తుంది. తుమ్ములు, దగ్గు, ముక్కు కారటం, దురదలు ఇలా అలెర్జీ వలన కనిపించే లక్షణాలు, సమస్యలు చాలా మందికి అనుభవమే. ప్రపంచ వ్యాప్తంగా 10 నుంచి 30 శాతం మంది వరకు అలెర్జీ బాధితులే. ఆధునిక కాలంలో బాగా విస్తరించిపోయిన ఈ సమస్య గురించి తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

అలెర్జీ అంటే ఏంటి...? ఆహారం, పుప్పొడి రేణువులు, దుమ్ములోని పురుగులు (డస్ట్ మైట్స్), మందులు, ఇలా ఎన్నో వాటి వల్ల ఈ సమస్య వస్తుంటుంది. రోగ నిరోధక వ్యవస్థ అన్నది మన శరీరంలో అతి క్లిష్టమైన వ్యవస్థ. వైరస్, బ్యాక్టీరియా, టాక్సిన్ల (ఫారీన్ సబ్ స్టాన్స్/ఫారీన్ ఇన్వేడర్స్) నుంచి మన శరీరాన్ని కాపాడుతూ ఉండే వ్యవస్థ. అలెర్జీ కారకాలు మన శరీరంలోకి చొరబడడం ఆలస్యం వీటిని హానికారకాలుగా గుర్తించిన ఆ క్షణమే రోగ నిరోధక వ్యవస్థ వాటిపై దాడి మొదలు పెడతుంది.

ఉదాహరణకు ఓ పుప్పొడి రేణువు (అలెర్జీ కారకం) మన శరీరంలోకి ప్రవేశించిందనుకోండి. అప్పుడు రోగ నిరోధక వ్యవస్థ ఆ పుప్పొడి ఎక్కడ ఉందో గుర్తిస్తుంది. దానిపై పోరాడేందుకు యాంటీబాడీలను ఉత్పత్తి చేస్తుంది. ఈ యాంటీ బాడీలనే ఇమ్యునోగ్లోబులిన్లు (వీటిలోనూ ఐజీఈ, ఐజీజీ, ఐజీఎం, ఐజీఏ రకాలున్నాయి) అంటారు. ఈ యాంటీబాడీలు కణాల్లోకి ప్రయాణం చేసి పుప్పొడిపై దాడికి గాను రసాయనాలను విడుదల చేస్తాయి. ఇవే అలెర్జీ రియాక్షన్ కు కారణం అవుతాయి. ఈ రియాక్షన్ ముక్కు, ముక్కు నాసికా కుహరములలోను, గొంతు, ఊపిరితిత్తులు, చెవులు, కడుపు, చర్మంలోపల లక్షణాలకు దారితీస్తుంది. కొన్ని పదార్థాలే ఎందుకు అలెర్జీకి దారితీస్తాయి, వేరేవి ఎందుకు కారణం కావన్న దానికి ఇంత వరకు కచ్చితమైన కారణాలు నిర్ధారణ కాలేదు. అలాగే, కొందరు అలెర్జీకి లోనైతే, అవే కారకాలు మరికొందరిలో అలెర్జీకి దారితీయకపోవడం వెనుకనున్న కారణాలను కూడా పరిశోధనలు ఇతమిద్ధంగా తేల్చలేదు.

అలెర్జిక్ రైనైటిస్ (ముక్కు కారటం), అలెర్జిక్ కంజెంక్టివైటిస్ (కంటి దురదలు, అలెర్జీలు), అలెర్జిక్ ఆస్తమా, యుర్టికేరియా (హైవ్స్), ఫుడ్ అలెర్జీలు. ఇవి అతి సాధారణంగా, ఎక్కువగా కనిపించే అలెర్జీలు. అలెర్జీ కారకాలను గాలి ద్వారా పీల్చవచ్చు. ఆహారం ద్వారా కడుపులోకి తీసుకోవచ్చు. మందులు లేదా పురుగు కాటు ద్వారా చర్మం ద్వారా శరీరంలోకి ప్రవేశించొచ్చు. ఏ మార్గం ద్వారా శరీరంలోకి ప్రవేశించాయన్నదాన్ని బట్టి అలెర్జీ లక్షణాలు కనిపిస్తాయి. ఉదాహరణకు ఆహారంలో అలర్జీ కారకాలుంటే దాన్ని తీసుకున్నప్పుడు విడుదలయ్యే మీడియేటర్స్ చర్మంపై దద్దుర్లకు కారణమవుతాయి. అలెర్జిక్ రైనైటిస్ : అలెర్జిక్ వ్యాధుల్లో ఎక్కువగా కనిపించే సమస్య ఇది. కాలానుగుణంగా లేదా ఎప్పుడూ ఉండొచ్చు. దీన్ని హేఫీవర్ అని కూడా అంటుంటారు. అదే పనిగా తుమ్ములు, ముక్కు కారటం, ముక్కులు మూసుకుపోవడం, ముక్కులో, కళ్లల్లో, నోటి పై భాగంలో దురద ఉంటుంది. ఈ సమస్య ఎప్పుడూ వేధిస్తుంటే ఇంట్లో ఉండే డస్ట్ మైట్స్, పెంపుడు జంతువులు, బూజు కారణం కావొచ్చు. ప్రధానంగా గాలిలో చేరిన అలెర్జీ కారకాలు శ్వాస తీసుకునే సమయంలో ముక్కుల్లో చేరడం వల్ల ఈ సమస్య నిరంతరం వేధిస్తుంటుంది. అలెర్జీ కారకాలు ముక్కులోపలికి చేరిన తర్వాత కణజాలం వాపునకు గురవుతుంది. ఈ అలెర్జీకి కళ్లు, చెవులు, సైనస్ తోనూ సంబంధం ఉంటుంది. యుర్టికేరియా (దద్దుర్లు) : చర్మంపై ఎర్రటి దద్దుర్లు కనిపిస్తాయి. పెద్దగా లేదా చిన్నగా ఉండొచ్చు. దురద ఉంటుంది. కొన్ని రకాల ఆహార పదార్థాలు, మందుల వల్ల ఈ సమస్య ఏర్పడుతుంది. చిన్నారుల్లో వైరల్ ఇన్ఫెక్షన్ వల్ల కూడా రావచ్చు. అలెర్జిక్ కంజెంక్టివైటిస్ : అలెర్జీ కారకాలకు కళ్లు స్పందించినప్పుడు ఏర్పడే లక్షణాలు కళ్లు ఎర్రబారడం, దురద, వాపు. నీరు కారడం, కనుగుడ్డు చుట్టుపక్కల, కను రెప్పల లోపలి వైపు భాగంలో వాపు, మంట వుంటాయి. ఆస్తమా : ఆస్తమా అన్నది దీర్ఘకాలిక, ఎడతెగని ఊపిరితిత్తుల సమస్య.

దగ్గు, ఛాతీ బిగపట్టినట్టు ఉండడం, శ్వాస సరిగా తీసుకోలేకపోవడం, పిల్లికూతలు తదితర లక్షణాలు కనిపిస్తాయి.


ఆస్తమా లక్షణాల్లో శ్వాస నాళా ల్లో వాపు వచ్చి అవి కుచించుకుపోతా యి. దాంతో శ్వాస కష్టంగా అనిపిస్తుంది. ఆస్తమా సమస్య ఉన్న 78 శాతం మందిలో అలెర్జిక్ రైనైటిస్ కూడా ఉంటుంది. ఈ రెండింటికీ ఒకదానితో ఒకటి సంబంధం ఉంది. ఎక్కువ మందిలో అలెర్జిక్ రైనైటిస్ తోనే మొదలై ఆస్తమాగా మారుతుంది. ఆస్తమా ఉన్న వారికి శ్వాసకోస ఇన్ఫెక్షన్లు వస్తే పరిస్థితి మరింత తీవ్రతరం అవుతుంది.

ఫుడ్ అలెర్జీ : ఫుడ్ అలెర్జీ ఉన్న వారికి కొన్ని రకాల ఆహార పదార్థాలు సరిపడవు. దీంతో ఆ పదార్థాలు తీసుకున్నప్పుడు అందులో ఉండే అలెర్జీ కారకాలపై పోరాడేందుకు రోగ నిరోధక వ్యవస్థ స్పందిస్తుంది. ఆవు పాలు, గుడ్లు, వేరు శనగ, గోధుమ, సోయా, చేపలు, షెల్ ఫిష్, నట్స్ లో ఉండే కాంపోనెంట్స్ వల్ల ఫుడ్ అలెర్జీలు వచ్చే అవకాశం ఉంది. యాంటీబయోటిక్స్ (పెన్సిలిన్), యాస్పిరిన్, ఐబూప్రోఫెన్ తరహా యాంటీ ఇన్ఫ్లమ్మేటరీ ఔషధాల వల్ల కూడా అలెర్జిక్ రియాక్షన్లు వచ్చే ప్రమాదం ఉంది.

సైనసైటిస్ :నాసికా కుహరములలో (ముక్కుకు అనుసంధానంగా ముక్కు పక్క న కంటి కింద భాగంలో ఉండేవి) వాపునే సైనసైటిస్ అంటారు. సైనసైటిస్ సమస్యలో ఇలా వాపు కారణంగా రంధ్రాలు మూసుకుపోతాయి. అవి ఫ్లూయిడ్ తో పూడుకుపోతాయి. అప్పుడు క్రిములు వృద్ధి చెంది ఇన్ఫెక్షన్ కు దారితీస్తాయి. తలనొప్పి, ముక్కు భాగంలో నొప్పి, ముక్కు కారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

తీవ్రమైన అలెర్జిక్ రియాక్షన్స్ : అనాఫిలాక్సిస్ అనేది తీవ్రమైన ప్రాణాంతక అలెర్జిక్ రియాక్షన్. ఆహార పదార్థాలు, పురుగులు కుట్టడం, మందుల వల్ల ఈ రియాక్షన్ రావచ్చు. ఒకే సమయంలో ఒకటికి మించిన ప్రాంతాల్లో ఈ రియాక్షన్ వచ్చే అవకాశాలూ ఉన్నాయి. వేడిగా ఉండడం, ఎర్రబారడం, ఎర్రగా ర్యాష్ ఉండి దురద పెట్టడం, శ్వాస సమస్య, గొంతు పట్టేసినట్టు ఉండడం, ఆందోళన, వాంతులు, డయేరియా, తిమ్మిర్లు వంటివి కనిపిస్తాయి. కొందరిలో రక్తపోటు పడిపోయి షాక్ కు లోను కావచ్చు. ఈ రియాక్షన్ కు వెంటనే చికిత్స ఇప్పించాలి. లేకుంటే ప్రాణాంతకం అవుతుంది.






అలెర్జీలు కనిపిస్తే ఏం చేయాలి...? అలెర్జీ సమస్యలు కనిపిస్తే ఇమ్యునాలజిస్ట్ లేదా ఎండీని సంప్రదించాలి. కుటుంబ ఆరోగ్య చరిత్ర, శారీరక పరిశీలన, చర్మ పరీక్ష, రక్త పరీక్షల ద్వారా వైద్యులు అలెర్జీ కారకాలను గుర్తిస్తారు. ఆ తర్వాత దాన్ని కంట్రోల్ చేసేందుకు ట్రీట్ మెంట్ కు ప్లాన్ చేస్తారు. ఇంజెక్షన్లు, టాబ్లెట్లు సూచించవచ్చు. యాంటీ హిస్టామిన్స్, నాసల్ యాంటీ హిస్టామిన్స్, నాసల్ కార్టికోస్టెరాయిడ్ డ్రాప్స్, ఆస్తమాలో ఇన్ హేలర్స్, ఓరల్ స్టెరాయిడ్స్ ఇలా మందులు సూచిస్తారు. ఇవి కూడా దీర్ఘకాలం పాటు వాడాల్సి ఉంటుంది. దాదాపు చాలా రకాల అలెర్జీలకి శాశ్వత నిర్మూలన లేదు. వాటిని అదుపు చేయడం వరకే చికిత్స. అలెర్జీలకు సమర్థవంతమైన చికిత్స కోసం ప్రపంచవ్యాప్తంగా ఎన్నో పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి. కానీ, ఇంతవరకూ వాటిని పూర్తిగా నిర్మూలించే సమర్థవంతమైన చికిత్సలు సాధ్యం కాలేదు. పిల్లల్లో ఆహారం, మందుల పరంగా ఉన్న అలెర్జీలు తర్వాత కాలంలో వాటంతట అవే కనుమరుగు అయ్యే అవకాశం ఉంటుంది.

ఎవరికి రిస్క్ : అలెర్జీలు ఏ వయసులోనయినా రావచ్చు. ఆహార పరమైన అలెర్జీలు మాత్రం చిన్న వయసులోనే మొదలవుతాయి. కుటుంబ చరిత్ర, జెనెటిక్స్ ప్రధాన పాత్ర పోషిస్తాయి. తల్లిదండ్రులకు అలెర్జీలు ఉంటే పిల్లలకూ అవి రావడానికి ఎక్కువ అవకాశాలుంటాయి. సహజంగా జన్మించడం కాకుండా, సిజేరియన్ ద్వారా పుట్టిన పిల్లలకు అలెర్జీల రిస్క్ ఎక్కువగా ఉంటుంది. నివారణ : పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించాలి. ఇది ఈ రోజు దాదాపుగా అసాధ్యం. ఇంట్లో ఉండే డస్ట్ మైట్స్ వల్ల అలెర్జీలు వస్తుంటే తేమ తక్కువ ఉండేలా చూసుకోవడంతోపాటు వారానికోసారి బెడ్ షీట్స్, పిల్లో కవర్స్, బ్లాంకెట్లను వేడినీటితో వాష్ చేయాలి. ఇంట్లో పెంపుడు జంతువుల కారణంగా అలెర్జీలు వస్తుంటే వాటిని ఇంట్లో లేకుండా చూసుకోవాలి. అలాగే, ఇంట్లో పీల్చే వాయువును స్వచ్ఛంగా మార్చేందుకు ఎయిర్ ప్యూరిఫయర్లు మార్కెట్లో ఉన్నాయి.

# వర్షాకాలం ఈ ఆఫ్‌బీట్ ప్రదేశాలను చుట్టేసిరండి..!





వర్షాకాలం ప్రయాణాలు ఈ అరుదైన ఆఫ్‌బీట్ డెస్టినేషన్లకు వెళ్లడానికి ట్రై చేయండి. ఇవి పశ్చిమ కనుమల్లో ఉండే అద్భుతమైన పర్యాటక ప్రాంతాలు.
అమెజాన్‌లో తక్కువ ధరకే స్మూత్ స్క్రీన్, గొప్ప పెర్ఫార్మన్స్ చూపే టాప్ క్వాలిటీ టాబ్లెట్స్‌ను సొంతం చేసుకోండి

కొంత మంది పర్యాటకులు కొద్దిపాటి వర్షపాతం కనిపించినా తమ ప్రయాణ ఏర్పాట్లను పూర్తిగా రద్దు చేసుకుంటారు. అది వినడానికి ఆశ్చర్యంగా అనిపించినా నిజమనే చెప్పాలి. వర్షాకాల ప్రయాణం చాలా అద్భుతంగా ఉంటుందని తెలిసినా కొందరు బయటకు వెళ్లలేరు. అయితే, అలాంటి ప్రయాణికులు వర్షాకాలం ప్రారంభమవ్వడానికి ముందే పశ్చిమ కనుమల్లోని ఈ ఆఫ్‌బీట్ ప్రదేశాలను సందర్శించి రండి. ఎందుకంటే వర్షాకాలంలో ఆ ప్రదేశాలు ఎక్కువకాలం అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉండటంతో అంతకన్నా ముందే ఓ ట్రిప్ ప్లాన్ చేయడం మంచిది. మరోవైపు ప్రస్తుత సమయంలో ప్రకృతి కూడా కొత్త అందాలతో నిండి ఉంటుంది కాబట్టి ప్రయాణ ఏర్పాట్లు చేసుకోవచ్చు.

**అగుంబే, కర్ణాటక..**

కర్ణాటకలోని శివమొగ్గ జిల్లాలో ఉండే అగుంబే అనే పర్యాటక ప్రదేశాన్ని దక్షిణ భారతదేశంలోని చిరపుంజీ అని పిలుస్తారు. ప్రస్తుతానికి రుతుపవనాలు చాలా దూరంగా ఉండటంతో వర్షం గురించి ఆలోచించే ప్రయాణికులు భయపడాల్సిన అవసరం లేదు. ఎంచక్కా ఫ్యామిలీతో విహరించి అక్కడి అరణ్య ప్రాంతాన్ని, చుట్టుపక్కల గ్రామాలను సందర్శించవచ్చు. ఈ ప్రదేశం గొప్ప ప్రకృతి అందాలు, సాంస్కృతిక అనుభవాలను కలిగి ఉంది. దీంతో వేసవిలో అక్కడ విహరించడానికి అద్భుతంగా ఉంటుంది.

**వట్టకనల్, తమిళనాడు..**

తమిళనాడులోని అద్భుతమైన పర్యాటక ప్రదేశాల్లో కొడైకెనాల్ ఒకటి. దానికి సమీపంలోనే ఉంటుంది ఈ వట్టకనల్ అనే మరో అందమైన ప్రదేశం. అక్కడి పరిసరాలన్నీ చాలా ఆహ్లాదకరంగా, అద్భుతంగా, అందంగా ఉండటంతో ప్రకృతి ప్రేమికులకు స్వర్గధామంలా అనిపిస్తుంది. చుట్టూ కొండలు, లోయలు, పచ్చిక బయళ్లు పర్యాటకుల మనసును హత్తుకునేలా ఉంటాయి. అక్కడ అద్భుతమైన హోమ్‌స్టేల సౌకర్యం కూడా అందుబాటులో ఉండటంతో ఎలాంటి బెరుకు లేకుండా హాలిడేని ప్లాన్ చేయొచ్చు.

**పొన్ముడి, కేరళ..**

కేరళలోని తిరువనంతపురం సమీపంలో ఉండే అందమైన హిల్‌స్టేషన్ పోన్ముడి. అక్కడ పొగమంచుతో కనిపించే అందమైన కొండలు, ఆశ్చర్యం కలిగించే ప్రకృతి దృశ్యాలు పర్యాటకులకు కనువిందు చేస్తాయి. అలాగే అన్యదేశ సీతాకోకచిలుకలతో సహా పెద్ద మొత్తంలో అరుదైన వృక్ష, జంతుజాలం కూడా అలరిస్తాయి. ఏడాది పొడవునా అక్కడి ఉష్ణోగ్రతలు కూడా సాధారణంగా ఉండటంతో వేసవి టూరిస్ట్ స్పాట్‌గానూ పనికొస్తుంది. అలాగే కల్లార్ నది అందాలు, మీన్‌ముట్టి జలపాతం సవ్వడులు గొప్ప ఆహ్లాదాన్ని పంచుతాయి.

**పొల్లాచ్చి, తమిళనాడు..**

తమిళనాడులోని కోయంబత్తూర్‌కు సుమారు 50 కిలోమీటర్ల దూరంలో ఉండే పొల్లాచ్చి సైతం మంచి ఆఫ్‌బీట్ డెస్టినేషన్. ఇది అన్నామలై పర్వత కొండల్లో ఉండే సుందరమైన ప్రదేశం. ముఖ్యంగా అక్కడ తేయాకు తోటలతో పాటు చెరుకు, ఇతర పంటలకు ప్రసిద్ధి చెందింది. సహజంగానే ఇది వ్యవసాయ ఆధారిత ప్రదేశం కావడంతో చూడచక్కని ప్రదేశాలు ఆకట్టుకుంటాయి. కొడైకెనాల్‌ను సందర్శించే వారు తప్పక ఈ పొల్లాచ్చిని కూడా సందర్శిస్తారు. దీంతో మీరూ ఈ రెండు ప్రదేశాలను ఒకే టూర్‌లో కవర్ చేసే వీలుంటుంది.

**చోర్లా ఘాట్స్, గోవా..**

కర్ణాటక, మహారాష్ట్ర, గోవా మూడు రాష్ట్రాలు కలగలిసే అరుదైన ప్రదేశం ఈ చోర్లా ఘాట్స్. ఇది గోవా రాజధాని పనాజీకి సుమారు 50 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో ప్రకృతి ఒడిలో అద్భుతమైన దృశ్యాలను కలిగి ఉంటుంది. సాధారణంగా గోవాకు వెళ్లేవారంతా బీచ్‌లు, అక్కడి చారిత్రక కట్టడాలనే చూసొస్తారు. ఈ చోర్లాఘాట్స్‌ను పెద్దగా పట్టించుకోరు. సహ్యాద్రి పర్వత శ్రేణుల్లో ఉండే ఈ అందమైన ప్రదేశానికి కార్ లేదా బైక్‌పై వెళ్లాలి. విశాలమైన పొలాలు, అందమైన సరస్సులు, పురాతన వంతెనల గుండా సాగే ఆ ప్రయాణం గోవా ట్రిప్‌ను మరో లెవెల్‌కు తీసుకెళుతుంది.

## పర్యాటకులను ఆకర్షిస్తున్న

# చందంపేట గుహలు..



గుహలు అనగానే మనకు బొర్రా గుహలు , బెలుం గుహలు గుర్తొస్తాయి. తెలంగాణలో అద్భుతమైన కళాసంపద మాత్రమే కాదు అత్యద్భుతమైన శిలా సంపద కూడా ఉన్నది.
పర్యాటకులను ఆకర్షిస్తున్న చందంపేట గుహలు.. మన తెలంగాణలోనే!
గుహలంటే బెలుం గుహలేనా? గుహలంటే బొర్రా గుహలేనా? వీటిని మించి మైమరిపించి ఆహ్లాదాన్ని పంచే గుహలు మన దగ్గర కూడా ఉన్నాయి. కానీ అవి సరైన గుర్తింపునకు నోచుకోలేదు. పర్యాటక ప్రదేశాలుగా పేరుగాంచలేదు. వసతులుంటే వనాల్లోనే ఉండి హాయిని పొందే గుహలు తెలంగాణలో కూడా ఉన్నాయి. వీలైతే చందంపేట గుహల వైపు ఓ రౌండేసి రండి.. ఎంతటి ఆనందం పొందుతారో మీరే చూడండి..తెలంగాణ రాష్ట్రంలో ప్రకృతి అందాలకు కొదువే లేదు. ఎత్తైన కొండలు, గలగలపారే జలపాతాలు అడవుల సంగతైతే ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. వీటితో పాటు దర్శనీయ స్థలాలు చాలానే ఉన్నాయి. అందులో ముఖ్యమైనవి గుహలు . గుహలు అనగానే మనకు బొర్రా గుహలు , బెలుం గుహలు గుర్తొస్తాయి. తెలంగాణలో అద్భుతమైన కళాసంపద మాత్రమే కాదు అత్యద్భుతమైన శిలా సంపద కూడా ఉన్నది.




**చల్లని చందంపేట...** కృష్ణానదీ లోయలో నల్గొండ జిల్లా చందంపేట మండలంలో ప్రపంచంలోని కొన్ని దేశాల్లో మాత్రమే ఉండే అరుదైన గుహలున్నాయి. ఐస్‌లాండ్లోని ఒక అగ్నిపర్వతంలో కరిగి చిమ్మిన లావా వేడి,వేగాలకు ఏర్పడిన భూమికి 400అడుగుల లోతున వున్న దిహ్నుకగిగుర్ అనే గుహ ప్రకృతే స్వయంగా వేసిన హరివిల్లు రంగులతో ఏర్పడి ఉంది. నల్గొండ జిల్లా చందంపేట మండలంలోని కాచరాజుపల్లికి దగ్గర వున్న గుట్టల వరుసలో మునులగుహగా పేరున్న గాజుబేడం గుహ ఆక్వామెరీన్ (నీలి ఆకుపచ్చ) రంగుతో మెరిసిపోతు కనపడుతుంది. గుహలోకి ప్రవేశించే మార్గం విశాలంగా ఉంటుంది. కళ్ళుచెదిరే రంగులగోడలు, అంతస్తుల గుహలు మనల్ని అబ్బురపరుస్థాయి. ఈ మునుల గుహ లేదా భావోజి గుహలో ఏర్పడిన గుహాంతర్భాగాలు సొరంగాలుగా, అంతస్తులుగా చక్కగా చెక్కినట్టుగా రాతిగోడలు, అందమైన ఆకృతులు ఒకచోట ఎరుపు రంగు, మరొకచోట కొంచెం నారింజవర్ణం, గుహలో 90 శాతం ఆక్వామెరీన్(నీలి ఆకుపచ్చ)రంగుతో చాలా అందంగా కనపడుతున్నాయి. ఈ రాతిగోడలు ఇలా రంగులతో మెరిసిపోతున్నాయంటే అగ్నిపర్వతంలో లావా ప్రవాహంతో ఇట్లాంటి గుహలు ఏర్పడివుంటాయి. లావావేడికి కరిగిన వివిధ ఖనిజాలు కలిసిపోవడంతో ప్రాకృతికంగా గుహలగోడలకు ఈ రంగులు వచ్చి ఉంటాయి .ఈ గుహలోని రాళ్ళు ఖనిజసంపన్నమైనవి. ప్రభుత్వం వీటిని పరీక్షించి వీటిలోని ఖనిజాలను అన్వేషించాలి. అంతేకాదు దేశంలోనే అరుదైన ఈ గుహలకు మంచిదారులు వేసి విహార యాత్రాస్థలంగా రూపొందించాలి.ప్రభుత్వం దృష్టిపెడితే ప్రతిష్టాత్మకంగా మారడమే కాక రేపటి పర్యాటక సంపదకు కూడా మూలకారణం అయ్యే లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. గుహలోని మార్గాలను అన్వేషిస్తే అనేకమైన కొత్తసంగతులు, ఆశ్చర్యపరిచే చారిత్రక విశేషాలు బయటపడే అవకాశాలున్నాయి. సహజమైన అందాలు%ా% పర్యాటకానికి అవసరమైన అన్ని హంగులనూ సొంతం చేసుకుంది చందంపేట మండలం.దేవరచర్లలోని పురాతన శివాలయంతో పాటు గాజు బేడం గుహలు, మునిస్వామి గుట్ట దగ్గర మునిస్వామి, ఏలేశ్వరంలో మల్లయ్యస్వామి ఆలయాలు పుష్కరాలకు వేదికలు. దేవరచర్ల సమీపంలోని మునిస్వామిగుట్టలో జలపాతం దగ్గరి శివలింగం ఆధ్యాత్మిక అనుభూతికి లోను చేస్తుంది. గాజు బెడం గుహలు కాచరాజుపల్లి అటవీప్రాంతంలో ఉన్నాయి. వైజాగ్ కాలనీ నుంచి కృష్ణానదిలో ప్రయాణిస్తే కొండల మధ్య కృష్ణా నది పరవళ్లు తీసే దృశ్యాలు పాపికొండలను తలపిస్తాయి.

**మైమరిపించే మైలారం...** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పాండవుల గుట్టకి చేరువలో ఉన్న మైలారం గుహలు లక్షల సంవత్సరాల నాటి ఆనవాళ్లకు, ప్రకృతి చెక్కిన అందాలకు ప్రతీకగా నిలుస్తున్నాయి. నల్లగుట్టలుగా పేరొందిన నల్లరాతి గుట్టలలో 3.5 కి.మీ. మేర ఈ సున్నపు గుహలు విస్తరించి ఉన్నాయి. ఇలాంటి గుహలు మన దేశంలో ఉత్తరాఖండ్, హర్యానా, మేఘాలయ, మధ్యప్రదేశ్ , చత్తీస్ ఘడ్, అండమాన్-నికోబార్ దీవులలో ఉన్నాయి. తెలంగాణలో ఉన్న సున్నపు గుహలు ఇవొక్కటే కావడం విశేషం. న్లగుట్టల్లో గుహల లోపలికి సహజసిద్ధంగా ఏర్పడిన సొరంగాలు, ఆ సొరంగాల్లో రహస్య మార్గాలు ఉన్నాయి.గుహల పై భాగంలోని సున్నపురాతి పైకప్పుల నుండి సున్నపునీటితో జారిపడి గట్టిపడిన స్టాలక్టైట్స్ , వాటితో ఏర్పడిన వింతైన ఆకృతులున్నాయి. పరిసర ప్రాంతాల్లో ప్రకృతి సోయగాలు, ఎన్నో అపురూప దృశ్యాలు మనల్ని అబ్బురపరుస్తాయి. ఈ గుట్టలను ఆదిమానవుల ఆవాసాలుగా చరిత్రకారులు భావిస్తున్నారు. అందుకు నిదర్శనంగా ప్రాచీన శిలాయుగానికి చెందిన అనేక రాతి పనిముట్లు ఇక్కడ కనిపిస్తున్నాయి. ఈ గుహల్లో ఆర్కియన్ శిలలు ఉన్నాయి.కొన్నిచోట్ల గుహలు 10, 50, 100 అడుగుల విస్తీర్ణంతో, కొన్నిచోట్ల గుండ్రంగా, మరికొన్ని చోట్ల పొడవు గదుల్లా ఉన్నాయి. గుహ ప్రారంభంలో వెలుతురు ఉన్నప్పటికీ లోపలికి వెళ్తున్న కొద్దీ చిమ్మచీకటి కమ్ముకుంటుంది. అక్కడక్కడా గుట్ట పైభాగం నుంచి పడే సూర్యరశ్మి వల్ల గుహలో కాస్త వెలుతురు ఉంటుంది. గుహలో గుండుసూది వేసినా స్పష్టంగా వినిపించేంత నిశ్శబ్దం ఉంటుంది. గుహలో 20 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత, చల్లని గాలి ఉంటాయి. ఈ గుహల్లో సున్నపు రాతి నీళ్ళు జారిపడి అనేక ఆకృతులు ఏర్పడ్డాయి.

## హంపీకి వెళ్లినప్పుడు ఈ ఎలుగుబంట్ల

# అభయారణ్యాన్ని మర్చిపోవద్దు..!

హంపీకి సమీపంలో ఉండే దారోజీ ఎలుగుబంట్ల అభయారణ్యం గురించి తెలుసా..? బహుశా మనలో చాలా మందికి ఈ అరుదైన వన్యప్రాణి సంరక్షణ కేంద్రం గురించి తెలియకపోవచ్చు. దాని విశేషాలేంటో ఇక్కడ చదవండి.%హంపీ అంటే వెంటనే గుర్తొచ్చేది శ్రీ కృష్ణ దేవరాయల కాలం నాటి పురాతన ఆలయాలు, రాతి కట్టడాలే. దీంతో అది ఇప్పుడు ప్రముఖ పర్యాటక కేంద్రంగా, యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా మంచి గుర్తింపు దక్కించుకుంది. ఈ నేపథ్యంలోనే చాలా మంది పర్యాటకులు ఈ హంపీని సందర్శించడానికి ఆసక్తి చూపుతుంటారు. అయితే, అక్కడికి వెళ్లేవారిలో కొంత మంది మాత్రమే సమీపంలోని దారోజీ ఎలుగుబంట్ల అభయారణ్యాన్ని సందర్శిస్తారు. ఆ అభయారణ్యం గురించి చాలా మందికి తెలియకపోవడంతో కేవలం హంపీలోని చారిత్రక కట్టడాలను చూసి తిరిగొచ్చేస్తారు. ఒకవేళ మీరూ ఎప్పుడైనా హంపీకి వెళ్లాలనుకుంటే మీ ప్రయాణ జాబితాలో ఈ ఎలుగుబంట్ల అభయారణ్యాన్ని చూసి రావడం మర్చిపోవద్దు.


**కొంత మందికే అది తెలుసు..**

కర్నాటకలోని బళ్లారి జిల్లాలో ఉన్న దారోజీ ఎలుగుబంట్ల అభయారణ్యం ఆసియాలోనే మొట్టమొదటి ఎలుగుబంట్ల అభయారణ్యం. అక్కడున్న రాతి కొండల్లో ఎలుగుబంట్లతో పాటు మరిన్ని వన్యప్రాణులు సైతం ఆవాసం పొందుతుంటాయి. దీంతో ఈ ప్రాంతాన్ని వన్యప్రాణి సంరక్షణా కేంద్రంగా తీర్చిదిద్దారు. ఇది యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా ప్రసిద్ధి చెందిన హంపీ నగరానికి 15 కిలోమీటర్ల దూరంలోనే ఉంటుంది. దీంతో అక్కడికి వచ్చేవారిలో కొంత మంది ఈ ఎలుగుబంట్ల అభయారణ్యాన్ని సందర్శిస్తారు. మరికొంత మందికి అలాంటి ఒక ప్రత్యేకమైన వన్యప్రాణి అభయారణ్యం అక్కడ ఉందనే విషయం తెలియక కేవలం హంపీని మాత్రమే సందర్శించి తిరిగి వెళిపోతుంటారు.

**?అభయారణ్యం ఎలా ఉంటుందంటే..**

%ఈ అభయారణ్యం మొత్తం బండరాళ్లు, రాతి గుహలు, ఉద్గారాల్లో ఉంటుంది. దీంతో అక్కడ పెద్దగా వృక్షసంపద కనిపించదు. అయితే ఇక్కడ ఎలుగుబంట్లు, చిరుతపులులు, హైనాలు, నక్కలు, పాంగోలిన్లు వంటి వివిధ రకాల వన్యప్రాణులతో పాటు కొన్ని జాతుల పక్షులూ ఆవాసం పొందుతున్నాయి. మరోవైపు ఈ అభయారణ్యం ఏడాది పొడవునా తెరిచి ఉన్నా అక్టోబర్ నుండి మే వరకు మాత్రమే సందర్శించడానికి అనుకూలంగా ఉంటుంది.
ఆ సమయంలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉండటంతో పాటు ఆయా వన్యప్రాణులను సైతం తేలిగ్గా చూసే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అయితే, ఇక్కడ చెప్పుకోవాల్సిన విషయం ఏమిటంటే సందర్శకులు ఆ అభయారణ్యానికి వెళ్లినప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలి.

**నియమ నిబంధనలు ఇవే..**

సందర్శకులు అభయారణ్యం లోపల ఎలాంటి తుపాకులు, పేలుడు పదార్థాలు లేదా ఇతర ప్రమాదకరమైన వస్తువులను తీసుకెళ్లరాదు.
అభయారణ్యం లోపల పెద్ద శబ్దాలు చేయడం, హారన్లు మొగించడం, పెద్ద సౌండ్‌తో మ్యూజిక్ ఏర్పాటు చేయడం వంటివి నిషేధం.
సందర్శకులు జంతువులకు ఆహారం అందివ్వడం, వాటిని రెచ్చగొట్టడం లేదా రాళ్లు విసరడం వంటివి చేయరాదు.
అభయారణ్యం లోపల పర్యాటకులు ధూమపానం, మద్యం పానం చేయడం కూడా పూర్తిగా నిషేధం.
సందర్శకులు వారి నిర్దేశిత ప్రాంతాల్లోనే ఉండాలి. అభయారణ్యం లోపల ఎల్లవేళలా గైడ్‌ల సూచనలు తప్పక పాటించాలి.
అభయారణ్యం లోపల ఫోటోగ్రఫీ అనుమతిస్తున్నా.. ఫ్లాష్ ఉపయోగించడం మంచిది కాదు. ఫ్లాష్ లేకుండా, జంతువులకు ఇబ్బంది కలిగించకుండా ఎన్ని ఫోటోలైనా తీసుకోవచ్చు.

**అక్కడికి ఎలా చేరుకోవాలి?**

రోడ్డు మార్గంలో ఈ అభయారణ్యానికి చేరుకోవాలంటే మొదట హంపీకి వెళ్లాలి. అక్కడి నుండి 15 కి.మీ దూరంలో ఈ అభయారణ్యం ఉంటుంది. మరోవైపు హంపీ, హొస్పేట్, బళ్లారి, హుబ్లీ వంటి నగరాల నుండి ట్యాక్సీ లేదా ప్రైవేట్ వాహనాల్లో వెళ్లొచ్చు. ఒకవేళ మీరు రైలులో వెళ్లాలనుకుంటే హొస్పేట్ సమీప రైల్వే స్టేషన్. అక్కడి నుండి 20 కి.మీ దూరంలో ఈ అభయారణ్యం ఉంటుంది. విమానంలో వెళ్లాలనుకుంటే హొస్పేట్ సమీపంలో ఉండే జిందాల్ విజయనగర్ విమానాశ్రయానికి చేరుకొని అక్కడి నుండి ట్యాక్సీలో వెళ్లొచ్చు. ఒకవేళ హైదరాబాద్ నుండి మీరు సొంత వాహనంలో వెళ్లాలనుకుంటే మహబూబ్‌నగర్, రాయిచూర్, సింధనూర్ మీదుగా హంపీకి వెళ్లొచ్చు. అది సుమారు 400 కి.మీ దూరం ఉంటుంది.

# అక్కడ మనుషులు శిలలుగా మారిపోతారు...



భారతదేశంలో ఎన్నో దేవాలయాలు ఉన్నాయి. అనేక సంస్కృతులు, విశిష్టతలు వాటికి ఉన్నాయి. వాటికి సంబంధించిన ప్రత్యేక కథనాలు కూడా చెప్పుకుంటుంటారు. ఇలాంటి ఒక ప్రత్యేక ఆలయం రాజస్థాన్‌లో బర్మార్ జిల్లా కేంద్రానికి 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న హాత్మ అనే ఊరిలో ఉంది. ఇక్కడో ఆలయాల సమూహం ఉంది. 'కిరాడు' ఆలయాలుగా ప్రసిద్ధి చెందాయి. వీటికే 'కిరాతకూప' అన్న భయంకరమైన పేరు కూడా ఉంది. సాయం సంధ్య వేళల్లో ఆ పరిసరాల్లో తిరగడానికే భయపడిపోతారు ప్రజలు. సాయంత్రం అయితే ఆ ప్రదేశం అంతా నిర్మానుష్యంగా మారిపోతుంది. అక్కడ ఉన్న ఐదు ఆలయాలలో ఒకటి వైష్ణవాలయం, మరో నాలుగు శైవ క్షేత్రాలు నాలుగు గుళ్లలో సోమేశ్వరాలయం ప్రధానమైనది. ఈ ఆలయాలు అపురూప శిల్ప సౌందర్యంతో కనువిందు చేస్తాయి. అందుకే కిరాడు రాజస్థాన్ ఖజరహోగా పేరుగాంచింది. క్రీస్తుశకం పదకొండో శతాబ్దంలో చాళుక్య రాజులు వీటిని నిర్మించారని చెబుతారు. దాదాపు వందేళ్ల వరకు వీటి వైభవం కొనసాగింది. అలాంటి 'కిరాడు' పేరు చెబితే అక్కడి జనాలు హడలిపోతారు. అక్కడి వచ్చే పర్యటకుల వలన స్థానికులకు ఉపాధి బాగానే ఉంటుంది. కొంత మంది గైడ్‌లుగా వ్యవహరిస్తారు.

కొంత మంది టీలు, భోజనాలు అమ్ముకుని బ్రతుకుతారు. అయితే అసుర సంధ్య వేళ కాగానే ఎవరూ తోడు రమ్మన్నా రారు. పైగా హెచ్చరిస్తారు కూడా. రాత్రి గడిచే కొద్దీ వాతావరణం మారిపోతుంటుంది. కిరాడు ఆలయం ప్రాంతమంతా కిరాతకంగా కనిపిస్తుంది. ఆలయ ప్రాంగణంలో వింత వింత శబ్దాలు మొదలవుతాయి. ఏడుపులు, పెడబొబ్బలు వినిపిస్తాయి.

అయినా మొండిగా రాత్రంతా అక్కడే ఉంటే. తెల్లారే సరికల్లా వారు శిలగా మారిపోతారు. ఇది నిజమో అబద్ధమో తెలియదు. ఎందుకంటే అక్కడ రాత్రి ఎవరూ ఉండరు. ఉన్నవారు తెల్లవారాక ఎక్కడున్నారో ఎవరికీ తెలియదు. మొండిగా రేయంతా అక్కడుండే వారు రాయిగా మారిపోతారని మాత్రం గట్టి నమ్మకం. కొంత మంది పరిశోధకులు వీరి మాటను పట్టించుకోకుండా రాత్రి ఆలయంలో ఉండటానికి ప్రయత్నించారు. అర్ధరాత్రి దాటాక అక్కడ వచ్చే శబ్దాలు విని బెంబేలెత్తిపోయారు. వెంటనే పలాయనం చిత్తగించారు.

ఆలయంలో మనుషులు శిలలుగా మారడం వెనుక స్థానికంగా ఒక కథ ప్రచారంలో ఉంది. సుమారు ఎనిమిది వందల సంవత్సరాల కిందట ఒక ఆధ్యాత్మిక గురువు తన శిష్యులతో కలిసి దేశ సంచారంలో భాగంగా హాత్మ గ్రామానికి వచ్చాడు. అక్కడి కిరాడు ఆలయంలో వాళ్లు కొన్నాళ్లు ఉన్నారు. గురువు శిష్య బృందాన్ని అక్కడే ఉండమని చెప్పి తీర్థ సందర్శనకు వెళ్లాడు. ఆ గురువు మళ్లీ కిరాడు ఆలయాలకు వచ్చే సరికి శిష్యులంతా అనారోగ్యంతో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతూ కనిపించారు.

మాకు అనారోగ్యం కలిగినా గ్రామస్తులు ఎవరూ పట్టించుకోలేదని గురువుకు ఫిర్యాదు చేశారు శిష్యులు. సాటి మనిషి ప్రాణం మీదకు వస్తే పట్టించుకోకుండా పాశానంలా వ్యవహరిస్తారా అంటూ హాత్మ వాసులపై ఆ గురువు మండిపడ్డాడు. రాత్రి దాటాక ఈ ఆలయంలోకి ఎవరు ప్రవేశించినా వారు పాశానులైపోతారని శపించాడు.

గ్రామస్తుల్లో ఒక మహిళ మాత్రం ఆ శిష్యులకు కొంత సేవ చేసిందట. ఆమెకు మాత్రం శాపం నుంచి విముక్తి ప్రకటించాడు గురువు. వెనక్కి తిరిగి చూడకుండా ఆలయ గ్రామం వదిలి వెళ్లిపోవాలని ఆజ్ఞాపించాడు. ఆ మాటతో గుడిలో నుంచి బయల్దేరిన ఆ మహిళ కొంత దూరం వెళ్లాక అత్యుత్సాహంతో వెనక్కి తిరిగి చూసిందట, అంతే అక్కడే శిలగా మారిపోయిందట. ఇప్పటికీ ఆమె విగ్రహం హాత్మ గ్రామశివారులో కనిపిస్తుంది.

## ఎంతకీ పెళ్లి కావడంలేదా?

# అక్కడికెళ్తే ఖాయం...



మహావిష్ణువు యొక్క 108 దివ్యదేశాలలో ఒకటిగా ప్రసిద్ధి చెందిన నిత్య కళ్యాణ పెరుమాళ్ దేవాలయం తమిళనాడు రాష్ట్రంలోని కాంచీపురం జిల్లాలో తిరువిడంద్రై ప్రాంతంలో ఉంది. ఇందులో మహావిష్ణువు నిత్య కళ్యాణ పెరుమాల్‌గా, లక్ష్మీదేవి కోమలవల్లిగా పూజలందుకుంటున్నారు. ఈ దేవాలయాన్ని ఎక్కువగా పెళ్లి కోసం ఎదురుచూస్తున్న యువతీయువకులు సందర్శిస్తుంటారు. ఈ దేవాలయానికి 1000 ఏళ్ల చరిత్ర ఉంది. ఇక్కడ కళ్యాణ పూజ చేసిన అనతికాలంలోనే తప్పకుండా వివాహం నిశ్చయమవుతుందని ప్రగాఢ విశ్వాసం ఉంది. స్థల పురాణం ప్రకారం.. త్రేతా యుగంలో మేఘనాథుడి కుమారుడు బాలి తన రాజ్యాన్ని న్యాయంగా పాలిస్తూ ఉన్నప్పుడు, మాలి, మాల్యవన్, సుమాలి అనే రాక్షసులు దేవతలపై యుద్ధం చేయడంలో సహాయం కోరి అతని వద్దకు రాగా, సహాయాన్ని నిరాకరిస్తాడు. దీంతో రాక్షసులు ఓడిపోతారు. మళ్లీ యుద్ధం చేయడం కోసం రాక్షసులు బాలిని సహాయం అడగగా ఈసారి సహాయం చేయడానికి ఒప్పుకుని యుద్ధంలో రాక్షసులను గెలిపిస్తాడు, కానీ బ్రహ్మహత్యా దోషాన్ని మూటగట్టుకుంటాడు. ఆ దోష నివారణకై బాలి ఇక్కడికి వచ్చి తపస్సు చేయగా, మహా విష్ణువు మెచ్చి వరాహ రూపంలో దర్శనమిస్తాడు. మహర్షి కుని, తన కుమార్తెతో సహా స్వర్గానికి చేరుకోవాలనే కోరికతో నారాయణుడి కోసం తపస్సు చేస్తాడు. కానీ కునికి మాత్రమే స్వర్గలోక ప్రవేశం లభిస్తుంది, ఆమె కుమార్తె వెళ్లలేకపోతుంది. నారద మహర్షి ఆ యువతి దగ్గరికి వచ్చి నీకు ఇంకా పెళ్లి కానందున ఇలా జరిగిందని చెప్పగా, తనను వివాహమాడమని వేరే మునులను కోరుతుంది. ఒక కలవ మహర్షిని పెళ్లాడి, 360 మంది ఆడపిల్లలకు జన్మనిస్తుంది. తన కుమార్తెలను వివాహమాడమని ప్రార్థిస్తూ కలవ మహర్షి నారాయణుడి కోసం తపస్సు చేస్తాడు. కానీ నారాయణుడు ప్రత్యక్షం కాడు. ఒకరోజు దివ్యదేశ యాత్ర చేస్తున్నాని చెప్పి వారి వద్దకు ఒక యువకుడు వస్తాడు. అతను నారాయణుడంత అందంగా కనిపించడంతో ముగ్ధుడైన కలవ మహర్షి తన కుమార్తెలను పెళ్లి చేసుకోమని కోరతాడు. ఆ యువకుడు అంగీకరించి రోజుకు ఒకరిని చొప్పున 360 రోజుల పాటు 360 మందిని పెళ్లి చేసుకుంటాడు. చివరి రోజున, తాను మరెవరో కాదు వరాహ రూపంలో ఉన్న నారాయణుడని నిజం చెప్పి, 360 మంది భార్యలను కలిపి ఒక స్త్రీమూర్తిగా చేసి తన ఎడమ తొడపై కూర్చోబెట్టుకుంటాడు. ఏడాదిలో అన్నిరోజులు వివాహం జరిగినందున ఈయనకు నిత్య కళ్యాణ పెరుమాళ్ అనే పేరు వచ్చింది. పెళ్లి విషయంలో సమస్యలు ఎదుర్కొంటున్న యువతులు ఇక్కడ కొలువై ఉన్న కోమలవల్లి అమ్మవారిని దర్శించుకుని, ప్రార్థిస్తే వెంటనే వివాహం నిశ్చయమవుతుందనే నమ్మకం ఇక్కడి ప్రజలలో ఎక్కువగా ఉండటంతో ఎప్పుడూ ఈ దేవాలయం యువతులతో కళకళలాడుతుంటుంది. ఈ దేవాలయం ఉదయం 6 గంటల నుండి 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 3 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు తెరిచి ఉంటుంది. చెన్నై నుండి ఈసిఆర్, మహాబలిపురం వెళ్లే బస్సులన్నీ తిరువిడంద్రై మీదుగా వెళ్తాయి.



# ప్రపంచంలో ఇంత అందమైన నది మరొకటి లేదు..



# ఆంధ్రాలో మరో ఊటి.. ఎక్కడ?

ప్రకృతి అందాల మధ్య అందమైన జలపాతం తలకోన. శేషాచలం అటవీ ప్రాంతంలో వున్న ఈ జలపాతం సంవత్సరం తరబడి నీటి ప్రవాహం ఉధృతంగా ప్రవహిస్తూనే ఉంటుంది. ఎత్తైన కొండల నుంచి ఎగసిపడుతున్న ఈ జలపాతం అందాలు ప్రకృతికాంతకు మరింత సొబగులు అద్దుతున్నాయి. ఓ వైపు ఆకాశం అంచున వున్న కొండలను తాకుతున్న మేఘాలు, మరోవైపు చిరు జల్లల మధ్య జలపాతాన్ని సందర్శించడం ఓ అద్భుతమైన అనుభవం.దచిత్తూరు జిల్లా శేషాచలం అడవుల్లో వున్న తలకోన జలపాతం ప్రత్యేకత మరే జలపాతానికి లేదు. బాకారాపేట నుంచి 25 కిలోమీటర్లు లోపలికి వెళితే మనకు దట్టమైన అడవుల మధ్య కనిపిస్తుంది తలకోన జలపాతం. జలపాతం కంటే ముందు మనకు దర్శనమిస్తాడు సిద్దేశ్వర స్వామి. పురాతన ఈదేవాలయంలో స్వామి వారిని దర్శించి మనం జలపాతం వద్దకు వెళ్ళచ్చు. జలపాతం సమీపం లోని అర కిలోమీటర్ వరకు రహదారి వున్నప్పటికి నడిచే వెళితే వచ్చే అనుభూతి మరింత ప్రత్యేకం.

ఎత్తైనా కొండల మధ్య నడుస్తు వెళుతుంటే మేఘాలు మనకు తాకినట్లు కనిపిస్తాయి. అక్కడక్కడ చిన్న చిన్న వాగులు దాటుతు వెళ్ళడం మరింత ప్రత్యేకం. జలపాతానికి దగ్గరలోను మనకు లోయ పక్కన మార్గం కనిపిస్తుంది. నడిచి వెళ్ళాల్సిన దారి. ఇక్కడ నుంచి మనం జలపాతం వద్దకు వెళుతుంటే మనకు లోయలోంచి హెూరున నీరు ప్రవహిస్తున్నశబ్ధం చెవులకు ఇంపుగా వుంటుంది. అటు వెళుతున్నప్పుడు అందమైన చెట్లతో పాటు మనలను ఇబ్బంది పెట్టే కోతులు కూడా వుంటాయి. అంతేకాకుండా వందల అడుగుల ఎత్తైన చెట్లు కనిపిస్తాయి. వీటన్నింటి మధ్య మనం జలపాతం వద్దకు చేరితే అద్భుతమైన అందాలు కనువిందు చేస్తాయి. జలపాతం మొదటి ప్రాంతం దాటి రెండవ ప్రాంతం వద్దకు వెళ్ళడం కొంచెము ప్రమాదకరంగా వున్నప్పటికి అక్కడికివెళితే మరింత అనుభూతిని ఇస్తుంది. జలపాతం వంద అడుగుల ప్రవాహం అక్కడ వుంటుంది. ఇక్కడ జలపాతం దూకుడు ఎక్కువగా వుంటుంది. అయినప్పటికి సాహస వంతులైన యువకులు మాత్రం అక్కడి చేరు జలపాతం దూకుడు కంటే తామే బలమైన వారమంటుం టారు. తలకోనలో తెలుగు, తమిళ చిత్రాల షూటింగ్స్ జరుగుతుంటాయి.అప్పట్లో ప్రముఖ తమిళ డైరక్టర్లు తమ సినిమాలను ఈనెల కోనలో చేసారు. ప్రస్తుతం తమిళ చిత్రాల షూటింగ్స్ ఇక్కడ రెగ్యులర్‌గా జరుగుతుంటాయి. తలకోన అందాలను చూడటానికి ప్రతిరోజు వందల సంఖ్యలో వస్తుంటారు. అయితే శని,అది,సోమ వారాలలో అయితే ఇది వేలకు చేరుకుంటుంది.

దక్షిణ అమెరికా ఖండంలోని కొలంబియా దేశంలో ఉన్న ఈ నదిని ఖనిజాల గని అని పిలుస్తారు. ఈ నది రంగును చూసి పర్యాటకులు మంత్రముగ్ధులు అవుతుంటారు. ఆ ప్రాంతంలో మకరేనియా క్లేవిగెరా అనే నీటి మొక్కలు ఎక్కువగా పెరుగుతాయి. వీటి వల్లే ఆ నది రంగు అలా ఉంటుందని స్థానికంగా ఉండే టూరిస్ట్ గైడ్ ఒకరు అంటున్నారు. వివిధ రంగుల్లో పర్యాటకులకు కనువిందు చేస్తున్న ఈ నది పేరు 'కనో క్రిస్టాలీస్'. 'రెయిన్‌బో రివర్' అని కూడా పిలుస్తారు. ఈ ప్రాంతానికి లక్షల ఏళ్ల చరిత్ర ఉంది. దీనినే 'షీల్డ్ ఆఫ్ గయానా'గా అభివర్ణిస్తారు.

ఈ నది రంగు గురించి అనేక వాదనలు ఉన్నాయి. రాళ్లలో ఖనిజాలు ఉండడం వల్ల ఆ రంగు వచ్చిందని కొందరు అంటారు. అంతేకాకుండా ఖనిజాలతో పాటు రాళ్లు కూడా ఎక్కువగా ఉండడం వల్ల ఇక్కడ మొక్కలు ఎక్కువ ఎత్తు పెరగలేవని చెబుతున్నారు. ఈ మొక్కలు ఏడాదికి కేవలం ఒక సెంటీమీటర్ మాత్రమే పెరుగుతాయి. భూమిలోని ఖనిజాలకు అనుగుణంగా ఈ పూల రంగు ఉంటుంది. అమెజాన్ అడవి, ఆండియన్ పర్వత శ్రేణులు, ఒరినోకియా మైదాన ప్రాంతం ఇక్కడే కలిసి ఉన్నాయి.

నీటి మొక్కలు పెరిగే ఈ ప్రాంతంలో వేర్వేరు జోన్‌లు ఉన్నాయి. గతంలో ఈ నదిని ప్రమాదకరమైన ప్రాంతంగా భావించేవారు. ప్రస్తుతానికి మాత్రం దీనిని మరింత అభివృద్ధి చేసి, గొప్ప పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దితే బాగుంటుందని పర్యాటకులు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఎడిటోరియల్

## మానవత్వం పరిమళించిన వేళ

జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రదాడి యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రదాడులు జరగడం ఇప్పుడు కొత్తేమీ కాదు. కానీ ఈ దాడి కొన్ని అనూహ్య పరిణామాలకు అవకాశం కల్పించింది. ఉగ్రవాదులు ఒక మతం వారిని లక్ష్యంగా చేసుకుని భయాందోళనలు కలిగించడానికి బీభత్సాన్ని సృష్టించారు. హిందువులను, ముస్లింలను వేరు చేసి, అలాగే పురుషులను, మహిళలను వేరు చేసి ఊచకోతకు పాల్పడ్డారు. ఇస్లాంపై నమ్మకం ఉందని కలిమా సంస్మరించమన్నారు. అలా చేసిన వారిని విడిచిపెట్టారు. ఇది పాకిస్థాన్ అండదండలతో లష్కరే ఇ తొయిబా ప్రేరణతో ది రెసిస్టెన్స్ ఫ్రంట్ అనే ఉగ్రమూక సాగించిన దాడి. ఇది భారత్‌కు ఒక ప్రమాద హెచ్చరిక. భారతీయులకు భారతీయులే శత్రువులు అయ్యేలా చేయడం, భయం, ద్వేషం పుట్టించి భారత్‌ను వర్గాలుగా విభజించడం, పర్యాటకులకు భయం కలిగించడం ప్రధాన ఉద్దేశాలుగా ఉగ్రతోడేళ్లు తమ మారణకాండ సాగించాయి.కానీ వారు అనుకున్నట్టు పహల్గాం ప్రాంతంలో ఉగ్రవాదులకు స్థానికులు ఎవరూ భయపడలేదు. పైగా కులమతాలకు అతీతంగా అంతా ఏకమై బాధితులను ఆదుకున్నారు. వారికి సంఘీభావం ప్రకటించారు. ఉగ్రదాడికి నిరసనగా వ్యాపారాలు, ఇతర సంస్థలు మూతపడ్డాయి. ఇదివరకెన్నడూ లేనంతగా ఉగ్రవాదులను ద్వేషించే పరిస్థితి ఏర్పడింది. మానవత్వం పరిమళించింది. పహల్గాంలోని బైసరన్ వ్యాలీలో ఎక్కడైతే ఉగ్రదాడి జరిగిందో అక్కడ స్థానిక కశ్మీర్ ముస్లింలు గాయపడిన పర్యాటకులను తక్షణం ఆదుకున్నారు. అక్కున చేర్చుకుని వారికి ఆశ్రయం కల్పించారు. గాయపడిన కొందరిని ఎత్తైన కొండలపై నుంచి కిందకు మోసుకెళ్లి వైద్య చికిత్స అందించారు. స్వస్థలాలకు వెళ్లాలనుకునే వారికి రవాణా సౌకర్యం కల్పించారు. 20 ఏళ్ల పోనీగైడ్ సయ్యద్ అదిల్ హుస్సేన్ షా, తన కుటుంబానికి తానే ఆధారం.ఒక పర్యాటకుడిని కాపాడడానికి తాను తెగించి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ధైర్యసాహసాలు ఒక్కటే చాలు విద్వేషపూరిత మృగత్వాన్ని చీల్చి చెండాడడానికి. విద్యావేత్త దేబవిష్ భట్టాచార్య ఉగ్రవాదుల తుపాకీ గురి నుంచి బయటపడ్డారు. ఉగ్రవాదులు ఆదేశించినట్టుగానే కలిమా జపించి ప్రాణాలు దక్కించుకున్నారు. తనను రక్షించిన స్థానికుల ధైర్యసాహసాలను ఆయన పదేపదే ప్రశంసించారు. తమ పోనీ గైడ్ తమను వెతుక్కుంటూ వచ్చి తీసుకెళ్లాడని ఆయన గుర్తు తెచ్చుకున్నారు. ఈ మానవత్వ సహాయ సంఘటనలు వింటుంటే మనల్ని ఆప్యాయత, మానవత్వాలతో కట్టి పడేస్తాయి. భారత దేశంలో జీవిస్తున్న సౌభ్రాతృత్వ మూలాలను తెలియజేస్తాయి. ఏప్రిల్ 23న కశ్మీర్ అంతా బంద్ అయింది. అది భయంతో కాదు.బాధితులకు సంఘీభావం తెలియజేయడానికి. కశ్మీర్‌లోని పొలాలు పంట చేతికి రాకముందే కోతకు గురవుతున్నాయి. ప్రతికూల వాతావరణం వల్ల కాదు. హింసాకాండ మళ్లీ ఎదురవుతుందన్న భయంతోనే అలా చేస్తున్నారు. ఏం జరిగినా ఎదుర్కోడానికి సిద్ధంగా ఉన్నామని స్థానికులు ధైర్యంగా చెబుతున్నారు. కానీ కొందరు ముస్లింలపై శత్రుత్వం చూపిస్తున్నారు. ఉగ్రవాదులు ముస్లింలను విడిచిపెట్టి మిగతా మతాల వారిని ఊచకోత కోసారు కాబట్టి ముస్లింలే ఈ హింసాకాండకు ప్రేరేపిస్తున్నారని మతోన్మాదంతో పేట్రేగిపోతున్నారు.మతోన్మాదం అంటే దేశభక్తి కాదు. ఇది ధైర్యం ముసుగులో ఉన్న పిరికితనం. ఈ ఉన్మాదం లోపలి నుంచి మనిషిని బలహీనపరుస్తుంది. దీనికి ఏమాత్రం మొగ్గు చూపినా ఎవరైతే భారత్‌ను ముక్కలు ముక్కలుగా చేయాలనుకుంటున్నారో, ఎవరైతే ప్రపంచ వేదికపై భారత్ తడబాటు చెందాలని ఆకాంక్షిస్తున్నారో అలాంటి తీవ్రవాద, ఉగ్రవాద తోడేళ్ల చేతుల్లోకి పరిస్థితి వెళ్లిపోతుంది.అందుకనే ఈ కష్టసమయంలో అందరం భారతీయులం, ఒకేమాటపై, ఒకే బాటపై ముందుకు సాగి ఉగ్రవాదులను తరిమికొడదాం అన్న దృఢసంకల్పంతో ఐక్యతా భావాన్ని పెంపొందించుకోవాలి. జాతీయ బలం అంటే ఆగ్రహం మాత్రమే కాదు. ఒకదేశం కేవలం సరిహద్దులకే పరిమితం కాదు. న్యాయానికి, కరుణకు, ఐక్యతకు కట్టుబడి ఉంటుందన్న వాస్తవాన్ని పహల్గాం సంఘటన కళ్లముందు సాక్షాత్కరింపచేసింది. అయితే డెహ్రాడూన్ వంటి ప్రాంతాల్లో కశ్మీర్ ముస్లిం విద్యార్థులపై ద్వేషం కక్కుతూ బెదిరింపులు రావడం అత్యంత శోచనీయం. ఆ ప్రాంతం లోని సామాజిక మాధ్యమాలు కూడా ద్వేషం ప్రచారం చేశాయి. పోలీసులు వెంటనే జోక్యం చేసుకుని సంబంధిత బాధ్యులపై కేసులు నమోదు చేశారు. ఇలాంటి ఫిర్యాదులే ఇతర ప్రాంతాల నుంచి కూడా రావడం గమనార్హం. ఇలాంటి సంఘటనలను వ్యతిరేకించకుండా కేవలం మతం కారణంతో కశ్మీర్ ముస్లిం విద్యార్థులను టార్గెట్ చేస్తే ఉగ్రవాదులకు మనకూ తేడా ఏమిటి? అన్న ప్రశ్న కూడా ఎదురవుతోంది.డెహ్రాడూన్‌ను కశ్మీరీ ముస్లిం విద్యార్థులు విడిచిపెట్టకుంటే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరిస్తూ ఒక వీడియో విడుదలైంది. ఈ విధంగా బెదిరించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కేసులు పెట్టినంత మాత్రాన ఈ ద్వేషభావాలు సమసిపోవు. వారిలో జాతీయ భావం, దేశభక్తి నెలకొనే చర్యలు అవసరం. కేవలం ఒక మత విశ్వాసాన్ని బట్టి ప్రజలను కళంకం చేయడమంటే దేశం మొత్తం మీద కశ్మీరీ ముస్లింలను అవమానించడమే అవుతుంది. ఈ విషయంలో తనిఖీ చేసుకోకపోతే దేశంలో మరింత తీవ్రమైన మత ఉద్రిక్తతకు దారి తీయవచ్చు. అది ఉగ్రవాద కట్టడి చర్యల నుంచి, పాక్ దురాక్రమణ నివారించే యత్నాల నుంచి దృష్టిని మళ్లిస్తుంది. పాకిస్థాన్ మిలిటరీ, పాక్ నాయకత్వం, ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్‌తోసహా హిందువులు, ముస్లింలు భిన్నధ్రువాలని ద్విజాతి సిద్ధాంతాన్ని తెరపైకి తెస్తున్నారు. ఈ క్లిష్ట సమయాల్లో దేశ భద్రత కోసం, రక్షణ కోసం మనల్ని ఏకం చేసేది ఏమిటన్నది ఆలోచించాలి.

# కులగణన: ఆవశ్యకత, సవాళ్లు



భారత దేశంలో కులగణన ఎప్పుడూ ఒక వేడి చర్చనీయాంశంగానే కొనసాగుతోంది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారత దేశంలో అన్ని కులాల సమగ్ర గణన జరగలేదు. 1951 నుండి 2011 వరకు జరిగిన జనాభా లెక్కలలో కేవలం షెడ్యూల్డ్ కులాలు, తెగల గణాంకాలను మాత్రమే సేకరించి ప్రచురించారు. ఇతర కులాల సమగ్ర గణన ఇప్పటి వరకు జరగలేదు. అయితే 2011లో సామాజిక, -ఆర్థిక కులగణన జరిగింది కానీ దాని ఫలితాలు ఇంకా అధికారికంగా విడుదల కాలేదు. ఇప్పుడు 2025లో జరగబోయే జనాభా లెక్కల్లో కులగణన ఉంటుందని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం ఈ అంశానికి మళ్లీ ప్రాధాన్యం సంతరించుకుంది. కులగణన ప్రాముఖ్యతను ఎవరూ కాదనలేరు. ఇది ముఖ్యంగా సామాజిక న్యాయం, సమానత్వం సాధించే దిశలో ఒక శక్తివంతమైన సాధనంగా ఉపయోగపడుతుంది.ప్రస్తుతం విద్య, ఉద్యోగ రంగాల్లో అమలవుతున్న రిజర్వేషన్ల విధానం పాత జనాభా అంచనాలపై ఆధారపడి ఉంది. కులగణన ద్వారా ప్రతి కులం ఖచ్చితమైన జనాభా సంఖ్య తెలుస్తుంది. ఈ సమాచారం ఆధారంగా రిజర్వేషన్ల విధానాన్ని మరింత సమర్థవంతంగా, న్యాయంగా పునఃపరిశీలించే అవకాశం ఉంటుంది. ఏయే కులాలకు ఎంత ప్రాతినిధ్యం అవసరమో గుర్తించి ప్రస్తుతం సమాజంలో నెలకొన్న అసమానతలను తగ్గించవచ్చు. అంతేకాకుండా కులగణన వివిధ కులాల సామాజిక, ఆర్థిక, విద్యా స్థితిగతులపై సమగ్రమైన సమాచారాన్ని అందిస్తుంది. ఈ డేటా ఆధారంగా ప్రభుత్వం ప్రతి కులం ప్రత్యేక అవసరాలను గుర్తించి వారికి లక్షిత అభివృద్ధి పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు రూపొందించవచ్చు. విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటి కీలక రంగాల్లో ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన కులాలను గుర్తించడం సులభమవుతుంది. ఇది వెనుకబడిన వర్గాల అభివృద్ధికి మరింత దోహదపడుతుంది.కులగణన వెనుకబడిన కులాల వాస్తవ పరిస్థితిని సమాజానికి తెలియజేస్తుంది. ఇది సమాజంలో వారి స్థానాన్ని మెరుగుపరచడానికి, వారు ఎదుర్కొంటున్న వివక్షను రూపుమాపడానికి, వారి సాధికారతను పెంపొందించడానికి అవసరమైన చర్యలు తీసుకోవడానికి ఒక బలమైన పునాదిని అందిస్తుంది. చారిత్రక అన్యాయాలను సరిదిద్దడానికి ఇది ఒక ముఖ్యమైన అడుగుగా పరిగణించవచ్చు. వనరుల కేటాయింపులో కూడా కులగణన కీలకపాత్ర పోషిస్తుంది. వివిధ కులాల జనాభా నిష్పత్తి, వారి అవసరాలపై ఖచ్చితమైన సమాచారం ఉంటే ప్రభుత్వం విద్య, ఆరోగ్యం, ఉపాధి వంటి రంగాలకు నిధులను మరింత సమర్థవంతంగా కేటాయించగలదు. ఇది ప్రాంతీయంగా కులాల వారీగా ఉన్న అభివృద్ధి అంతరాలను తగ్గించడంలో సహాయపడుతుంది. కులగణన డేటా సామాజిక శాస్త్రవేత్తలు, ఆర్థికవేత్తలు, ఇతర పరిశోధకులకు కుల వ్యవస్థ డైనమిక్స్‌ను అధ్యయనం చేయడానికి, వివక్ష మూలాలను గుర్తించడానికి సమర్థవంతమైన పరిష్కారాలను సూచించడానికి, ఒక విలువైన వనరుగా ఉపయోగపడుతుంది.ఇది విధాన రూపకర్తలకు ఆధారిత నిర్ణయాలు తీసుకోవడానికి సహాయపడుతుంది. భారత దేశం విశాల జనాభా, భౌగోళిక వైవిధ్యం కారణంగా సమగ్రమైన కులగణన నిర్వహించడం ఒక పెద్ద సవాలు. దేశంలో వేల సంఖ్యలో కులాలు, ఉపకులాలు ఉన్నాయి. వాటిని ఖచ్చితంగా వర్గీకరించడం ఒక పెద్ద సమస్య. ఒకే పేరుతో వేర్వేరు ప్రాంతాల్లో వేర్వేరు సామాజిక స్థానాలు కలిగిన కులాలు ఉండవచ్చు. దీనికి స్పష్టమైన, ప్రామాణికమైన వర్గీకరణ మార్గదర్శకాలను అభివృద్ధి చేయడం అవసరం. భాషా, ప్రాంతీయ వైవిధ్యాలను పరిగణనలోకి తీసుకోవాలి. అవసరమైతే సాంకేతికతను ఉపయోగించి డేటాను విశ్లేషించాలి, నిపుణుల సలహాలు తీసుకోవాలి. కాలక్రమేణా వ్యక్తులు, సమూహాలు తమ కుల గుర్తింపును మార్చుకునే అవకాశం ఉంది. రిజర్వేషన్ల కోసం లేదా సామాజిక ఉన్నతి కోసం ఇలా జరగవచ్చు.ఈ సమస్యను అధిగమించడానికి ప్రజల నుండి నేరుగా వారి కుల వివరాలను అడగడం, స్వీయ గుర్తింపును ప్రామాణికంగా తీసుకోవడం ఉత్తమం. డేటా సేకరణలో పక్షపాతం కూడా ఒక ముఖ్యమైన సవాలు. గణన సిబ్బంది వారి వ్యక్తిగత నమ్మకాలు లేదా అంచనాల ఆధారంగా తప్పుగా డేటా నమోదు చేసే అవకాశం ఉంది. దీనిని నివారించడానికి సిబ్బందికి కులం సున్నితత్వాన్ని ఖచ్చితమైన డేటా సేకరణ ప్రాముఖ్యతను తెలియజేస్తూ సమగ్రమైన శిక్షణ ఇవ్వాలి. పర్యవేక్షణ యంత్రాంగాన్ని బలోపేతం చేయాలి, యాదృచ్ఛిక తనిఖీలు నిర్వహించాలి. కులగణన రాజకీయంగా సున్నితమైన అంశం కాబట్టి తప్పుడు సమా చారం ఇవ్వడానికి లేదా డేటాను తారుమారు చేయడానికి ఒత్తిడులు ఉండవచ్చు. డేటా సేకరణ ప్రక్రియను పారదర్శకంగా ఉంచడం, డేటా భద్రత గోప్యతను నిర్ధారించడం చాలా ముఖ్యం. రాజకీయ జోక్యాన్ని నివారించడానికి స్వతంత్ర సంస్థల పర్యవేక్షణను ఏర్పాటు చేయాలి కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. దీనిని అధిగమించడానికి ఆధునిక సాంకేతికతను ఉపయోగించడం, దశలవారీగా గణన నిర్వహించడం, వనరులను తెలివిగా కేటాయించడం అవసరం.

ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం కూడా ముఖ్యమైనది. కులగణన ఉద్దేశం, దాని సంభావ్య ఉపయోగాల గురించి ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడం వల్ల వారు తప్పుడు సమాచారం ఇవ్వవచ్చు లేదా సహకరించకపోవచ్చు. దీనిని అధిగమించడానికి విస్తృతమైన అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలి. ప్రజల సందేహాలను నివృత్తి చేయాలి. మీడియా ప్రజా నాయకుల సహకారం తీసుకోవడం కూడా ఉపయోగపడుతుంది. చివరగా సేకరించిన కులాల డేటా గోప్యత, భద్రతను నిర్ధారించడం చాలా ముఖ్యం. డేటా లీక్ కావడం లేదా దుర్వినియోగం కావడం జరిగితే తీవ్రమైన పరిణామాలు ఉండవచ్చు. డేటా నిల్వ, నిర్వహణ కోసం కఠినమైన భద్రతా ప్రోటో కాల్‌లను అనుసరించాలి అధునాతన సాంకేతికతలను ఉపయోగించాలి. కులగణన సఫలం కావాలంటే అనేక జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం.స్పష్టమైన లక్ష్యాలు, పరిధిని నిర్దేశించడం, సమగ్రమైన ప్రణాళిక వ్యూహం రూపొందించడం, ఖచ్చితమైన వర్గీకరణ వ్యవస్థను అభివృద్ధి చేయడం, సమర్థవంతమైన శిక్షణ ఇవ్వడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడం, పారదర్శకత పాటించడం, డేటా గోప్యతను నిర్ధారించడం, ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, రాజకీయ జోక్యాన్ని నివారించడం, నిపుణుల కమిటీని ఏర్పాటు చేయడం, క్రమానుగత పర్యవేక్షణ చేయడం వంటి చర్యలు తీసుకోవాలి. ఈ జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా కులగణన మరింత విజయవంతం కాగలదు. సామాజిక న్యాయం సమానత్వం సాధనలో ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది.

# ఖనిజ ఒప్పందం ఎవరికి లాభం?



ఉక్రెయిన్‌లోని అపారమైన, అరుదైన ఖనిజ సంపదను చేజిక్కించుకోవాలనుకున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఎట్టకేలకు పైచేయి సాధించారు. అపురూప ఖనిజాలపై చైనా ప్రాభవానికి బ్రేకు వేయాలని ట్రంప్ పట్టుదలగా ఉన్నారు. అత్యంత ఆధునిక సాంకేతిక, రక్షణ రంగాలకు అవసరమయ్యే కీలకమైన, అపురూప ఖనిజాల్లో ప్రపంచం మొత్తం మీద 90% వరకు చైనాయే ఉత్పత్తి చేస్తోంది. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్ ఖనిజ ఒప్పందంపై గత కొంతకాలంగా ట్రంప్ పట్టుదలగా ఉండడం గమనార్హం. ఖనిజ తవ్వకాలకు ఒప్పందం కుదిరితేనే రష్యా ఉక్రెయిన్ మధ్య యుద్ధాన్ని నివారించడానికి, శాంతిని నెలకొల్పడానికి ప్రయత్నిస్తానని పట్టుబట్టి తన పంతం నెగ్గించుకున్నారు. ఇక ఏం చేయాలో దిక్కుతోచక ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తలవంచక తప్పలేదు.అయితే ఈ ఒప్పందం వల్ల రష్యా యుద్ధం ఆగిపోతుందా? ఖనిజాల తవ్వకాల నుంచి వచ్చిన నిధులు ఉక్రెయిన్ పునరాభివృద్ధికి ఉపయోగపడతాయా? ఆ మేరకు అమెరికా ప్రభుత్వం సహకరిస్తుందా? అన్న ప్రశ్నలకు ఇంకా సరైన సమాధానాలు లభించడం లేదు. ఈ ఒప్పందానికి సంబంధించిన పూర్తి వివరాలను ఇరుదేశాలు ప్రస్తుతం గోప్యంగానే ఉంచాయి. ఈ కొత్త ఒప్పందాన్ని 'యుఎస్ ఉక్రెయిన్ రీఇన్వెస్ట్‌మెంట్ ఫండ్' అని వ్యవహరిస్తున్నారు. ఖనిజ తవ్వకాలకు ఉక్రెయిన్ వీలు కల్పించినందున దానికి ప్రతిఫలంగా ఉక్రెయిన్ 'సంయుక్త పునర్నిర్మాణ పెట్టుబడి నిధిని ఏర్పాటు చేస్తున్నారు. ఈ నిధికి ఉక్రెయిన్ అమెరికా చెరిసగం నిధులు సమకూర్చవలసి ఉంటుంది. ఈ ఒప్పందంలో ఏడు ముఖ్యమైన అంశాలు ఇమిడి ఉన్నాయి.

ఖనిజ వనరుల కోసం ఉమ్మడిగా అన్వేషణ చేయడం, ఉక్రెయిన్ అభివృద్ధికి పెట్టుబడులు ముమ్మరంగా ప్రవహింప చేయడం, ఉక్రెయిన్‌లో శాంతిని నెలకొల్పడం, పాత అప్పుల గురించి అడగకపోవడం, రష్యా పట్ల ముఖ్యంగా పుతిన్ పట్ల అమెరికా కఠిన వైఖరిని అవలంబించడం, ఖనిజ వనరుల లబ్ధి అమెరికా పొందినా కానీ యాజమాన్యం మాత్రం ఉక్రెయిన్ కిందే ఉండాలనడం, యూరోపియన్ యూనియన్‌లో చేరాలన్న ఉక్రెయిన్ చిరకాల స్వప్నానికి ఆటంకం కలగకుండా చూడడం అనే సంక్లిష్ట అంశాలు ఉన్నాయి. మరి వీటిలో ఏయే అంశాలకు అమెరికా సహకరిస్తుందో లేక తిరస్కరిస్తుందో చూడాలి.ముఖ్యంగా రష్యా అధ్యక్షుడు పుతిన్ పట్ల కఠిన వైఖరి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అవలంబించ గలుగుతారా? అన్నది మీమాంసే.ఉక్రెయిన్‌కు 350 బిలియన్ డాలర్లు ఇచ్చామని, ఆ సొమ్ము తిరిగి ఇవ్వాలని ట్రంప్ గతంలో డిమాండ్ చేశారు. కొత్త ఒప్పందం ప్రకారం ఆ డబ్బును తిరిగి ఉక్రెయిన్ ఇవ్వాలిన అవసరం లేనట్టు స్పష్టమవుతోంది. ఇప్పుడు ఉక్రెయిన్‌కు తాము ఇప్పటిదాకా ఇచ్చిన దాని కన్నా అధికంగా తిరిగి పొందబోతున్నామని ట్రంప్ చెప్పడం గమనార్హం. ఈ ఒప్పందం వల్ల ఉక్రెయిన్‌కు రష్యా నుంచి కానీ మరే దేశం నుంచి యుద్ధాలు తలెత్తకుండా అమెరికా నుంచి పూర్తి భద్రత లభిస్తుందని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఎంతో ఆశిస్తున్నారు. కానీ ఇప్పుడు కుదిరిన ఒప్పందంలో భద్రతపై గ్యారంటీ మాత్రం ప్రస్తావించలేదు. మరి భద్రతపై గ్యారంటీ లేని ఈ ఒప్పందాన్ని ఉక్రెయిన్ పార్లమెంట్ ఆమోదిస్తుందా? అన్న అనుమానం కలుగుతోంది. వాస్తవానికి యుద్ధంలో ఉక్రెయిన్‌కు ఎన్నో చిక్కులు వచ్చి పడుతున్నాయి.ట్రంప్ వచ్చిన తరువాత ఏమాత్రం భరోసా లభించడంలేదు. ఈ పరిస్థితుల్లో అమెరికా మద్దతు లేకుంటే సైనికులకు ప్రమాదం తప్పదు. గట్టి భద్రత ఉక్రెయిన్‌కు కల్పిస్తామన్న గ్యారంటీకి ట్రంప్ ఇష్టపడడం లేదు. పరిమిత ప్రయోజనాలతో ఉక్రెయిన్ చివరకు ఈ ఒప్పందానికి ఒప్పుకోక తప్పలేదు. ప్రపంచం మొత్తం మీద ఉండే ఖనిజాల్లో 5% ఉక్రెయిన్‌లోనే ఉండగా, ఉక్రెయిన్ ఖనిజ లోహాల నిల్వల్లో 40% ప్రస్తుతం రష్యా నియంత్రణలోనే ఉన్నాయి. ఇవన్నీ వినియోగం కాలేదు. ప్రపంచం మొత్తం మీద ఉండే గ్రానైట్‌లో 20% ఉక్రెయిన్‌లోనే ఉంది. అలాగే ప్రపంచం మొత్తం మీద మాంగనీస్ ఉత్పత్తుల్లో ఎనిమిదో స్థానం, టిటానియం ఉత్పత్తిలో 11వ స్థానంలో ఉక్రెయిన్ ఉంది.అరుదైన ఖనిజాలు ఆరు క్షేత్రాల్లో ఉన్నాయని, నోవో పోల్టావ్ స్కే వద్ద గనుల అభివృద్ధికి 300 మిలియన్ డాలర్లు అవసరమవుతాయని జెలెన్‌స్కీ గతంలో వెల్లడించారు. కీలకమైన ఖనిజాలు వంద కన్నా ఎక్కువ నిల్వలు ఉన్నాయని, టిటానియమ్, లిథియమ్‌తోపాటు 19 మిలియన్ టన్నుల గ్రాఫైట్ నిల్వలు ఉన్నాయని ఉక్రెయిన్ చెబుతోంది. అయితే 350 బిలియన్ డాలర్ల విలువైన గనులు రష్యా ఆక్రమిత ఉక్రెయిన్ భూభాగాల్లోనే ఉన్నాయని అంటోంది. కొన్ని సహజ వనరుల సమాచారం ప్రభుత్వ రహస్యంగా ఉంచడం సోవియెట్ తరం నాటి విధానంగా ఉంటోంది. గత ఏడాది సహజ వనరుల నుంచి 1.1 బిలియన్ డాలర్లనే రాయల్టీగా ఉక్రెయిన్ ప్రభుత్వం పొందగలిగింది. రష్యా ఆక్రమిత ఉక్రెయిన్ భూభాగాల్లో ఖనిజాల తవ్వకం చేపట్టాలంటే ముందు ఆయా భూభాగాల పొరల్లో నిక్షిప్తమై ఉన్న మందుపాతరలను చాకచక్యంగా నిర్మూలించవలసి ఉంటుంది. ఈ మేరకు ఖనిజాల అన్వేషణ, సర్వే వంటి వాటికి చాలా వ్యయప్రయాసలు భరించక తప్పదు.

# జాయ సేనాపతి చారిత్రక కాల్పనిక నవల



కొండయ బృందంతో కలిసి నాటకాలు వేస్తున్న జాయప.. ఒకనాడు కాకతీయ ఆస్థాన నర్తకి నీలాంబ దగ్గర తేలాడు. ఆమె ఆధ్వర్యంలో జరిగే నాట్యోత్సవం కోసం రాచనగరులో అడుగుపెట్టాడు. తమ రాజ్యంపై దాడిచేసి.. తనతండ్రిని ఓడించిన గణపతి దేవుణ్ని తొలిసారి చూడబోతున్నాడు. దాంతో చాలా ఉద్వేగంగా ఉన్నాడు ఆ ద్వీప రాకుమారుడు.

గణపతిదేవుని ప్రవేశంతో భట్రాజులు బృందగానం ప్రారంభించారు

"ఓం శ్రీ శ్రీ నమఃశివాయ.. నమఃరుద్రాయ
సకల గుణాలంకార.. పరనారీదూర
అనుమకొండ పురేశ్వరా సోమలదేవీ నిజేశ్వరా
దోర్బలభీమా రణరంగ రామా
వితరణకర్ణా శౌర్య సౌవర్ణా
పరహితాంజనేయా శౌచగాంగేయా
సత్యరత్నాకరా దుష్ట జనభీకరా
స్వామిద్రోహరగండ శ్రీశ్రీ కాకతి
వంశాబ్ధి కులచంద్రమా
శ్రీశ్రీశ్రీ రాయగజకేసరి బిరుదాంకి
శ్రీశ్రీశ్రీ గణపతిదేవ మహారాజులుంగారు
వేం చేయుచున్నారోహెూ! వేం చేయుచున్నారోహెూ..
వేం చేయుచున్నారోహెూ! వేం చేయుచున్నారోహెూ.."

భట్రాజుల స్తోత్రపాఠాలకుతోడు రుంజలు, బూరలు, తప్పెట్ల సంగీతహెూరు ఆ ప్రాంగణమంతా ప్రతిధ్వనిస్తుండగా, అందరూ విభ్రాంతిగా రెప్పవెయ్యకుండా చూస్తుండగా.. మహా మండలేశ్వరుడు, కాకతీయచక్రవర్తి శ్రీశ్రీశ్రీ గణపతిదేవుడు హుందాగా నడచివచ్చి, తన సింహాసనం వద్ద నిలబడ్డాడు. వెంటవచ్చిన లెంకలు వెనక్కి వెళ్లారు. ఆ హెూరు తగ్గాక ఆయన చేతులు జోడించి సభకు నమస్కరించాడు. అప్పుడు ఆయన వంక చూడటం అందరికీ ఎంతో ఉత్తేజంగా, కన్నుల పండువగా ఉంది. తిరుచూర్ణపు అంచున్న వెండిరంగు పట్టుపంచె కట్టి.. పైన బంగారు, ఎరుపు కలనేత కంచుకం ధరించి, వజ్ర వైడూర్యాలు పొదిగిన హారం, పొడుగైన ముత్యాలదండ ఎదపై కదలాడుతుండగా.. నడుముకు ఉత్తరీయం చుట్టి, దానిలో వజ్రాలపిడిగల చురకత్తి దోపాడు. ముఖాన విభూతిరేఖలపై నిలువు ఎర్రెర్రని బొట్టు. తలపై బంగారు రంగు తలపాగా.. నిండైన కోరమీసం. స్థిరపడిన యవ్వనంతో తుళ్లిపడుతున్న ఉత్కృష్టరూపం. రాజ్యభారం ఏమాత్రం కష్టం అనిపించనట్లుగా విశాలమైన నవ్వు.. ఆరడుగుల ఆజానుబాహువై.. స్థితప్రజ్ఞునిలా గోచరిస్తున్నాడు. ఎవరినైనా తనవైపు తిప్పుకోగల బలమైన వ్యక్తిత్వం.. శారీరక దృఢత్వంతో కలగలిసిన మానసిక పటుత్వం.. ముఖంలో తేజరిల్లుతుండగా, అన్నివైపులా తల తిప్పుతూ అందరినీ మధురస్మితంతో పలకరిస్తున్నట్లు చూస్తున్నాడు. 'భలే ఉన్నాడే! తెలివైన పరాక్రమశీలి కావచ్చు.. నాకు నచ్చాడు!!'.. జాయప పెదాలు అస్పష్టంగా కదలాడాయి. గణపతిదేవుణ్ని చూస్తూ కనురెప్పలు కదలిక మరిచాయి. ప్రాంగణ ఉత్తరభాగంలో ఉన్నతవేదిక. దానిపై సమున్నతంగానున్న వజ్ర వైడూర్య ఖచిత బంగారు సింహాసనంపై ఆయన ఉపవిష్టుడయ్యేవరకూ.. ప్రాంగణంలోని పెద్దలంతా నిలబడి చేతులుజోడించి, వినయంగా వంగి ఉన్నారు. ఆయన కూర్చుని చిరునవ్వుతో సైగ చేశాక.. అందరూ కూర్చున్నారు.

ఇది రాచరికపు సంప్రదాయం.

అది సాయంకాల సాంస్కృతిక కార్యకలాపం కాబట్టి కనీసపు రాచమర్యాదలు నిర్వహించారు. అదే ఉదయపు చక్రవర్తుల ప్రధాన సభా సమావేశమైతే పూర్తిస్థాయి రాచరికపు పద్ధతులు ఉంటాయి. ఇవి శివరాత్రి పర్వదిన సంరంభాలు కాబట్టి చక్రవర్తి కొంచెం విశ్రాంతిగా కనిపిస్తున్నారు. ఆయన మంత్రులు, ప్రధానులు, నియోగాధిపతులు.. తదితర అధికారవర్గాలు సాధారణ దుస్తులలో వచ్చి, విశ్రాంతిగా కూర్చుని.. తీరుబడిగా అందరితో ముచ్చట్లు చెబుతున్నారు. నగరులో ఉన్నవారు, రాచకార్యాలులేని ముఖ్యులు, కుటుంబాలతో తరలివచ్చారు. సాధారణ ప్రేక్షకుల్లో ఎక్కువగా రాచనగరు ఉద్యోగులు, వారి కుటుంబాలు ఉన్నాయి. ప్రాంగణం ఎక్కువగా కవులు, సాహితీవేత్తలు, స్థపతులు, శిల్పాచార్యులు, విద్యాప్రకాశకులు, నాట్యాచార్యులు, గాయకులతో కళా సాహితీ సమరాంగణంలా భాసిస్తున్నది. చక్రవర్తి పట్టమహిషితో హాజరుకావడం.. ప్రధాన సభా సమావేశాలతో పోల్చితే తక్కువమంది ఉండటంతో అందరికీ చక్రవర్తి దంపతులను దగ్గరగా చూడటం ఉత్తేజంగా ఉంది. చక్రవర్తి కూడా అందరితో పరిహాసయుక్తంగా, కళాభిజ్ఞతతో మాట్లాడుతుండటం ఆ సాయంవేళ మరింత శోభాయమానంగా ఉన్నది.అక్కడ కొంచెం హడావుడిగా ఉన్నది.. కార్యక్రమ నిర్వాహకుడైన గుండయామాత్యులు మాత్రమే. ఆయన సైగ చేయగా రూకలసంచులు ఉంచిన బంగారు తళియ పట్టుకున్న అడపంధారి.. సింహాసనం పక్కకు వచ్చి వినయంగా నిలబడింది. చక్రవర్తి చూశాడు. నవ్వి..

"ఊ.. గుండయామాత్యులు అన్నీ సిద్ధం చేసినట్లున్నారు. కాస్త విశ్రాంతిగా మీ ఆసనంలో ఆసీనులుకండి!" అన్నాడు హాస్యస్ఫోరకంగా.

"నీలాంబ కంటే ఆయనే నాట్యం చేసేలా ఉన్నాడు ప్రభూ.." అల్లరిగా అన్నాడొక మంత్రి పుంగవుడు.

చక్రవర్తితోపాటు ప్రాంగణమంతా నవ్వులతో పరిమళించింది. గుండయామాత్యుడు నగుమోము తెచ్చిపెట్టుకుని రాజాజ్ఞను గౌరవించినట్లు ఆసనంలో కూర్చుని తిరిగి లేచాడు.

"నిజానికి వారు నాట్యగురువులు. నిర్వహణాధికారం ఇచ్చి వారి నాట్యకౌశలాన్ని మనం కోల్పోయామేమో.." అన్నాడు చక్రవర్తి. మళ్లా మందిరమంతా చిరునవ్వులు. జాయప ఆలోచన తిరిగి అక్కలవైపు మళ్లింది. చూపు అంతఃపుర ప్రాంగణ ద్వారంపైనే ఉన్నది. అప్పుడే అంతఃపుర ద్వారాలు తెరచుకున్నాయి. పట్టపురాణి శ్రీమతి సోమలదేవి అంతఃపుర అధికార మర్యాదలతో, దాసదాసీ పరివారంతో మరోసారి మందిరంలోకి వచ్చింది. ఈసారి ఆమె చేతిలో జ్యేష్ఠపుత్రిక గణపాంబ.

ఉద్విగ్నంగా లేచి వచ్చిన అంతఃపుర స్త్రీలను రెప్పవెయ్యకుండా చూశాడు జాయప. అక్కలు కనిపిస్తే.. వాళ్లను బంధవిముక్తులను చెయ్యమని మోకాళ్లపై వంగి చక్రవర్తిని ప్రార్థించాలని భావించాడు. ప్చ్.. నిరాశే ఎదురయ్యింది. అక్కలు అక్కడ కనిపించలేదు.

పరివారం ఆసనాల వద్ద ఆగిపోగా, సోమలదేవి చక్రవర్తి వద్దకు వచ్చి పక్కనున్న ఉచితాసనంలో కూర్చున్నది. తండ్రిని చూసిన చిన్నారి గణపాంబ తండ్రి వైపు దూకుతున్నది. ఆయన మరింత పుత్రికోత్సాహంతో కూతుర్ని అందుకుని ఒడిలో అదుముకున్నాడు.

జాయప గణపతిదేవుణ్ని, సోమలదేవిని జంటగా చూసి చాలా ఆశ్చర్యపోయాడు. రాజు, రాణి అంటే తన తల్లిదండ్రుల వయసులో ఉంటారని అతని అవ్యక్త అభిప్రాయం. కానీ, కాకతీయ చక్రవర్తి, ఆయన పట్టమహిషి పూర్తిగా చిన్నవాళ్లు. చక్రవర్తి తన బాబాయి కంటే చిన్నవాడు. బహుశా నాగంభట్టు, త్రిపుర వయసు ఉండొచ్చు. సోమలదేవి తన అక్కలకంటే ఎక్కువే పెద్దది. పెద్దక్క నీలాంబ కంటే చిన్నది కావచ్చు. అప్పుడే మరో ఆలోచన కూడా జాయప బుర్రలో మెరిసింది. గణపతిదేవుడు తనకు బావ కాగల వయసు వాడే. ఇలాంటి చక్రవర్తి తన అక్కలను వివాహమాడితే?! అక్కలు కూడా మహారాజు కుమార్తెలే కదా!? తప్పేముంది!! పైగా గణపతిదేవుడు అందగాడు. సోమలదేవి అందవిహీనం కాదుగానీ, మరీ మగరాయుడు. తన అక్కలు అందాల రత్నాలు.. వజ్రాల మెరుపు తీగెలు. బావుంది బావుంది!! ఈ ఆలోచన మనసంతా తేనెలూరించింది.

వెనకనుంచి నీలాంబ అతని వీపుపై తట్టింది.

"ఏమిటి జాయపా.. నవ్వుకుంటున్నావ్?" అన్నది.

అప్పుడొచ్చాడు ఇహ లోకంలోకి. మరోసారి కళాకారులను అందరినీ హెచ్చరించింది నీలాంబ.

అక్కలు కనిపిస్తే..
వాళ్లను బంధవిముక్తులను
చెయ్యమని మోకాళ్లపై వంగి
చక్రవర్తిని ప్రార్థించాలని భావించాడు. ప్చ్.. నిరాశే ఎదురయ్యింది.
గుండయామాత్యుడు లేచి..

"శివరాత్రి పర్వదిన ఉత్సవాల్లో భాగంగా కాకతీయ ఆస్థాననర్తకి నీలాంబ బృందం ఈరోజు ప్రదర్శించే నృత్య కార్యక్రమం 'ప్రహ్లాద విజయం' ప్రారంభించడానికి అనుమతి ఇవ్వవలసిందిగా మహామండలేశ్వరులవారిని కోరుతున్నాను.." అన్నాడు చేతులు జోడించి వినయంగా.

ఆయన నవ్వుతూ..

"ఊ.. శుభం.. ప్రారంభించండి!" అన్నాడు.

అందరూ చప్పట్లు కొడుతుండగా.. నీలాంబ వయ్యారంగా కదిలి తాంబూలపళ్లెరంతో పరిచారిక వెంటరాగా, వెళ్లి చక్రవర్తి ముందు వినయంగా ఇంచుక ఒయ్యారంగా తాంబూలం తీసి ఆయన చేతికి ఇచ్చింది. పన్నీరుకోర పైకెత్తి ఆయన పైనా, సోమలదేవి పైనా పన్నీరు చిలుకరించింది. చిన్నారి గణపాంబపై మరింత చిలుకరించింది. ప్రాంగణమంతా చప్పట్లతో మారుమోగింది. సంప్రదాయాన్ని గౌరవిస్తున్నట్లు ఇద్దరూ చిరునవ్వు నవ్వారు.

"నీలాంబా.. శివరాత్రి శుభాకాంక్షలు! రాజ్య ప్రజలంతా శివరాత్రి ఉత్సవాలను అంగరంగవైభవంగా జరుపుకొంటున్నారు. మరి రాచనగరులో మేము కూడా ఉత్సవాలు జరుపుకోవాలి కదా. మీ నాట్యమే మా ఉత్సవం.. ప్రారంభించండి!" అన్నాడు గణపతిదేవుడు.

ఆమె మరోమారు చక్రవర్తి దంపతులకు నమస్కరించి దిగి వస్తూ.. ఆమెవైపే చూస్తూ గుటకలు మింగుతున్న కవి గాయక సాహితీమూర్తులకు నమస్కరిస్తూ.. వారి ఆశీర్వాదాలు, కామప్రకంపనలు అందుకుంటూ.. నాట్యమండపానికి చేరింది. అనంతరం వాద్యఘటిక మోగింది. అప్పుడే సమయాన్ని తెలిపే ఝాముల ఘటిక కూడా సమాంతరంగా మోగింది. చక్రవర్తి తృప్తిగా తలపంకించాడు. నిర్దేశించిన సమయానికి కార్యకలాపం ప్రారంభమవడంతో గుండయామాత్యుడు, సోమలదేవి హాయిగా నిట్టూర్పు వదిలారు.రంగస్థలంపై మృదంగధ్వని.. దానితో నట్టువాంగ చిడుతలధ్వని కలిసి మనోహరంగా ప్రారంభం కావడంతో ప్రేక్షకులంతా రంగస్థలంపై దృష్టి నిలిపారు. లోపల రంగదేవతా పూజనం చేశారు నీలాంబ బృందం.

'శుక్లాంబర ధరం విష్ణుం
శశివర్ణం చతుర్భుజం
ప్రసన్న వదనం ధ్యాయేత్
సర్వ విఘ్నోప శాంతయే..
ఆంగికం భువనం యస్య వాచకం సర్వ వ్మాయం!
ఆహార్యం చంద్ర తారాది తం వందే సాత్వికం శివం!!'

రంగదేవతా పూజనం అయ్యాక తెర తొలగింది. మృదంగ దరువుతో రాగరంజితంగా ప్రారంభమైంది ప్రదర్శన. నీలాంబ గొప్పనర్తకి. తన కార్యకలాపాలన్నీ రాజనగరులో.. ముఖ్యంగా చక్రవర్తి సమక్షంలో ఉంటాయి. కాబట్టి అత్యుత్తమ స్థాయి కళాకారులనే ఆమె తన బృందంలోకి ఆహ్వానిస్తుంది. వారికి ప్రఖ్యాతులైన గురువులతో నిరంతరం నాట్యాభ్యాసం నిర్వహిస్తుంది. ఈ ఏడాది ఆమె దాదాపు పది నాట్య ప్రదర్శన అంశాలను సిద్ధం చేసుకుని ఉన్నది. హఠాత్తుగా ఒక నటుడు అదృశ్యం కావడం కంగారుపెట్టినా.. అనుకోకుండా జాయప లభించడం ఆమె బృందానికి అదనపు బలం.. అదనపు ఆకర్షణ కూడా!

ప్రహ్లాదుడుగా జాయప! పూర్తి ఆహార్యంతో ఉన్న జాయప నిజమైన ప్రహ్లాదుడిలా కళ్లు తిప్పుకోలేనంత అద్భుతంగా గోచరించాడు నీలాంబకు, తోటి నర్తకీ బృందానికి. అతని ముఖంలో అక్కలు కనిపించలేదన్న విషాదవీచికలు.. కనిపించీ కనిపించని ఏదో అసంతృప్తి! తప్పక వస్తారేమోనన్న ఆశ కలిగిస్తున్న సన్నని వెలుగు.. కలగలిసిన సహజ చాతుర్యంతో అందరినీ తనవైపు తిప్పుకొంటున్నాడు జాయప.

నాటకం సనకసనందనాది మునుల విష్ణుమూర్తి ప్రార్థనతో ప్రారంభమై.. రెండవ అంకం తెర తొలగగానే ప్రవేశించాడు ప్రహ్లాదుడు.. జాయప!!

"నారాయణ మంత్రం..
శ్రీమన్నారాయణ భజనం"..

నాట్యమండపమంతా దిగ్భ్రమతో మూగబోయింది..

ప్రహ్లాదుడు అనేవాడు ఇలాగే ఉంటాడేమో!? ఆ మహాభక్తుడే నిజంగా కాకతీయ నాట్యమందిరానికి వచ్చాడేమో!? ఆ ముఖంలో భక్తిభావం.. తన తండ్రిలోని రాక్షసత్వం తెలిసినప్పటి బాధ.. కలగలిసిన ముఖంతో ఆ పసివాడు.. రక్షించాల్సిందిగా నారాయణున్నే చూస్తున్నట్లు తనవైపే చూడటం.. గణపతిదేవుడు గుర్తించాడు.

# తీకు తీర లేవరా..

పంద్రాగస్టుకు వర్షం అడ్డొచ్చేది కనుక.. మా బళ్లో జనవరి 26 వేడుకలు గొప్పగా చేసేవారు. తరువాతి రోజుల్లో స్కూల్ డేనూ బాగా జరిపేవారు. వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం, పాటల పోటీలు.. వారంరోజుల ముందునుంచీ జరిగేవి. ఆటల పోటీలు కూడా అంతే! రెండు వారాల ముందునుంచే హడావుడి మొదలయ్యేది.మాబడిలో విద్యార్థుల సంఖ్య పెరగడంతో.. మెయిన్ బిల్డింగ్ సరిపోయేది కాదు. ఊరివాళ్ల సహకారంతో నిర్మించిన ఓ పొడవాటి గుడిసెలో ఎనిమిదో తరగతి రెండు సెక్షన్లూ జరిగేవి. బయటి ప్రపంచం కనిపించేది గనుక మాకూ ఆ గుడిసే అద్భుతంగా ఉండేది. ఓ పొడవైన గుడిసెలో ఇండోర్ పోటీలు జరిగేవి. పోటీలు అయ్యేటప్పుడు మాకు మధ్యాహ్నం క్లాసులు ఉండేవి కావు. లంచ్ అవగానే.. ఆటలు మొదలు పెట్టేవారు. పోటీల విషయానికొస్తే ఒక్క పాటల్లో తప్ప.. నేను అన్నిట్లో పేరు ఇచ్చేదాన్ని. ఇలా అనేకంటే.. ముందు మా టీచర్లే నాపేరు రాసేవారు. వ్యాస రచన, వక్తృత్వ పోటీల్లో నాకే ఫస్ట్ ప్రైజ్ వచ్చేది. పోటీలున్న రోజుల్లో క్లాసులు పెద్దగా జరిగేవి కావు గనుక, లంచ్ అవర్లో ఇంటికి వచ్చి మరికొంత సేపు బిందాస్‌గా గడిపేవాళ్లం.

ఓసారి ఇలాగే ఇంటికి వచ్చాం. అక్క తొమ్మిది, నేను ఎనిమిదో తరగతిలో ఉన్నాం. అక్క స్నేహితులందరూ ఇంటికొచ్చారు. అమ్మ పెట్టిన కిచిడీ తిని.. ఇంటి వెనుక పెరట్లోకి దౌడు తీశాం. నేను నా సహజ లక్షణం ప్రకారం జామచెట్టు ఎక్కాను. ఆ చెట్టు ఏడాది పొడవునా విరగకాసేది. అక్క ఫ్రెండ్స్ అందరికీ పండ్లు తెంపి కిందికి విసిరేశాను. అందరూ కబుర్లు చెప్పుకొంటూ దూరంగా ఉండగా.. ఒక్క రోజారాణి అనే పక్కూరి అమ్మాయి మాత్రం ఆ చెట్టు కిందినుంచి కదల్లేదు. "రమా! నువ్వు చెట్టు దిగేదాన్క ఇక్కడ్నే ఉంట తియ్యి" అని నన్ను సంతోషపెడదామని చూసింది. నేనేం ఉబ్బిపోలేదు. "ఏంగాదు తియ్యి. నేను ఈ చెట్టు రోజుకు పదిసార్లు ఎక్కుత, దిగుత. కావాల్నంటే నువ్వు కూడా పో అక్కా!" అన్నాను. అక్క ఫ్రెండ్స్‌ను మనం కూడా 'అక్కా!' అనుట ధర్మమే కదా! ఆమె వదల్లేదు. అవీ ఇవీ మాట్లాడి చివరికి "రమా ఇవ్వాళ ఉపన్యాస పోటీల ఏం మాట్లాడుతవోయ్!" అని అడిగింది. అలాంటి విషయాల్లో నా సోయిలో నేనుండను. అడిగింది కదా.. అని నేను ప్రిపేర్ అయిన మ్యాటర్ అంతా నోటికి చెప్పేశాను. ఆ తరువాత చూడమని నా నోట్‌బుక్ కూడా ఆమెకు ఇచ్చాను. "అబ్బ! మంచిగ ప్రిపేర్ అయినవు గదబ్బా! నీకే ఒస్తది ఫస్ట్‌ప్రైజ్!" అని నన్ను మెచ్చుకున్నది. ఆ తర్వాత స్కూల్‌కి వెళ్లాం. మధ్యాహ్నం ఒంటిగంటకు వక్తృత్వ పోటీ మొదలైంది. అంశం.. 'స్వాతంత్ర్యోద్యమంలో నా అభిమాన దేశ నాయకుడు' అనుకుంటా. ముందు పదో తరగతి వాళ్లు, తరువాత తొమ్మిదో తరగతి వాళ్లు, ఆ తరువాత మా వంతు.. అంటే ఎనిమిదో తరగతి. కొందరు కాగానే.. 'రోజారాణి, నైన్త్ ఏ' అని పిలిచారు. వెంటనే మన సోదరి నడుచుకుంటూ వెళ్లి, మొత్తం నా పాయింట్స్ అన్నీ.. వరుసక్రమం కూడా మార్చకుండా చెప్పేసింది. గాంధీ మహాత్ముడు.. దక్షిణాఫ్రికాలో రైలు పెట్టెలోనుంచి బయటికి వెళ్లగొట్టబడటం, స్వదేశానికి రావడం, సహాయ నిరాకరణోద్యమం, దండి మార్చ్, రౌండ్ టేబుల్ సమావేశాలు, సత్యాగ్రహం, సబర్మతి ఆశ్రమం, అహింసే ఆయుధం.. ఇలా చెబుతూ పోతుంటే నేను తెల్లబోయి, ఆశ్చర్యపోయి, దిగ్భ్రాంతి చెంది.. ఎన్ని పర్యాయ పదాలున్నాయో అవన్నీ పొంది.. విభ్రమతో చూస్తూ ఉండిపోయాను. ఈ లోగా మనకూ కొద్దిమంది ద్రోణాచార్యులు ఉంటారు కదా! ఆ ముందు రోజు క్లాస్‌లో నేను చెప్పిందంతా ఆమె మాట్లాడుతుంటే.. 'అరె! రమ స్పీచ్ ఈమె మాట్లాడుతున్నదేంది?!' అనుకున్నారట. గాంధీ గురించి నేను చెబుదామనుకున్నవి ఇంకేమీ మిగల్లేదు. ఇంక నా బొంద.. నేనేం చెబుతాను? చెప్పినా ఆమె చెప్పిన తరువాత అవే చెబితే నాది కాపీ అవుతుంది. నాకు ఒకటే టెన్షన్! నేనేం చెప్పినా మా టీచర్లు.. 'ఇదేనా నువ్వు నేర్చుకున్నది?' అంటారేమోనని. అంత ఇదిలోనూ నాకు రోజారాణి తెలివికీ, జ్ఞాపకశక్తికీ ముచ్చటేసింది.నాకు ఒక్క ఇరవై నిమిషాలే టైం మిగిలింది. ఒక్క వేలు చూపించి బయటికి వచ్చి.. మాదే కాక పై తరగతులవాళ్ల ఉపవాచకాలు (నాన్ డిటైల్డ్ బుక్స్) కూడా తెచ్చుకుని 'ఝాన్సీ లక్ష్మీబాయి' గురించి కొంత సమాచారం సంపాదించాను. నా జన్మనామం ఝాన్సీ మరి! నా పేరు పిలవడానికి కొద్దిగా ముందు వచ్చి కూర్చున్నాను. నా పేరు పిలవగానే వెళ్లి ఝాన్సీ రాణి గురించి మాట్లాడాను. ఆమె పేరు మనూ తంబే అనీ, యుద్ధవిద్యలు నేర్చుకోవడం, భర్త చనిపోవడం, కొడుకును వీపుపై కట్టుకుని యుద్ధానికి వెళ్లడం.. ఇలా అప్పటికప్పుడు నేర్చుకున్నవన్నీ మాట్లాడేశాను. మొత్తానికి ఏదో 'కలిపి కొట్టరా కావేటి రంగా!' అన్నట్టయింది నా పని. చివరికి నాకు సెకండ్ ప్రైజ్ వచ్చింది. ఆ తరువాత మా అభిమాన గురువు వరదారెడ్డి సార్ నిజనిర్ధారణ జరిపి, విషయమంతా తెలుసుకున్నారు. ఆ అమ్మాయిని పిలిచి మందలించారు. పాపం.. ఆమెకు ప్రైజ్ కూడా రాలేదు. నన్ను పిలిచి.. "ఎందుకురా! అడిగినోళ్లకు, అడుగనోళ్లకుఅందరికీ చెప్పుడు? ఇప్పుడు జూడు, ఆ పిల్ల జెయ్యంగ నీకు ఫస్ట్ ప్రైజ్ రాకుండ బాయె! ఇంకొకసారి జెప్పినవంటే చూడు!" అని కోప్పడ్డారు. నేను ఏమాత్రం పశ్చాత్తాపం చెందకుండా.. "మనకు తెల్సింది నలుగురికి చెప్పాల్నని మీరే చెప్పిన్రు గద సార్!" అన్నాను. "నీ ఖర్మ!" అని తల కొట్టుకున్నాడు ఆయన. మా అక్క రోజారాణికి క్లాస్ పీకిందట. 'ఎహె! నేను రమను ఉత్తగనే అడిగిన! నేను కూడ శాన రాసుకొని నేర్చుకున్న!' అన్నదట. "ఎందుకు చెల్లే! నువ్వు నన్ను పిలిస్తె అప్పుడే దాన్ని మాతోపాటు దూరంగ తీసుకొని పోదును!" అని అక్క నన్ను కూడా తగురీతిలో మందలించింది. నేను అలాంటప్పుడు.. 'స్పీచ్ ఈజ్ సిల్వర్, సైలెన్స్ ఈజ్ గోల్డ్!' సూక్తిని పాటిస్తూ, వీలైనంత అమాయకంగా మోహం పెట్టి మాట్లాడకుండా ఉంటాను.



# దెబ్బకు దెబ్బ



మొగులుమీది పల్లెల ముప్పై ఇండ్లు ఉంటయి. అన్ని ఇండ్లకు ఒక్కటే కిరాణ దుకునం ఉంది. ఆయినె ఆడింది ఆట.. పాడింది పాట.. శెప్పింది ధర.. ఇచ్చిందే మాలు! ఆయినెను మాట అనడానికి లేదు. అట్లని సామాను కొనకుంట ఉండలేరు. ఆని ఇకమతులు.. జోకుట్ల గోల్‌మాల్ అన్ని దెలిశినా.. ఒక్కటే దుకునమాయె! ఊరోల్లంత గప్‌చిప్‌గ ఉందురు. కాదంటె ఉప్పుకారం గౌనాల్నన్నా అడివిలకెల్లి ఆరేడు కోసులు నడిశి పోవాలె. ఆ ఊల్లెనే రాయబోసు అనే ఒక ముసలాయినె గూడ ఉంటుండె. ఆయినెకు జెరంత కండ్లు మస్కమస్క గనిపిత్తయి గని.. సర్వం దెల్శినోడు. సర్వం జూశినోడు. రెండు మూడు బర్లున్నయి.

పాలు, పెరుగు అమ్ముకుంట ఆల్ల కుటుంబం బతుకుతాంది. దీలె పండుక్కు పోలెలు జేసుకుందామని కొత్త కోడలు పిల్ల అడిగితే.. బెల్లం దెద్దామని దుకునంకు వోయిండు రాయబోసు. రాయబోసుకు కండ్లు జరంత మస్కగ కనిపిత్తయని దుకునపాయినెకు దెలుసు. కిలో బెల్లం ఇయ్యిమంట రాయబోసు అడుగంగనే.. కండ్లు కనవడయని ముప్పావు కిలో బెల్లం జోకి, కిలో అంట ఇచ్చిండు. రాయబోసు వోతుంటే.. "తాతా! పండుక్కు ఇంట్ల నెయ్యడుగుతాండ్లు! ఓ కిలో అంత నెయ్యి వంపు" అంట జెప్పిండు. "అట్లనే!" అంట రాయబోసు ఇంటికి వోయి.. నెయ్యి జోక్కోని దెచ్చిచ్చిండు. నెయ్యి గిన్నెను కాంటకేశిన దుకునపాయినె.. "అగో! గిది ముప్పావు కిలోనే ఉంది" అనంగనే, "మా ఇంట్ల బాట్లుగీట్లు ఉంటయా బిడ్డా! నువ్విచ్చిన బెల్లానికే మా కోడలు ఎత్తుగట్టి నెయ్యిచ్చింది. బెల్లం కిలంతుంటె నెయ్యి గూడ కిలంతనే ఉంటది" అంట జెప్పిండు. తేలు గుట్టిన దొంగోలె.. నోరు మూస్కోని రాయబోసుకు పైసలిచ్చిడు దుకునపాయినె.